

వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**


సంపుటి : 24 సంచిక : 12
అక్టోబర్ - 2021
'ప్లవ' ఆశ్వీజ మాసం

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**దత్తయ్య అట్టెం**
**DATTAIAH ATTEM**

**Printed and Published by**
B. Anantha Laxmi

***Type Setting at :***
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.



**వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013**
**ఫోన్ : 9347971177**
**email : editormusi@gmail.com**


INTERNATIONAL STANDARD SERIAL NUMBER
**ISSN 2457-0796**



# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక**

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


మూసీ సాహిత్య ధార 6
పూర్వ కవయిత్రులు– ప్రాపంచిక దృక్పథం ... డా. కందాళ శోభారాణి 7
సినిమాలలో తెలంగాణ భాష ... గంజి శశిధర్ 15
నిజామాబాద్ జిల్లా గేయ వచన కవిత్వం - ఒక పరిశీలన ... మున్నం శశికుమార్ 17
పద్య మనోహరం -21 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 20
తెలుగు బోధన నైపుణ్యాలు : పఠన కౌశలం - బోధన ... డా. వై. రెడ్డి శ్యామల 21
తెలుగు సాహిత్యం - ధిక్కార స్వరాలు ... డా. ఎన్. రజని 25
గ్రంథాంతరంగం 5 - ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము ... ఘట్టమరాజు 29
పరిశోధన స్వరూప స్వభావాలు - 2 ... ఆచార్య జి.ఎస్.మోహన్ 32
పరిశోధనాంశాలు - అధ్యాయ విభజన ... డా. కాకునూరి సూర్యనారాయణమూర్తి 41
మనసున్న మనిషి కీ.శే. మడిపల్లి భద్రయ్య గారు... డా. ఎం.వి. పట్వర్ధన్ 45
తెలంగాణ సాంస్కృతిక చైతన్యంలో బతుకమ్మ గేయాలు వైశిష్ట్యం .. డా. కె. సుభాష్ చంద్రబోస్ 48
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 16 ... టి. లక్ష్మీనారాయణ 51
శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి 55


### కవితలు


జయ జగన్మాతా ... ఆచార్య శ్రీవత్స - 5,39,40; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్ - 6; అల్పాక్షరముల ... డా. ఎన్. గోపి - 14; మాండూక్యోపనిషత్తు (అనువాదం) ... జక్కని వెంకటరాజం - 28; మేమూ దేశభక్తులం ... ముద్దాపురం నవీన్ - 44; వృద్ధ యవ్వన ... సాయి లక్ష్మి - 54; వెన్నెల ... కొమురవెల్లి అంజయ్య ... 60; సాధువర్తనంబు సరియైన బతుకురా! ... డా. సబ్బని లక్ష్మీనారాయణ-62.


### సమీక్షలు


అస్తిత్వపు వెతుకులాట 'తావు' ... తండ హరీష్ గౌడ్ 23
స్వచ్ఛతా సారథిపైన విరిసిన 'గాంధీమొగ్గలు' ... డా. వీపూరి వెంకటేశ్వర్లు 57
వ్యాస భారతి .... డా. శ్రీరంగాచార్య 58
జీవన హిందోళం - వినూత్న మందారం ... ఘనపురం సుదర్శన్ 59
స్వీకృతి ... 61


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# సఫలం

ఫలం అనే శబ్దాన్ని అనేక రూపాల్లో వినియోగిస్తున్నాం. ఫలముతో కూడుకుని ఉంటే సఫలం. భారతీయ జీవనానికి ఫలానికి దగ్గరి సామ్యం ఉంది. ఒక ప్రత్యేక కాలం రాగానే వృక్ష జాతుల్లో మొగ్గ పుష్పంగా, పుష్పం పిందెగా, కాయగా, ఫలంగా మారుతుంది. అన్ని జీవులకూ ఇది సహజమే. వృక్ష తత్వాన్నే మన నిత్యజీవితానికీ ఆపాదింపజేసుకున్నాం. ఫలం కావడమంటే అది పూర్ణత్వాన్ని పొందడం అనే అర్థం. అందుకే ఫలితం అనే అర్థం మనకు రిజల్ట్ అనే ధోరణిలో తీసుకుంటున్నాం. సఫలం నుండి మనకు సాఫల్యం సిద్ధిస్తుంది.

పంట, పండడం, పండించడం అన్నీ ఈ సాఫల్య సిద్ధి మాత్రమే. అదే జీవితానికి కూడా అన్వయించుకుని వాడి 'పంట పండింది' అని కూడా వాడుతున్నాం. ఇది అనేక అంశాలలో, అనేక సందర్భాల్లో తెలుగువారు మాట్లాడుకునే విషయం. పండంటి కాపురం, పండంటి పిల్లలు, పండంటి జీవితం, ఫలప్రదం, ఫలితం, ఫలశ్రుతి వంటి పదాలే కాకుండా ఇంగ్లీషులోనూ ఫ్రూట్ ఫుల్ అనే పేరుతో జీవితంలోని అన్ని భాగాలకూ ఈ భాషా ఫలాన్ని అన్వయం చేస్తున్నాం. పండు మన జీవితంతో మమేకమై పోయింది. చేసే కార్యక్రమం సరిగా జరగక పోతే, రిజల్ట్ సరిగా రాకపోతే ఆ కార్యక్రమం విఫల మైంది అంటున్నాం.

ఫలం అనేది ఆ వృక్షం మనకు ఒక సంవత్సరంలో ఇచ్చే చివరి అంశం అయితే, మన జీవితంలో చేసే పని సిద్ధించే విధానం కూడా ఫలమే అవుతుంది. అందుకే అన్ని పనులూ ఫలప్రదం కావడానికి జీవితాంతం కృషి చేస్తూ ఉండటం అవసరం. వృక్షం ఏవిధంగా క్రింది నుండి నీటినీ, ఆకాశం నుండి సూర్యరశ్మినీ స్వీకరిస్తూ తన పనులు తాను చేసుకుంటూ, అందరికీ వినియోగ పడుతూ, అందరినీ అన్ని వేళలా సాధ్యమైనంత వరకు భరిస్తూ చివరకు ఫలాన్నే ఇస్తుందో... అదేవిధంగా మనిషి కూడా ఎల్లవేళలా మూలశక్తితో మమేకమై ఆ శక్తిని స్వీకరించి, ఉన్న శరీరాన్ని శుద్ధి చేసుకుంటూ, లోక వ్యవహారాల్లో ఎంత మమేకమైనా మంచి జీవన ఫలాలనే లోకానికి అందించాల్సి ఉంటుంది. అదే జీవన సాఫల్యం. ఇది ఎప్పటికీ వైఫల్యం కాకూడదు. విఫలమవడం అంటే మూలశక్తికి దూరం కావడమే.

ఎండకు ఎండినా, వానకు తడిసినా, గాలికి ఊగినా, చలికి వణికినా, మంచుకు చల్లబడినా, వేరు వేరు క్రిములెన్నో తమపైన పాకుతున్నా, తింటున్నా, ఇబ్బంది పెడుతున్నా, కొట్టినా, తిట్టినా చెట్టు తాను చేసే ప్రక్రియలేవీ ఆపకుండా, మూలశక్తితో మమేకమై ఫలితాన్నే ఇస్తుంది. తన జీవితమంతా ఎన్నో ఫలాలను మానవజాతికే కాకుండా ఎన్నో పక్షులకు, క్రిమి కీటకాలకూ అందిస్తుంది. అందరి కడుపు నింపుతుంది. ఈ సృష్టి నుండి తానే తీసుకున్న దానికన్నా అత్యధికంగా ఆకు, కాయ, పండుల రూపంలో మనకు ఆహారాన్ని, ఇతర అవసరాలను తీర్చేది వృక్షమే.

ఈ ధోరణిని జీవితానికి అన్వయం చేసుకున్నవాడే జీవన సాఫల్యాన్ని పొందుతారు. తమ కష్టాలనే గుర్తు చేసుకుంటూ ఉండేవారికి, లక్ష్య సాధన లేనివారికి సాఫల్యం సిద్ధించదు. శరీరం చైతన్యవంతమైనంత వరకు దానితో మమేకమైనవాడే ఈ సఫలతను సాధించగలుగుతాడు.

భారతీయ జీవితంలో 'పండు' దానం అతి విశిష్టం. అన్ని ఫలాలను సమాజానికి ఇవ్వలేక పోయినా, తన చేతిలో కనీసం పండునైనా ఇవ్వడం సంప్రదాయంగా మారింది. అందరికీ వినియోగ పడే పండును దానం చేస్తే మన జీవితం, సంతానం, కార్యక్రమాలు ఫలప్రదాలేగా మరి.

# జయ జగన్మాతా..

**శ్రీ జగన్మాత అవతారం**

సీ. శివమై శరదృతువు – జిగిదేఱి జగతిని
రంజింప జేయుచు – రమణకెక్క
చిచ్ఛక్తి రూపాలు – సిరులతో కవితమ్ము
పరబ్రహ్మతత్త్వమ్ము – పరగునటుల
ప్రకృతితో నెలకొని – పరిఢవిల్లిన శక్తి
సతి 'జగన్మాత'గా సవదరింప;
పరగుధాత్రికి కల్పవల్లివైన భవాని!
ప్రగతి పథము జూపు – పంకజాక్షి !
నీ దయలున్నను – నిత్యమ్ముతొలుగును
భయదు:ఖపాపముల్ – భావ్యమగుచు
తే.గీ. సర్వరోగోపశమనమ్ము – సంతరింప
ఈ శరన్నవరాత్రులు నింపులొదవి
విల్లసిల్లగ రాగదే ! విశ్వజనని !
సకల మానవ జగతికి సత్త్వమిచ్చి
లోక కల్యాణమై నీదు రుచులు నింపు
(శివమై = శుభప్రదమై; సతి= భార్య; పార్వతి)

**శ్రీబాలాత్రిపుర సుందరీదేవి**

సీ. శ్రీకరమౌ నవ చిద్రూపిణీ ! సదా
ఇజ్జగతిని పెంచు– ఇందువదన !
మంజుల భాషిణీ ! మధురవచస్వినీ !
మోక్ష స్వరూపిణీ ! ముక్తి నివ్వ;
నిఖిల భండాసురుని వధించి జగతిని
ప్రోచిన అంబవు– పొల్పుమీర;
పంచదశాక్షరీ! **'బాలాత్రిపుర సుంద
రీ'** మనస్వినినయి – కృపను జూపు
ఈతి బాధల నింక ఎడవించి రాగదే !
శ్రీ భువనేశ్వరీ ! సిరులతోడ;
'గురు గుహాదయకరీ' ! కోర్కె లీడేర్చగ
రావమ్మ ! శుభకరీ ! భావమెఱిగి
కొలువ దీరిన భక్తుల కొంగుపసిడి
జాతిసమైక్యతన్ ప్రోచు – సారసాక్షి !
మూర్ఖ జగతిని మేల్కొల్పు ముదము మీర;
విరియు కరుణామృతమ్మును – గురియు జేయి !

**ఆచార్య శ్రీవత్స**
**తిరుపతి, ఫోన్ : 9000 324 024**

**శ్రీ అన్నపూర్ణాదేవి**

ఆత్మ స్వరూపిణీ ! ఆనందదాయినీ !
అన్నార్తులను బోచు అంబవీవు;
సకల ప్రాణులలోన – సత్వమ్ము నీవైతి
అమృత వర్షిణివి కల్యాణినీవు;
ఇందుశేఖరుని గృహిణి వైతి ధాత్రిలో
నిడుములను ద్రుంచు – ఇందువదన !
అఖిల భువన సాక్షి ! అమరావతి నెటుల
సాకెదవో కదా ! సదమలగతి;
సావిత్రివి ! సకల జన జీవన ఫలదా
యిని జగజ్జననివి – కనికరించు;
మూల ప్రకృతి శక్తివి ! మించె పుడమిలోన
ప్రకృతి వైపరీత్యమ్ములన్ బాదు చేసి
అన్నదాతలన్ బ్రోవవే అన్నపూర్ణ !
ఆంధ్రుల మనమ్ములన్ గాంచి – ఆదుకొమ్మ !
(ఇడుములు = కష్టాలు, బాధలు; సాకుట = రక్షించుట; మించు = వ్యాపించు;)

**శ్రీ గాయత్రీదేవి**


సీ . అవ్యయం బైన సప్తవ్యాహృతులలోన
సంప్రకాశించు చిచ్ఛక్తి వీవు !
మానవ జగతికి – మంత్రాధి దేవత
గ యనుగ్రహించిన – కల్పవల్లి !
సౌజన్యరూపాన – సాహిత్యమందించు
వేదమాతవు నీవు – విశ్వమందు;
కాల స్వరూపిణీ ! కామిత దాయిని
'గాయత్రి' మాతవు – కనికరించు;
సప్తమహర్షు – స్వాంతమ్ములై నీకు
మూల సత్తువలైరి – ముదముమీద !
తనరారు ధాత్రిలో – తామసమ్మణగించి
సద్బుద్ధి నొసగెడి చంద్రవదన !
తే.గీ. సూర్యునికి యధిష్ఠాత్రివై – స్ఫూర్తి నిచ్చి
సౌరశక్తిని యందించు – జగముతల్లి !
దుఃఖ హంత్రణి వై కాచు – తోయజాక్షి !
నిమ్న జాతిని రక్షించు – నీరజాక్షి !
సకల నవ్యాంధ్ర జగతికి – సత్త్వమివ్వ !

**(మిగిలిన పద్యాలు తరువాతి పేజీల్లో)**

# మూసీ సాహిత్య ధార - 37

మూసీ సాహిత్య ధార (నిరంతర పరిశోధన స్రవంతి) ప్రతి మాసం విభిన్న అంశాలతో ప్రసంగాల పరంపరను కొనసాగిస్తోంది. వీటిలో తెలుగు పరిశోధనకే పెద్ద పీట వేస్తుంది. పరిశోధన విభాగంలో వారికంటూ ఒక ప్రత్యేక పేరును సంపాదించుకున్న సాహితీకారులను, వారి **'పరిశోధన – అనుభవాలు'** పేరుతో మాట్లాడిస్తూంది. ఇదే శీర్షికన ఈ మాసం రెండవ ఉపన్యాసం. ఇంతకుముందు ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు మాట్లాడగా ఈ మాసం ఆచార్య ఎన్.గోపి గారు ప్రసంగించారు. వారి పరిశోధన అనుభవంలో భాగంగా వేమన్న పద్య ప్రతుల కోసం తాను పడ్డ ప్రయాసను, చేసిన ప్రయత్నాన్ని, పెట్టిన ఖర్చును, రాసిన విధానాన్ని, కనుగొన్న అంశాలను, పొందిన పేరును, మన్ననలను గురించి తెలిపి ప్రస్తుత పరిశోధక విద్యార్థులకు ఎంతో ప్రేరణ కలిగించారు.

ఈ మాసం స్వీయ పరిశోధన అంశం మీద గంజి శశిధర్ మాట్లాడారు. వీరు **'తెలుగు సినిమా సాహిత్యంలో – సంభాషణలు ఒక పరిశీలన'** అనే అంశం పైన పరిశోధన చేస్తున్నారు. సినిమాల్లో సంభాషణలు ఎన్ని విధాలుగా ఉన్నాయి, ఏయే సందర్భాలలో ప్రయోగిస్తున్నారు అనే విషయాలు తెలిపి, వాటి వెనుక ఉన్న మార్మికత పట్టి చూపించారు. కవితా గానం ఎం.ఏ. విద్యార్థి అయినా నరసింహారెడ్డి **'దారి'** అనే శీర్షిక గల కవిత్వాన్ని చదివి మన్ననలు పొందారు. ఈ సమావేశంలో ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, ఆచార్య నిత్యానందరావు, ఆచార్య సూర్యాధనంజయ, డా. లక్ష్మణచక్రవర్తి, డా. జి. నీరజ వంటి ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు. వీరితో పాటు పరిశోధక విద్యార్థులు ఎం.ఏ., విద్యార్థులు, మూసీ పరివారం పాల్గొని విజయవంతం చేశారు.





## తుకారాం అభంగం


ఇదే నా నియమం
ఎత్తుకుంటిని ఈ కార్యం
నన్ను గమనించి గోవిందా
నా దరికి కదిలి రావే

ఇదే నా ధ్యాస
సదా సర్వకాలాల్లోన
కొనిపోవ మూలంలోకి
ఎప్పుడొచ్చేవు దేవా!

నీ సుందర వదనం చూడాలని
కన్నులకుండు సదా ఆకలి
నీ ఆలింగన సుఖము
ఎప్పుడిచ్చేవు దేవా!

కప్పుకుంటి నీ ధ్యాసను
నీ ఆసక్తి నుంటి నో దేవా
చాలదయ్య ఏ నియమం
నిను సాధింప

బహు బహు కాలమాయే
కకావికలుడ నయియుంటి
నను మోస్తుంది ఈ కట్టె
బహు కాలము నుండి



తుకా పలికే
అంతిమ చరణమునుంటిని
నా పాండురంగా
నన్ను బ్రోవరావా!

అనువాదం : మంత్రి శ్రీనివాస్
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉ.వి.,
ఫోన్ : 83283 33720

# పూర్వ కవయిత్రులు - ప్రాపంచిక దృక్పథం

**డా. కందాళ శోభారాణి,** అధ్యాపకురాలు, పి.జి.మహిళా కళాశాల, హనుమకొండ, ఫోన్ : 897 865 6327

తెలుగులో ప్రాచీన సాహిత్య చరిత్ర 1050 నుండి 1850 వరకు ఎనిమిది వందల సంవత్సరాల కాలం మీద వ్యాపించింది. ఇన్ని వందల సంవత్సరాల చరిత్రలో వివిధ రాజస్థానాలను, సంస్థానాలను ఆశ్రయించి రచన చేసిన అనేక వందలమంది కవులలో పురుషులు ఎక్కువ. స్త్రీల సంఖ్య స్వల్పం. స్త్రీలను పునరుత్పత్తికి, ఇంటిపనికి పరిమితం చేసిన మధ్యయుగ భూస్వామ్య రాచరిక సంస్కృతి అందుకు కారణమన్నది స్పష్టమే. పురుషులది అయిన బయటి ప్రపంచంలో సాహిత్య సార్వభౌములు కూడా వీళ్ళే. వాళ్ళ సరసన కవులుగా నిలబడటానికి ఆనాటి స్త్రీలు చేసిన ప్రయత్నం సాధారణమైనది కాదు.

అక్షరాస్యత, విద్య, స్వంత ఆలోచనలు, అభిప్రాయాలు వుండటానికి అవకాశమే లేని స్త్రీలు కవులై, కవిత్వం ద్వారా తమ ప్రాపంచిక కవితా దృక్పథాలను వ్యక్తీకరించారు. ప్రాచీన కవయిత్రుల కావ్యావతారికలు వీనికి మూలం. కావ్యావతారికలు అంటే కవి ఆత్మీయ ప్రకటనలు. కవిత్వం గురించి, పూర్వకవుల గురించి వాళ్ళ వాళ్ళ అభిప్రాయ ప్రకటనలకు అవి వేదికలు. కావ్యావతారికలను బట్టి కవి చారిత్రక కాలాన్ని, కావ్య దృక్పథాన్ని అంచనా వేస్తూ జి. నాగయ్య, పాపిరెడ్డి నరసింహారెడ్డి, కోవెల సంపత్కుమారాచార్య రచనలు చేశారు. కవయిత్రుల కావ్యావతారికలను అందుకు వాడుకొన్నది చాలా తక్కువ.

తెలుగు సాహిత్య చరిత్రలో మనకు తెలిసినంతవరకు తొలి తెలుగు కావ్యకవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క (క్రీ.శ. 1460). ఈమెనే తిరుమలాంబ, తిమ్మాంబ అని కూడా అంటారు. ఆమె రచన సుభద్రా కళ్యాణము. సుభద్రా కళ్యాణానికి భారత కథ ఆధారం. పురుషులదైన పాండిత్య ప్రదర్శన ప్రధానమైన మార్గకవితా రీతిలో కాక దేశి కవితా రీతిలో స్త్రీలు పాడుకోడానికి వీలైన మంజరీద్విపద కావ్యంగా దీనిని రాసింది. స్త్రీల జీవితపు దైనందిన సుఖదుఃఖ కార్యకలాపాలతో ముడిపడి ప్రచారంలో వున్న పెళ్ళి పాటల ఒరవడిలో రాయబడిన కావ్యమిది. దీనికి అవతారిక లేదు. కావ్యాంతంలో ఫలశ్రుతిగా చెప్పబడిన మాటలలో ఆమె పేరు వుంది.

అవనిలో తాళ్ళపాక కన్నయ్యగారి
తరుణి తిమ్మక్క చెప్పె తాను సుభద్ర
కళ్యాణమను పాట కడుమంచి తేట పలుకులు.

తిమ్మక్క ఉద్దేశ్యంలో కవిత్వ రూపం పాట. అది కడుమంచి తేట పలుకులలో ఉండాలని ఆమె భావించింది. కడుమంచి అనేది స్వభావానికి, విలువకు సంబంధించిన విషయం. తేటపలుకులు రూపానికి సంబంధించినవి. ఒక స్త్రీ, ఇతర స్త్రీల కోసం పాట



She is the second female Telugu poet of note, after Tallapaka Thimmakka, wife of Annamacharya. She translated the Sanskrit Ramayana into Telugu.

రాస్తూ అది ఒక మంచి విలువను బోధించాలని, ఆ విలువ వాళ్ళకు అర్థం కావాలంటే అది తేలిక మాటలలో ఉండాలని ఆశించింది. ఈ కొద్ది మాటలలోనే కావ్య ప్రయోజనాన్ని కూడా సూచించింది. ఈ పాట పాడినవాళ్ళకు, విన్నవాళ్ళకు శ్రీహరి సామీప్యం లభించటమే ఆ కావ్య ప్రయోజనం.

రామాయణ కావ్యాన్ని రాసిన మొల్ల (క్రీ॥శ॥ 15వ శతాబ్దం) తరువాతి కవయిత్రి, రామాయణానికి ఆమె రాసిన విపులమైన కావ్యావతారిక ఆమె జీవిత విశేషాలను, కావ్య దృక్పథాన్ని, ప్రాపంచిక దృక్పథాన్ని తెలుపుతుంది.

మొల్ల కావ్యావతారిక దైవ ప్రార్థనతో మొదలవుతుంది. శ్రీరాముణ్ణి, మల్లికార్జునుడిని, బ్రహ్మని, విఘ్నేశ్వరున్ని, పార్వతీదేవిని, లక్ష్మీదేవిని, సరస్వతీదేవిని వరుసగా ప్రార్థించింది.

కావ్యం రాయడానికి కావ్య సామగ్రిగా వినాయకుని ప్రార్థనలో "ప్రథిత వాక్ప్రౌఢికై యెప్డు బ్రస్తుతింతు" (అవ-5) ప్రసిద్ధమైన వాక్ప్రౌఢి ఉండాలని చెప్పింది. సరస్వతి ప్రార్థనలో "విద్యాలయ వాణి శబ్దముల నర్థములన్ సతతంబు మాకిడున్" అర్థవంతమైన శబ్దాలుండాలని కోరింది.

పూర్వకవి స్తుతిలో వాల్మీకి, వ్యాసుడు, భారవి, మాఘుడు, భవభూతి, భట్టబాణుడు, శివభద్రుడు, కాళిదాసు, నాచన సోముడు, నన్నయ్య, శ్రీనాథుడు రంగనాథుడు వీళ్ళందరిని ప్రస్తావించింది.



"సురసన్నుతాజ్ఞాను సువివేకి వాల్మీకి నఖిలవేదాగమాభ్యాసు వ్యాసు ఘోరాంధ్ర కార ప్రభారవి భారతి, సత్కాంతి హిమకరశ్లాఘు మాఘు వివిధ కళాన్విత విఖ్యాత భవభూతి, బ్రకట కార్యధురీణు భట్టబాణు మానినీ లోక సమ్మద భద్రు శివభద్రు, గవితారసోల్లాను గాళిదాసు

(1-8)

గీ. స్తుత గుణోద్ధాము నాచనసోము భీము
నవ్య మంజుల వాగ్ధుర్య నన్నపార్యు
రసికుడైనట్టి శ్రీనాథు రంగనాథు
దిక్కకవి రాజును నుతించి ధీని మించి(1-9)

క. తొల్లిటి యిప్పటి సత్కవి
వల్లభులను రసికవినుత వాగ్విభవకళా
మల్లుల గవితారచనల
బల్లిదు లైనట్టి ఘనుల భక్తిగ దల తున్ (1-10)

ప్రాచీన, శ్రేష్ఠులైన సంస్కృత కవులను, ఆంధ్ర కవులను, సమకాలీనులైన ఇంతమంది గురించి ప్రస్తావించిందంటే వీళ్ళందరి గురించి అధ్యయనం చేసి ఉంటుంది. ఇది వ్యుత్పత్తికి నిదర్శనంగా చూడవచ్చు. "వాగ్విభవ కళామల్లుల" అనటంలో వాక్కు సంబంధించిన వైభవం, కళావంతంగా ఉండాలని ఆమె కోరింది.

మొల్ల తన రామాయణంలో తన గురించి చెప్పుకున్నది.

గురులింగ జంగమార్చన
పరుదును శివభక్తిరతుడు బాంధవహితుడున్
గురుదాతుకూరి కేసయ
వరపుత్రిని మొల్లయనగ వఱలినదానన్. (1-11)

తన తండ్రి శివభక్తి తత్పరుదని, ఆతుకూరి కేసయ వరపుత్రికనని అన్నది. మొల్ల తనకు కవితా లక్ష్యాలు తెలియవంటూనే ఉత్తమ కవిత ఎలా ఉండాలో తేటతెల్లంగా చెప్పుకున్నది.

సీ. దేశీయపదములు దెనుగులు సాంస్కృతుల్
సంధులు ప్రాజ్ఞల శబ్దవితతి
శయ్యలు రీతులు, జాటు ప్రబంధంబు
లాయా సమాసంబు లర్థములను
భావార్థములు గావ్య పరిపాకములు రస
భావ చమత్కృతుల్ పలుకుసరవి
బహువర్ణములును విభక్తులు ధాతుల
లంకృతి చ్ఛందో విలక్షణములు.

గావ్య సంపద క్రియలు నిఘంటువులును
గ్రమము లేవియు నెఱుగు విఖ్యాత గోప
వరపు శ్రీ కంఠ మల్లేశు వరము చేత
నెఱి గవిత్వంబు చెప్పగా నేర్చికొంటి. (1-12)

తెలుగు, సంస్కృత భాషా పదసంపద, వ్యాకరణ సంబంధ సంధి, సమాసాలు విభక్తులు, రీతులు, రసభావ చమత్కారాలు, అలంకారాలు, ఛందస్సు మొదలైన అంశాలు కవితా సామగ్రిగా సూచించింది. శ్రీకంఠమల్లేశు వరముచేత కవిత్వం చెప్పటం నేర్చుకున్నానన్నది.

తర్వాతి పద్యంలో –

చెప్పుమని రామచంద్రుడు
చెప్పించిన పలుకు మీద జెప్పెద నే నె
ల్లప్పుడు నిహపరసాధన
మిప్పుణ్య చరిత్ర తప్పులెంచకుడు కవుల్ (1-13)

శ్రీరామచంద్రుడు చెప్పుమన్నాడు, రాముడు చెప్పమన్నంత కాలం చెప్పటం కూడా ఇహపర సాధన కోసమే అని పుణ్యచరిత్రగా తెల్పింది. అందుకే తప్పులున్నాయని నిందించొద్దని కవులను అభ్యర్థించింది.

మొల్ల సూచించిన కావ్య స్వరూపం –

వలిపపు సన్న పయ్యెదను వాసిగ గంధపుఁ బూత తోడుతన్
గొలదిగ గానవచ్చు వలిగుబ్బ చనుంగవ ఠీవి నొప్పగా
దెలుగని చెప్పుచోట గడు తేటల మాటల గ్రొత్తరీతులం
బొలుపు వహింపకున్న మరి పొందగునే పటహాది శబ్దముల్.

(1-15)

సన్నని పైటలోని స్తనములు పూసుకున్న గంధం తెలియవచ్చునట్లుగా చూపీ చూపనట్టుగా ఉండాలి. తేటపలుకులతో ఉండి కవిత సులభంగా అర్థం కావాలని ఆమె భావన. చక్కని తెలుగు పదాలుండగా పాండిత్యాన్ని ప్రదర్శించటం కోసం సంస్కృత పదాల ప్రయోగం సరికాదని చెప్పటం అంటే అర్థం వెంటనే స్ఫురించాలని. **"దన విద్య మెరయ గ్రమ్మర, ఘనమగు సంస్కృతము జెప్పగా రుచి యగునే?"** అని అన్నది.

తేనెసోక నోరు తీయన యగురీతి
తోడనర్థమెల్ల దోచకుండ
గూఢ శబ్దములను గూర్చిన కావ్యమ్ము
మూగ చెవిటి వారి ముచ్చటగును

తేనె సోకగానే వెంటనే నోరంత తియ్యగా మారినట్టు, ఒక్కసారి కావ్యాన్ని చదువగానే వెంటనే అర్థం కావాలని ఆమె అభిప్రాయం. నిగూఢ శబ్ద ప్రయోగాల వల్ల మూగవాళ్ళు, చెవిటి వాళ్ళు సంభాషించి నట్టుగా ఉంటుందని అలాంటిది ఎవ్వరికీ ఉపయోగపడదనే భావం వ్యక్తపరుస్తుంది.

కందువ మాటలు సామెత
లందముగా గూర్చి చెప్పదని తెలుగునకుం
బొందై రుచియై వీనుల
విందై మరి కానిపించు విబుధుల మదికిన్ (1-18)

తెలుగులో చమత్కారం లేదా సామర్థ్యంతో కూడిన మాటలు, సామెతలతో అందంగా కూర్చి కావ్యం రాస్తే పొందికగా, వీనుల విందుగా చదువరుల మనస్సును దోచుకుంటుందని ఆమె అభిప్రాయ పడింది.

మొల్ల వస్తువు స్వీకరణ విషయానికి కొస్తే రామకథను తీసుకొంది.


ఆది రఘురాము చరితము
నాదరముగ విన్న గ్రొత్తయై లక్షణ సం
పాదమ్మై పుణ్యస్థితి
వేదమ్మై తోచకున్న వెఱ్ఱినె చెప్పన్? (1-19)

తెలుగు సారస్వత ప్రక్రియలన్నింటిలో రామకథ అవతరించింది. దానికి కారణం రామకథపై తెలుగు జాతికున్న ప్రత్యేక ఆదరాభి మానము రామాయణం ఆదరంగ వింటే పుణ్యం వస్తుందని తెల్పుతుంది.

మొల్ల రామాయణం రచిస్తూ **"అది భూజన కల్పకం, భుక్తికి ముక్తికి మూలం. ఆ రాజు దైవం"** (1-21) అని స్తుతించింది. కావ్య ప్రశస్తి అవతారికలో చెప్పటం పాఠకునికి అవగతమై మనసులో చదవాలనే కోరిక పుట్టిస్తుంది. ఆ ఉద్దేశ్యంతోనే ఈ అంశాన్ని ప్రవేశపెట్టవచ్చు.

కావ్యాంకితం గురించి మొల్ల రాజాంకితాన్ని నిరసించింది. దేవాంకితాన్ని విశిష్టంగా భావించింది. 'రామ' నామ జపం చేసే నాలుక 'రాజు' నామ జపం చెయ్యదంది. అది అమృతం - ఇది అల్లం లేదా బెల్లం అంటుంది కవయిత్రి.

సల్లలిత ప్రతాపగుణ సాగరుడై విలసిల్లి ధాత్రిపై
బల్లిదుడైన రామనరపాలకునిన్ స్తుతిసేయ జిహ్వకున్
జిల్లర రాజలోకమును జేకొని మెచ్చగ నిచ్చ పుట్టునే ?
నల్లము బెల్లముం దినుచు నప్పటికప్పటికాప సేయునే ? (మొల్ల 1-24)




అని వితర్కించింది. **చెప్పుమని రామచంద్రుడు సెప్పించిన పలుకును** శ్రీరామాంకితమే చేసింది.

రాజులకంకితం చేస్తే అవతారికలో రాజుల వంశ వర్ణనలాంటివి చెప్పారు. ఆ పద్ధతిని పరోక్షంగా మొల్ల నిరసించింది. ఈ విషయంలో మొల్ల పోతనను అనుసరించింది. ఇది మొల్ల వ్యక్తిత్వానికి నిదర్శనంగా గమనించవచ్చు.

రామాయణ కావ్యాంతంలో మొల్ల శ్రుతి ఫలాన్ని చెబుతూ శ్రీరామకథను ఎప్పుడూ వదలకుండా వినేవారు, రాసేవారు, ఇష్టపడి చదివేవారు శ్రీరాముని దయతో శుభాలు పొందుతారని తెల్పింది. ఇది మొల్ల రామభక్తికి రామకావ్య మహిమకు నిదర్శనము. (మొల్ల 1-139).

రంగాజమ్మ (క్రీ॥శ॥ 1635-60) (17శ.) ఈమె సంగ్రహ భారతం, సంగ్రహ రామాయణం, సంగ్రహ భాగవతం, ఉషా పరిణయం అనే ప్రబంధాలు, మన్నారుదాసమనే యక్షగానం రచించినట్లు ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ రాసిన 'ఆంధ్ర కవయిత్రుల పుస్తకంలో పేర్కొన్నారు. మొదటి మూడు అలభ్యం. మన్నారు దాస విలాస యక్షగానము 1926లో కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారు ముద్రించారు.

ఉషాపరిణయ కావ్యం ఆశ్వాసాంత గద్య ఒకటి లభ్యం. తన గ్రంథాంత గద్యలో తన కులగోత్రం వివరించింది. తండ్రి "పసుపులేటి వెంకటాద్రి బహుజన్మతపః ఫలంబును తల్లి మంగమాంబా గర్భశుక్తి ముక్తాఫలంబును" అని చెప్పుకున్నది. తంజావూరు ఏలిక అయిన విజయ రాఘవనాయకుడి ఆస్థానాన్ని అలంకరించింది.




మన్నారు దాస విలాస ప్రబంధాన్ని మెచ్చుకొన్న విజయరాఘవుడు ఆమెను హరివంశంలోని 'ఉషాపరిణయం' కథను తెనుగు చేయమని కోరాడట. రాజు కోరితే తాను కావ్యం రాశానని చెప్పింది. అందుకు రాజగురువు, గురురాజ పట్టభద్రుడి అనుమతి, ఆశీర్వచనం వున్నాయని చెప్పింది. పైగా తన సాహిత్య కళావైదుష్యాన్ని గొప్ప ఆత్మవిశ్వాసంతో, సూక్ష్మ వివరాలతో నమోదు చేస్తూ పోయింది.

ఉషాపరిణయ ఆశ్వాసాంత గద్య దీనికి నిదర్శనం. ప్రపంచంలో అస్తిత్వంలో వున్న కవుల ప్రాశస్త్యంతో సమాంతరంగా కవయిత్రుల గొప్పతనాన్ని స్థాపించటం రంగాజమ్మ సాధించిన విజయంగా చెప్పవచ్చు.

ఆ గద్య ప్రకారం – రంగాజమ్మ.

శ్రీరాజగోపాల కరుణాకటాక్ష వీక్షణానుక్షణ ప్రవర్ధమాన సారస్వత ధురీణ, విచిత్రతర పత్రికాశత లిఖిత వాచికార్థావగాహన ప్రవీణ, తత్ప్రతి పత్రికా శత స్వహస్త లేఖన ప్రశస్త కీర్తి, శృంగార రస తరంగిత పదకవిత్వ మహనీయమతి స్ఫూర్తి.

అతులితాష్ట భాషా కవితా సర్వంకషా మనీషాశారద, రాజనీతి విద్యా విశారద, విజయ రాఘవ మహీపాల విరచిత కనకాభిషేక, విద్వజ్జన కవిస్తవనీయ వివేక, మన్నారుదాస విలాసనామ మహాప్రబంధ నిబంధన కృతలక్షణ, మహనీయ రామాయణ భాగవత భారత కథా సంగ్రహణ విచక్షణ, రంగద్గుణ కదంబ, వచన రచనా చమత్కృతిం జెన్ను మీరు ఉషాపరిణయ ప్రబంధ కర్త్రి.

విచిత్రతరమైన వందల పత్రికలు స్వయంగా రాయగలిగి, అర్థం చెప్పగల ప్రావీణ్యం, శృంగార రసవంతమైన పదకవిత్వం అల్లగల బుద్ధి ప్రకాశం, అష్టభాషలలో కవిత్వం చెప్పగల నేర్పరితనం, వచన రచనా చమత్కారం కలిగిన సారస్వత ధురీణ ఆమె.

విద్వజ్జన కవి సమూహం ప్రశంసించదగిన వివేకం తన సొత్తని ఆమె సగర్వంగా చాటుకొన్నది. ''రాజనీతి విద్యావిశారద' ఆమెకున్న అదనపు శక్తి. వ్యుత్పత్తి ఎంత ఉందో సగర్వంగా ప్రకటించుకున్న కవయిత్రి రంగాజమ్మ.

ముద్దుపళని (1740–1782). **'రాధికా సాంత్వనం'** ప్రబంధ కావ్యం రాసింది. దీనికే ఇళాదేవి అనే పేరు కూడా కలదు. శ్రీకృష్ణుని స్తోత్రంతో మొదలైంది. ''జిన్ని కృష్ణుని గృపాళుని గొల్తు నభీష్టసిద్ధికై''. ''మధురాధరము కల్కితనము బిల్క జెలుగుశు కవాణి రుక్మిణి జలదవాణి, భావభవుమాత సంపద నీవు గాత. సరస్వతీ దేవి, భూదేవిని, రుక్మిణి, లక్ష్మి మొదలగు దేవతలను స్తుతించింది.

పూర్వకవి స్తుతిలో వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు సంస్కృత కవులను, నన్నయ్య, తిక్కన, సోమభాస్కరులు, శ్రీనాథుడు, భీముడు ఆంధ్రకవులను పేర్కొన్నది.

క్షితి వాల్మీకి పరాశర ప్రియసుత శ్రీకాళిదాసాది సం
స్కృత విద్వత్కవితాజ్ఞులం బొగడి భక్తిన్ నన్నయార్యుండు స
న్నతి యౌ తిక్కన సోమభాస్కరులు శ్రీనాథుండు భీముండు నా
గృతు లౌనాంధ్ర కవీంద్రులం దలతు యుక్తిన్ మత్కృతి ప్రౌఢికిన్.
(1–5)

ముద్దుపళని కూడా మొల్లలాగే సంస్కృత కవులను, ఆంధ్ర కవులను ప్రస్తావించింది. ఈమెకూడా వీళ్ళందరి గురించి అధ్యయనం చేసి ఉండాలి, వ్యుత్పత్తికి నిదర్శనం.

కుకవుల గురించి –

పొత్తమున నుండు శల్యంబు లెత్తివైచి
శాస్త్రయుక్తిని గొని భేషజంబు సేయ
గ దగు నాక్షేపజీవక కవుల దీర్ప
జనదు కృతుల నమంగళ జనులు వారు (1–6)

గ్రంథంలో ఉండే దోషాల్ని శాస్త్రయుక్తితో తీసేస్తాము అనే **''ఆక్షేప జీవకవులు అమంగళ జనులు''** అని ముద్దుపళని విమర్శించింది.

చెలువుగ బూర్వ సత్కవులు చేసిన కబ్బము లెన్నొ యుండగా
జెలిమిని నీకృతిన్ గణన సేతురె సత్కవులందు రేమొకో
భళి కయికొందు రెట్లనిన బద్మపుదేనియ నానుతుమ్మెదల్
పులిసి హసించకే యితర పుష్ప మరందము లోలి గ్రోలవే
(1–7)

ముద్దుపళనికి పూర్వపు కవులు ఎందరివో ఎన్నో కావ్యాలుండగా ఈమె కావ్యం లెక్కపెడ్తారా? అని కొందరు కవులనుకోవచ్చు. కాని భళీ అనక తప్పదని పద్మం నుండి తేనెను గ్రోలె తుమ్మెద ఇతర పుష్పాల తేనెను స్వీకరించకుండ ఉండలేదు కదా అని సమాధాన పర్చింది. ''హరివాసరంబున శ్రీహరిం బ్రార్థించి'', ''సొగసు

కనిపించు మువ్వంపు సొంపుతోడ, రాధికా మణికై దండ రమణబూచి చిన్ని కృష్ణుండు కలను" (1-9) ప్రసన్నుడయ్యాడు ముద్దుపళనికి.

స్వప్నంలో కృష్ణుడు కనిపించి (రాధికా సాంత్వనం) కావ్యం రాయమన్నాడని అతని కోరిక మేరకే రచన చేసినట్టుగా, తనకే అంకితమీయమన్నాడని తెల్పింది. తనకొచ్చిన స్వప్నం గురించి గురువు గారికి తెలియజేసింది. తమ కృతి ప్రారంభానికి బీజంగా స్వప్న సాక్షాత్కారం అనే అంశం ప్రవేశపెట్టింది. ఇది కావ్యరచనకు ప్రోత్సాహం వంటిది. గురువు వర్ణన – "యుభయ వేదాంత ప్రతిష్ఠాపనాచార్యుండును నిరుపమౌదార్య గాంభీర్యధుర్యుండును, భాషండషండగిరి తండమహోఖండలుండును, బాలిత భక్త మండ లుండును, దిరుమలతాతాచార్య వర్యకులకల శపారావారతారా ధారుండును, మదీయ పూర్వజన్మతపః ఫలసారుండును సుగుణాభి రాముండును నగు వీర రాఘవ దేశిక సార్వభౌముని సన్నిధానంబున సాష్టాంగదండ ప్రణామంబు. ఆమె గురువు వీర రాఘవదేశిక సార్వభౌములకు చెప్పుకున్నది. ఆయన ఆమె శక్తిసామర్థ్యాలు అందుకు తగినవే అని ప్రోత్సహించాడు.

ముద్దుపళని రాజస్థానంలో రాజును ఆశ్రయించి ఉంది కనుక ప్రతాపసింహున్ని స్తోత్రం చేసింది. ఆమెది శూద్రకులం అని శూద్రజాతికి జన్మస్థానం విష్ణుపాదాలు అంటూ వాటి ప్రావీణ్యాన్ని అలంకారిక శైలిలో వర్ణించింది. "శ్రీ రమణీ కుచాగ్రముల నేలి చిగురు జొంపంబులై బిగిచె మౌని రాణ్మానస మాసంబులనేవి కమల వనంబులై ఘనమొసంగు సర్వజ్ఞ మౌళి శృంగాగ్ర నటన పటుతర క్రియా త్రిజగతీ పావన ప్రతీత చరిత్ర సురధునీ తిలక జన్మ పదముల నుపమ శ్రీ విష్ణుపదములు ఆ మహీనాథు పద పద్మమందు బుట్టి, సురచిర ఖ్యాతిగొనె నీతి శూద్ర జాతి" (1-15) అని వివరించింది.

తండ్రి పేరు ముత్యాలు, తల్లి పేరు పోటి. కాని ఆమె పెరిగింది తంజనాయకి అనే వేశ్య పోషణలో. ముద్దుపళని స్వయంగా ప్రతాపసింహుడి పెంపును చెందిన పడతి.

ముద్దుపళని కావ్యావతారికలో మరో ప్రత్యేకత ఆమె తన వంశవర్ణనలో స్త్రీ క్రమానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. మేనత్త ముద్దు తంజనాయకి గురించి ప్రత్యేకించి ఒక కందం, ఒక సీసం రాసింది. మేనత్త కూతురు రమామణి గురించి ఏకంగా ఒక కందం, రెండు సీస పద్యాలు రాసింది. నాయనమ్మ, పెంపుడు నాయనమ్మ, తల్లి, మేనత్త, మేనత్త కూతురు, అక్కచెల్లెళ్ళ గురించి పద్యాలు రాసింది. స్త్రీ వారసత్వాన్ని వంశక్రమాన్ని నమోదు చేయటం ప్రాచీన సాహిత్యంలో ముద్దుపళనికే దక్కింది. స్త్రీల చరిత్ర నిర్మాణానికి ఒక అవసరమైందిగా చెప్పవచ్చు.

సీ.సాహిత్య విద్యావిశారద శారదయై
ముద్దుపళని నా నమరు నిన్ను
గురుతరం బై తగు గుణగణ ప్రౌఢి వే
లాయుతుండైన వేలాయుధాఖ్యు
భరత భావాభావ భావజ గురుడు నా
గొమరు జెందెడు ముద్దు కొమరు వరుని
రూప విభ్రమ కళారూఢి నెంతయు రతీ
దేవి యౌ ముద్దు లక్ష్మీవధూటి (1-29)

మేటి ముత్యాలు పోటి వధూటి వలన .....

క. వెలసితివి వార్ధిలోన
న్దెలి చుక్కలలోన జెలగు నెలరేక యనన్
లలిత కళా విభవములు
వల నొప్పగ మేటి ముద్దుపళని వధూటిన్ (1-30)

సాహిత్య విద్యా విశారద, లలిత సకల కళాప్రౌఢి, భవ్యవాగ్ధాటి ముద్దుపళని విశిష్టతలు. ఈమె నవరసంబుల నంటి నటియింప గలదు.

సీ. ఏనాతి నీరీతి నెంతో భక్తి చెలంగ
వ్రాయించె జయధాటి, రామకోటి
ఏనారి నీదారి నెలమి విద్వచ్ఛ్రేణి,
దనియించె నెర మెచ్చి ధనము లిచ్చి
ఏకల్కి నీ పోల్కి నిల గీర్తి గైకొనె
గబ్బముల్ చేనంది ఘనత జెంది
ఏ బాల నీలీల నిటు దొరాదొరలచే
బొగడొందె గడిదేఱి పొలుపు మాఱి (1-31)

విద్వచ్ఛ్రేణికి ధనమిచ్చి తృప్తి పరచటం, కావ్యాలు రాయించి అంకితం తీసుకోవటం కృతి భర్తగా ముద్దపళని ప్రత్యేకత.

సీ. ఘటియింప నేర్తువు కవనజాతులెఱిగి
పలుకుల కల్కి వెల్వెలన బాఱ
నీయగా నేరుతు విల గోరినవరాలు
నగరాజు సుకుమారి, సగముగాగ
చెల్లింప నేర్తువు చెప్పిన రీతిగా
గని ద్రౌపతీ సతి, కానకేగ
నటియింప నేర్తువు, నవరసంబులనంటి
తగురంభ యనిమిషత్వము వహింప (1-35)

కవన జాతుల గురించి, కవిత్వంలోని రకాల గురించి తెల్సి కావ్యాలు రాయగల్గిన శక్తి ఉన్నామె. సరస్వతీ దేవి వెల వెల పోయేలా కావ్యం రచిస్తానని చాటుకున్నది.

రస ప్రధానంగా రాధామాధవంబును శృంగార ప్రబంధంబు అని చెబుతూ స్వయంగానే "యెద్ది యేని యునొక్క శృంగార ప్రబంధంబు నిబందింపందలించి"న స్వతంత్ర వ్యక్తి.



ఆశ్వాసాంత గద్యలలో "శృంగార రస ప్రధాన సంగీత సాహిత్య భరత శాస్త్రాది విద్యాపారంగత"గా తనను గురించి చెప్పుకున్నది ముద్దుపళనీ. ముద్దుపళని 'రాధికాసాంత్వనం' కావ్యం హరికి అంకితం చేసింది.

తరిగొండ వెంగమాంబను 1840లో జీవించినట్లు బ్రౌన్ దొర తన నిఘంటువులో పేర్కొన్నారు. ఈమె బాల వితంతువు. కృష్ణభక్తురాలు, వేంకటాచలపతి ఈమె ఇష్టదైవం. బాల్యం నుండి ఆధ్యాత్మిక, వైదాంతిక చింతలతో జీవనం గడిపింది.

"ధరపైని వెలయ నందవరాహ్వయుండు" పద్యాన్ని బట్టి తండ్రి కానాలి కృష్ణాచార్యుడు, తల్లి మంగమాంబ, సోదరుడు కృష్ణుడు, గురువరుడు సుబ్రహ్మణ్య దేశికులు. వీరు వేదాంతోపదేశికులు. ఈమె చిరుప్రాయంలోనే విద్యలన్ని నేర్చుకున్నది.

"నా చిన్ననాటి నోనమాలనైన నాచార్యులెవరు నాకానతీ లేదు.... నెట్టులో వాణి నకలంకుడై జిహ్వాయందుంచె గురుడు... విరచించి భక్తితో వేంకటశైవపతికిచ్చి. రాసిన పంక్తులను బట్టి ఈమె గ్రంథాలు.

నరసింహశతకము, నరసింహ విలాసకథ, శివనాటకము, రాజయోగసారము, కృష్ణనాటకము, పారిజాతపహరణ సత్కృతి యక్షగానము, రమాపరిణయము పెండ్లిపాట చెంచునాటకమను ఒక కథ, కృష్ణమంజరి – ద్విపద, శ్రీ రుక్మిణీ నాటకము, గోపికానాటకాలు, వేంకటాచల మహత్యము ప్రబంధం, ముక్తికాంతా విలాసము రమారమి ఈమె రచనలు 15 వరకున్నవి. తిరుమల వేకంటరమణునిపై రాసిన పాటలు ఎన్నో.

వేంకటాచల మాహాత్మ్యంలోని అవతారికలో కృష్ణుడిని ప్రార్థించింది. వెంగమాంబ కవిత్వంలో కవిత్వం లేదని కొందరు ఆరోపించారు. నృసింహ శతకంలో నృసింహుడికి తన మొర వినిపించింది. మొర విని ఆదుకునే వాళ్ళు లేరని వెంటనే గ్రహించగలిగింది. ఆత్మరక్షణకు వెంగమాంబ తనదైన పద్ధతిని తాను ఏర్పర్చుకున్నది. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం అవతారికలో

పండితాగ్రణులార ప్రజలార ఇప్పుడు నా
బాల భాషల సహ్యపడక వినుడి
తల్లిదండ్రులు చిన్నపిల్లలు పల్కులా
హ్లాదంబుగా విందురా విధమున...

నేను జెప్పెద మీరు మన్నించి వినుడు (ప్ర.ఆ.19) పిల్లలు తొలుత మాట్లాడేటప్పుడు నత్తిగా లేదా తప్పుగా పలికినా తల్లిదండ్రులు ఆనందంగానే వింటారు. అలాగే తన కవిత్వాన్ని తప్పులు పట్టి గేలి చేయకుండా వినాలని పండితుల్ని, ప్రజల్ని వేడుకొన్నది. "భక్ష్యములు మెక్కియావల బచ్చడియును నంజుకొనిన విధంబుగా నా ప్రబంధ మాలకింతురు". వారి కావ్యాలు భక్ష్యములని ప్రశంసించింది. అంత మాధుర్యం తన కవిత్వంలో లేదన్నది. అందుకే పచ్చడి వంటిదని తగ్గించుకొని చెప్పింది. తీపెక్కిన నోటికి రుచి తెలియాలంటే పచ్చడి కావలిసిందేనని చమత్కరించింది. తను చెప్పే కవిత్వాన్ని మన్నించి వినమన్నది. తనను తాను ఆవిష్కరించుకోటానికి కవిత్వం వారు వినక తప్పదని బతిమిలాడుతున్నట్టుగానే చెప్పుకున్నది వెంగమాంబ.

నా చిన్ననాట నోనమాలనైన నా
చార్యుల చెంత నే జదువలేదు
పరుగ ఛందస్సులో బది పద్యములనైన
నిక్కంబుగా నేను నేర్వలేదు
లలిగావ్య నాటకాలంకార శాస్త్రముల్
వీనులనన నే వినగ లేదు
పూర్వేతి హాస విస్ఫురితాంధ్ర సత్కృతుల్
శోధించిరీ వరుసా జూడలేదు
చేరి తరిగొండ పుర నారసింహదేవు
డానతిచ్చిన రీతిగా నే నిమిత్త
మాత్రమై పల్కుదును స్వసామర్థ్యమిప్పు
డరసి చూచిన గాని నా యందు లేదు"

వ్యవస్థీకృతమైన విద్య, చంధోలంకార శాస్త్ర జ్ఞానం, పురాణేతిహాస కావ్యనాటక సాహిత్య ప్రపంచంతో పరిచయం ఇవేమి తనకు లేవంటుంది. తరిగొండ నరసింహుడిని కారణంగా చూపి కావ్యకర్తగా నిమిత్తమాత్రురాలినని ప్రకటించింది.

ఆంధ్ర సాహిత్యంలోని రచనా ప్రక్రియలన్నింటిలో ప్రత్యేకమైంది, విస్తృతమైంది యక్షగానం. అలాంటి యక్షగాన రచన చేసి పేరెన్నిక గలిగిన మహాకవయిత్రి.

రాజయోగసారం, భాగవతం వంటి ద్విపద రచనలు చేస్తూనే సమకాలీన సాహిత్య ప్రపంచంలో వెంగమాంబకు సంబంధించిన ఒక స్వతంత్రత నిర్మాణశక్తిని ప్రదర్శించింది. ప్రధాన స్రవంతి కావ్య ప్రబంధ మార్గంలోకి ప్రవేశించేటప్పటికి ఎదురయ్యే సవాళ్ళ స్పృహ

ప్రదర్శించగలిగింది, "నా స్వతంత్రతకి బుధుల్ నవ్విపోరే" అని నిశ్చితార్థాన్ని ప్రకటించింది. వెంటనే "నవ్వినను నమ్మతంబని" కర్తవ్యానికి సిద్ధమైంది. ఎవ్వరేమనుకున్నా తాను చేయదల్చుకున్నది చేసింది. స్వయం నిర్ణయ శక్తిని, స్వతంత్ర ప్రవృత్తిని ప్రదర్శించే చైతన్యస్థాయికి చేరగలిగింది.

తరిగొండ వెంగమాంబకు సమకాలికురాలు సుభద్రాయమ్మ ప్రధానంగా శతక కవయిత్రి. రఘునాయక శతకం, వెంకటేశ శతకం, కేశవ శతకం మొదలైనవి. వీటిల్లో సందర్భాన్ని కల్పించుకొని మరీ తనకు ఛందశ్శాస్త్ర జ్ఞానం లేదని చెప్పుకున్నది.

ఘనకవీశ్వరులార ! కారుణ్య పరులారా !
　　పండితోత్తములారా ! భవ్యులార !
మీ కానతులు భక్తి మీఱంగ గావించి
　　విన్నపం బొనరింతు వినయమొప్ప
గణ వర్ణనియమ ప్రకారంబు లెఱుగను
　　యతి పద్ధతియు బ్రాసగతియు నెఱుని
బద్మాక్షు బొగడ బాపము వాయుననుచును
　　జేసితి నీకృతి చిత్తగించి
పరిహరించకుడీ యిందు నెరసులున్న
　　జక్కగా దిద్దుడీ సుప్రసన్న మతిని
నీరసములను సారస్యనిధుల జేయు వారెకద
　　పెద్దలన్న నీ వసుధలోన"

ఇదే రకమైన అభ్యర్థనా స్వరంతో మరో పద్యం –

సకల సత్కవి జన సంఘంబు గొనియాడి మనవి గావించెద వినయమలర

గూఢార్థమెంతయు గోచరించదు నాకు
　　బొలుపార పదసంధి బోధపడదు
నయమైన గణ వర్ణనియమంబు లెఱుగను
　　యతి పద్ధతియు బ్రాసగతియు నెఱుగ
కరివరదుని నుతి దురితహరింబని
　　చేసితి నీ కృతి చిత్తగించి
భక్తవత్సల నుతిగాన భారమనక కినుక
　　జెందక నాయెడగృప యెలర్ప
పరిహసించక నెరసులు బాసిపోవ
శాంత మొనరించి దిద్దుడీ సాదరమున

ఈ రెండు పద్యాలలోనూ సుభద్రాయమ్మ సకల కవి పండిత జన సంఘాన్ని సంబోధించింది. శతకకావ్య రచన వల్ల పాపాలు పోతాయని చేశానని అంటుంది. కవి పండిత జనస్వభావం తెలిసింది కనుకనే దయచూపమంది. పరిహరించక తప్పులు దిద్దమని విన్నవించుకున్నది.

తమది కాని స్థలంలో వారిదైన స్థానాన్ని నిలబెట్టుకోడానికి మొల్ల తరిగొండ వెంగమాంబ, సుభద్రాయమ్మ వీరు అనివార్యమైన స్థిరంగా వినయం ప్రదర్శించాక తప్పలేదు.

ప్రాచీన కవయిత్రులు 14వ శతాబ్దం చివరి నుండి 18వ శతాబ్దం వరకూ గల మధ్య కాలంలో తమ కవిత్వాలను వెలుగులోకి తెచ్చారు. మొల్ల, తాళ్ళపాక తిమ్మక్క, రంగాజమ్మ, ముద్దుపళని, తరిగొండ వెంగమాంబ వాళ్ళందరి కావ్యాల అవతారికల్లోను, గద్యల్లోను కొట్టొచ్చినట్టుగా కొన్ని సామాన్య లక్షణాలున్నాయి. అవి తమను గురించి తాము ఆడంబరంగా చెప్పుకోక పోవటం. వీలైనంత వినయంగా తమకేమి రాదని ప్రకటించుకోవటం, విశేషణాలని తక్కువగా వాడటం కనిపిస్తుంది.

మొత్తం మీద ప్రాచీన కాలపు సాహిత్య స్త్రీలు, పండిత పురుషులు ఏర్పర్చిన ఆధిపత్యపు సంప్రదాయ మార్గాలనే అనుసరిస్తూ అనుకరిస్తూ వాటినే తమలో ఇముడ్చుకొని సాహిత్య రూపంలో అందించారు. అయినా ఇది గొప్ప శ్రమ చేసినట్టుగానే అర్థం చేసుకోవాలి. వారు పూరించాల్సిన పండితారాధన ప్రభావమే ఎక్కువ ప్రభావితం చేసింది. అవతారికల్లో మేము రాసినం అని చెప్పటం కూడా సామాజికాదరణ గల ఆధ్యాత్మికం. కాబట్టి వాళ్ళ అవతారికను ఆవిష్కరించుకోవటం అనేది ఆధునిక సృజనాత్మకతకు ప్రతీక. అంటే ఒక తిరుగుబాటు అని చెప్పాలి.

మొదటి నుంచి కూడా సొంతగొంతు లేని తెలుగు సాహిత్యంలో స్త్రీలు ఒక కొత్త ఇతివృత్తాన్ని ఎన్నుకొని సాహిత్యాన్ని సృష్టించటం సాధ్యమయ్యే పనికాదు. అయితే విషయం పాతదే అయినా చెప్పే విధానాల్లో సొంతగొంతును వినిపించే ప్రయత్నం కవయిత్రులందరూ చేశారు.

ఏ ఇతివృత్తాన్నైనా చదివించగల నైపుణ్యంతో, భాషలోనూ, భావంలోనూ అన్ని విధాల తమదైన సొంత గొంతును బలంగా వ్యక్తం చేశారు. ఐతే స్త్రీలు కుటుంబ జీవితానికి భిన్నమైన ఇతర విషయాలనేవీ, సామాజికమైనవి, రాజకీయమైనవి ప్రస్తావించలేదు. రాజకీయ, సామాజిక విషయాలకు అవకాశం ఉన్న ఇతవృత్తం భారతానికి వుంది. అయితే ఈ పరిమితుల్లోనే వాళ్ళు వైవిధ్యాన్ని, నూతనత్వాన్ని, నిరాడంబరశైలిని, ఆకట్టుకునే విధానాన్ని ఆవిష్కరించగలిగారు.



# అల్పాక్షరముల ...



కావడానికి
అవి అల్పమైన వస్తువులే
కాని
అనుకోని పరిస్థితుల్లో
అనల్ప విషయాలు.

మ్యాగజైన్‌లో
చివరలు మలిచిన పేజీలు
అధ్యయన యాత్రలో
ముఖ్య మజిలీలౌతాయి.

ఇవాళెందుకో
ఇల్లంతా తిరుగుతున్నాను
ప్రతి గది మూలనా ఒకటి రెండు
చీపురు పుల్లలు దొరుకుతున్నాయి
అన్నింటినీ సేకరిస్తే
అదో సగం కట్ట అయ్యింది.
కొత్తది కొనాలనే
మా ఆవిడ ఆలోచనకు బ్రేకు పడింది.

గమనించనే లేదు
చివికిన బాత్ రూమ్ తలుపులకు
రంగు వెయ్యా లనిపించింది.

ఓ చోట
కరెంట్ వైర్‌కు చుట్టే రెడ్ టేప్ దొరికింది
మొన్న దీని కోసం మా వాడు
ఇల్లు పీకి పందిరేశాడు.

ఈ అద్దం
నా విద్యార్థి జీవితం నాటిది
దాని బ్లర్‌ను దాటి చూస్తే మసగ్గా
నాటి ఫ్లాష్‌బ్యాక్‌లు కనిపిస్తున్నాయి.

కిటికీలో
రెండు పెద్ద గుండీలు కనపడ్డాయి
అవి లేకపోతే
నేను కొత్త కోటు కొనాల్సి వచ్చేది.

నాకేదీ
వ్యర్థంగా కనిపించదు
కాలానికి
దాని అవసరముండాలి అంతే!
ప్రతి చర్యకూ
ఓ చరిత్ర వుంటుంది
నాది కొంత చురుకైన చూపే.

పేవ్‌మెంట్ మీద నడిచే కాళ్లకు
చెప్పు లున్నాయా అని గమనిస్తాను
పాతవైనా సరే.
ఆ నడక వారిని
ఏ గమ్యానికి చేరుస్తుందో అని ఆలోచిస్తాను.

నిన్న వేడి ఇసుకలో
పాక్కుంటూ పొయ్యే చీమను
చేతిలోకి తీసుకొని
చెట్టు నీడన వదిలాను.

పొద్దటి పూట
జాగింగ్ చేసే వృద్ధుని
స్పిరిట్‌ను మెచ్చుకుంటాను.

'నా వైపు వింతగా చూస్తూ
పిచ్చి పట్టినట్టు తిరుగుతున్నావ్'
అంది మా ఆవిడ
'అవును పిచ్చే
కవిత్వం రాస్తున్నాను' అన్నాను.

డా. ఎన్. గోపి
ఫోన్ : 939 102 8496

# సినిమాలలో తెలంగాణ భాష

**గంజి శశిధర్,** అధ్యాపకులు, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్, హైదరాబాద్.

ఫోన్ : 9492734183

*''ఏం దుర్గా ! మీ యారాల్తో గొడవన్నవ్ ! సెటిలయ్యిందా?''* అర్జున్‌రెడ్డి(2017), సందీప్‌రెడ్డి వంగా

*'ఏయ్ విద్యా ! ఏందే రెండేళ్ళయితుందా పెండ్లి జేసుకొని, మరింకా*

*నీళ్ళుపోసుకోలే?''* అర్జున్‌రెడ్డి(2017), సందీప్‌రెడ్డి వంగా

*"అట్ల బజార్‌కి పోతున్న వస్తవా ? బజార్ కొస్తవా ?''* ఫిదా(2017), శేఖర్ కమ్ముల

ఇవన్నీ సినిమా డైలాగుల్లాగా అనిపించడం లేదు. మన ఇండ్లలో, మన చుట్టుపక్కల వాళ్ళతో మనం నిత్యం మాట్లాడే మాటల్లాగే అనిపిస్తున్నాయి. ఇటువంటి తెలంగాణ భాషని అప్పుడెప్పుడో బి.నరసింగరావు గారు తీసిన 'మాభూమి'(1980) సినిమాలో విన్నాం. మళ్ళీ 'ఫిదా'(2017), అర్జున్‌రెడ్డి(2017) సినిమాల నుండి వింటున్నాం. 'మాభూమి' సినిమా తరువాత ఎందుకనో ఆ ఒరవడి కొనసాగలేదు. కానీ తరుణ్ భాస్కర్ రూపొందించిన 'పెళ్ళి చూపులు' (2016) సినిమాతో మళ్ళీ మొదలయిన సహజమైన తెలంగాణ మాట 'ఫిదా' (2017) సినిమాలో హీరోయిన్, 'అర్జున్‌రెడ్డి' (2017) సినిమాలో హీరో మాట్లాడిన తరువాత ఆ మాటల ప్రవాహం జీవనదిలా మారింది. ఆ పలుకుబడి తరువాత చాల సినిమాలకు ఒరవడి అయ్యింది.

దాశరథి రంగాచార్య గారు రచించిన 'చిల్లరదేవుళ్ళు' నవలను టి.మాధవరావు గారు 1977లో సినిమాగా మలచడంతో తెలంగాణ ప్రాంతపు కథ తొలిసారి సినిమా తెర మీది కెక్కింది. దాశరథి రంగాచార్య గారే ఈ సినిమాకు సంభాషణలు అందించడం విశేషం. తెలంగాణ భాషను తొలిసారి సినిమాకు పరిచయం చేసిన ఘనత వారికే దక్కుతుంది. ఆ వెంటనే తెలంగాణ ప్రాంతపు ఇతివృత్తంతో తెలంగాణ మాటలతో మాదిరెడ్డి సులోచన గారి నవల ఆధారంగా 'తరంమారింది'(1977) సినిమా, ప్రసిద్ధ ఉర్దూ రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ గారి 'కఫన్' నవల ఆధారంగా మృణాళ్‌సేన్ దర్శకత్వంలో 'ఒక ఊరికథ'(1977) సినిమా వచ్చాయి. అయితే పూర్తిస్థాయిలో వాస్తవికమైన తెలంగాణ భాషలో సంభాషణలు నడిచిన మొదటి సినిమా బి.నరసింగరావు గారి 'మాభూమి'. తెలంగాణ ప్రజల సమస్యనే కాదు ప్రజల జీవితాన్ని, ప్రజల భాషనూ వాస్తవికంగా వెండితెరకెక్కించిన సినిమా అది.

***పట్వారి :*** *"అదంత నాకు దెల్వదిరా! ఈ నేలముచ్చు మాటలన్ని నా దగ్గర పనికిరావు. అరేయ్ మీరేమనుకుంటున్నరో గాని నా దగ్గర కోర్టు ఫర్మానున్నది. ఏం సంగతి. ఖాళీ జేస్తరా లేకుంటె నన్ను ఖాళీ జేపియ్యమంటరా?"*

***రైతు :*** *"ఒక్క కోర్టు ఫర్మానా చేత బట్టుకొని మా బతుకులల్ల మన్ను బోస్తమంటే మేమెట్ల ఊకుంటం? తలకాయలు బగిలినా సరే ఈ భూమి నిడ్సిపెట్టేది లేదు"*

***పట్వారి :*** *"ఏంరో! లావు లావు మాట్లాడ్తున్నవ్! మస్కూరు మల్లిగా నాలుగు దన్ని అన్ని ఇవతలికి గుంజురా!"*

ఏ రకమైన పదాడంబరాలకు పోకుండా, పాండిత్యపు బరువు లేకుండా తెలంగాణ ప్రజల నాలుకలపై అలవోకగా ఆడే భాష తెరమీద పలికింది. ఎవరో చెప్పమంటే చెప్పినట్టు కాకుండా నటీనటుల మనసుల్లోంచే పుట్టుకొచ్చినట్టు ఉండడం ఆ మాటల ప్రత్యేకత. ఎందుకనో మరి అది ఆ తరువాత కొనసాగలేదు. అడపా దడపా అక్కడక్కడా తెలంగాణ మాట వినిపించినా అది చాలా కృతకంగా ఉంది. హైదరాబాదు భాషే మొత్తం తెలంగాణ భాషగా ఆయా దర్శక రచయితలు భావించినట్లు మనకు అర్థం అయితుంది. తెలంగాణలో ఎక్కడా ఎవరూ మాట్లాడని భాష, ఉర్దూ పదాలను అధికంగా కలిపి కల్పించిన భాష తెలంగాణ భాషగా తెరకెక్కింది. అది కూడా తెలంగాణ భాష మీద పట్టులేని నటుల వల్ల వింతగా మారింది.

1985లో టి.కృష్ణ రూపొందించిన 'ప్రతిఘటన' (సంభాషణలు: ఎంవిఎస్ హరనాథరావు) చిత్రం, అందులోని సంభాషణలు విజయవంతమయ్యాయి. కోట శ్రీనివాసరావు మాట్లాడిన తెలంగాణ భాష అందరికీ కొత్తగా అనిపించింది. తరువాతి సినిమాలలో అక్కడక్కడా కొన్ని సన్నివేశాలలో అటువంటి సంభాషణలు రాయడానికి ప్రేరణ నిచ్చింది. కానీ అవి విలన్లకు కమెడియన్లకు మాత్రమే. అలా చిరంజీవి కథానాయకునిగా తెరకెక్కిన 'రుద్రనేత్ర' (1989, మాటలు: సత్యానంద్) చిత్రంలో రెడ్డినాయుడు పాత్ర (నూతన్ ప్రసాద్) తెలంగాణ భాష మాట్లాడుతుంది. కథానాయక పాత్ర రుద్రనేత్ర (చిరంజీవి) కూడా కొన్ని సన్నివేశాలలో తెలంగాణ భాష మాట్లాడుతుంది. అదే సంవత్సరంలో వచ్చిన 'శివ' (1989, మాటలు : తనికెళ్ళ భరణి) సినిమాలో కూడా రెండు మూడు పాత్రలు తెలంగాణ భాష మాట్లాడుతాయి. సినిమాలో సంభాషణలు వీలైనంత సహజంగా ఉండేలా చూసుకోవడం రాంగోపాల్‌వర్మ ప్రత్యేకత. అందువల్ల అతని దర్శకత్వంలో వచ్చిన గాయం (1993, మాటలు: తనికెళ్ళ భరణి, పోసాని కృష్ణమురళి), దెయ్యం (1996, మాటలు: కొమ్మనాపల్లి గణపతిరావు) తదితర సినిమాలలో హైదరాబాదు

ప్రాంతపు తెలంగాణ భాష మరీ కృతకంగా లేదు. తరువాత అతని దగ్గర కెమెరామెన్‌గా పనిచేసిన తేజ తీసిన 'నువ్వు నేను' (2001)లో కూడా ఇటువంటి సంభాషణలు ఉన్నాయి. 'శివ' తరువాత వచ్చిన 'అంకుశం' (1990) సినిమాలో విలన్ పాత్ర నీలకంఠం (రామిరెడ్డి) పలికిన తెలంగాణ సంభాషణలు అందరికీ బాగా నచ్చాయి. రామిరెడ్డికి కూడా బాగా పేరు వచ్చింది. తరువాతి కాలంలో విలన్‌గా తెలంగాణ సంభాషణలు పలుకడం కోట శ్రీనివాసరావుతో పాటు రామిరెడ్డికి ప్రత్యేకతగా మారింది. తరువాత తనికెళ్ళ భరణి కూడా వీరి వరుసలో చేరాడు. 'మాభూమి' సినిమాలో నటించిన శకుంతల తర్వాత కాలంలో 'తెలంగాణ శకుంతల'గా పేరు పొందింది. 'సమ్మక్క సారక్క', 'ఒసేయ్ రాములమ్మ', 'నువ్వు నేను', 'జగడం', 'లక్ష్మి' తదితర సినిమాలలో తెలంగాణ భాష సమర్థవంతంగా పలికింది. కోట శ్రీనివాసరావు 'గాయం', 'జయమ్ము నిశ్చయమ్మురా', 'గణేష్' తదితర సినిమాలలో రామిరెడ్డి 'ధర్మక్షేత్రం', 'అడవిలో అన్న', 'ఒసేయ్ రాములమ్మ' మొదలైన సినిమాలలో తనికెళ్ల భరణి 'యమలీల', 'బొంబాయి ప్రియుడు','నువ్వు నేను' మొదలైన సినిమాలలో తెలంగాణ సంభాషణలు పలికారు. 1995లో వచ్చిన 'పోకిరి రాజా' (మాటలు: పరుచూరి బ్రదర్స్) సినిమాలో వెంకటేష్, సత్యనారాయణ మొదలైన వాళ్ళు తెలంగాణ భాష మాట్లాడారు. అది పరాకాష్టను పొందిన కృతక భాష అని చెప్పవచ్చు. 1996లో రామ్ గోపాల్‌వర్మ తీసిన దెయ్యం(మాటలు కొమ్మనాపల్లి గణపతి రావు) సినిమాలో హీరో జెడి చక్రవర్తి సినిమా మొత్తం తెలంగాణ భాషను మాట్లాడడం జరిగింది. కానీ ఇవేవీ అసలైన తెలంగాణ భాషను తెరకెక్కించ లేకపోయాయి. దర్శక రచయితల దృష్టిలో తెలంగాణ భాష అంటే ఉర్దూ పదాలు కలగలిసిన హైదరాబాద్ భాష మాత్రమే. దాన్ని కూడా వాళ్ళు ఉర్దూ పదాలు అధికంగా వాడి కొత్త ప్రయోగాలు చేసి ఎక్కడా మాట్లాడని ఒక భాషను తయారు చేశారు. ఆ భాష సినిమాలలో మాత్రమే మాట్లాడుతారు. కనీసం వాళ్లకు హైదరాబాద్ అని పలకడం కూడా రాదు. హైద్రాబాడ్ అంటూ వింతగా పలుకుతారు. అవే మాటలు చాలా సంవత్సరాల పాటు కమెడియన్‌లకు సైడ్ విలన్లకు వాడారు. మెయిన్ విలన్ రాయలసీమ మాండలికం మాట్లాడుతాడు.

ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. తెలంగాణ ఉద్యమానికి ముందు సినిమాకు తెలంగాణ భాష అంటే హైదరాబాదులో మాట్లాడే భాష మాత్రమే కానీ హైదరాబాదులోని భాషకు మిగతా తెలంగాణ జిల్లాలోని భాషకు చాలా వ్యత్యాసం ఉంటుంది. తెలంగాణ ప్రాంతంలోని భాషలో ఉర్దూ పదాలు కలిసినట్లే ఆంధ్ర ప్రాంతంలోని భాషలోనూ ఉర్దూ పదాలు కలిశాయి. కానీ తెలంగాణ భాష అంటే అచ్చం ఉర్దూ పదాలే అన్నట్లు సాగినాయి సినిమాల్లోని మాటలు. ఇప్పటికీ ఎన్నో ప్రాచీన రూపాలను నిలుపుకున్న భాష తెలంగాణ భాష. ఉదాహరణకు 'తోల్కొనిరా' 'తోల్కొనిపో' అని తెలంగాణలో వ్యవహరిస్తారు. ఇక్కడ 'తోల్కొని' అనే పదం యొక్క ప్రాచీన రూపం 'తోడ్కొని', ఈ పదం ప్రాచీన కావ్యాలలో విస్తృతంగా ప్రయోగింపబడినది. ఇందులోని 'డ'కారం జనవ్యవహారంలో 'ల'కారంగా మారింది. ఇటువంటివి అనేకం ఉన్నాయి. హైదరాబాదు పరిస్థితి వేరు. రాజధాని నగరం కావడం వలన ఉద్యోగ వ్యవహారాల కోసం వ్యాపార అవసరాల కోసం వలస వచ్చిన ఇతర భాషల ప్రజల వల్ల ఇంకా వందల ఏళ్ళు ఉర్దూ అధికార భాషగా ఉండడంవల్ల ఇక్కడి భాష మిశ్రమ భాషగా రూపొందింది. అదే దాని ప్రత్యేకత. ఆ భాషను ఎగతాళి చేసినట్లు సినిమాలల్లో వాడటమే కాకుండా అదే యావత్ తెలంగాణ భాష అన్నట్లుగా చూపడం జరిగింది. 21వ శతాబ్దం తొలి దశాబ్దిలో తెలంగాణ ఉద్యమం మొదలయ్యాక సినిమా సంభాషణల్లో మార్పు మొదలయింది, తెలంగాణ భాషకు గౌరవం కలిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాక తెలంగాణ భాష హీరో హీరోయిన్ల భాషగా మారింది. ఇప్పుడు సినిమాలలో హీరో హీరోయిన్లు అందమైన తెలంగాణ భాష మాట్లాడుతున్నారు –

*"పెళ్లిచూపులే అయినయ్. ఇట్లాంటోళ్ళని పెళ్లి తర్వాత గూడ వొదిలేయొచ్చు. తప్పేం లేదు."* అర్జున్‌రెడ్డి(2017), సందీప్‌రెడ్డి వంగా

*"అరె ఏందిరా! ఎల్లుండేగా మనం బోయేది. సదురుకోవా నువ్వు?"* అర్జున్‌రెడ్డి(2017), సందీప్‌రెడ్డి వంగా

*"ఇగో జాగర్తగా పో"* ఫిదా(2017), శేఖర్ కమ్ముల

*"అక్కా! ఏరీళ్ళు ?"* ఫిదా(2017), శేఖర్ కమ్ముల

*"ఇగ జాల్లే"* ఫిదా(2017), శేఖర్ కమ్ముల

*'ఇది గూడ గావాల్నా అక్కా?"* ఫిదా(2017), శేఖర్ కమ్ముల

సమర్థించుకోవాలన్నా, సముదాయించాలన్నా, మామూలుగా మాట్లాడాలన్నా మనం మన ఇళ్ళల్లో మాట్లాడే మాటలనే సినిమాలలోనూ ఉపయోగించవచ్చు అని, అలా చేస్తే ఆ సన్నివేశాలు చాలా బాగుంటాయి అని నిరూపించినవి ఈ సంభాషణలు.

ఒకప్పుడు వచ్చిన కమర్షియల్ సినిమాలు తీసిన వారు, వాటికి మాటలు రాసినవారు, వాటిని పలికినవారు ఎవరూ కూడా తెలంగాణ వారు కాకపోవడం వలన ఆ భాష వింతగా తయారయింది. వాళ్ళెవరూ తెలంగాణ భాష గురించి తెలుసుకోవడానికి ప్రత్నించినట్టు కూడా అనిపించదు. కానీ ఇప్పటి దర్శకులు, రచయితలు, నటులలో తెలంగాణవారు కూడా ఉండడం వలన వాస్తవికమైన తెలంగాణ భాష సినిమాలకు ఎక్కుతున్నది. ముఖ్యంగా ఫిదా, అర్జున్ రెడ్డి సినిమాల తరువాత ఆ ఒరవడి కొనసాగుతున్నది. మల్లేశం (2019), దొరసాని (2019), ఎఫ్2 (2019), ఫలక్నుమాదాస్ (2019), గద్దలకొండ గణేష్ (2019), వకీల్ సాబ్ (2021) మొదలైన సినిమాలన్నీ అలా వచ్చినవే. కొన్ని సినిమాలలో సంభాషణలు అక్కడక్కడా పాత వాసనలు కొడుతున్నా (ఇస్మార్ట్ శంకర్, 2019) మిగతావి నూతన పరిమళాలను వెదజల్లుతూ ప్రేక్షకులను రంజింపజేస్తూనే ఉన్నాయి.

# నిజామాబాద్ జిల్లా గేయ, వచన కవిత్వం (2002-12) - ఒక పరిశీలన

**మున్నం శశికుమార్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9959811435

**(పరిశోధనా వ్యాసం...... సాహిత్య ధార)**

కవిత్వం ఒక సృజనాత్మక ప్రక్రియ. పాఠకుడిని కదిలించగలిగే శక్తి కవిత్వానికి ఉంటుంది. తెలుగు సాహిత్యం తొలుత 'పద్యం' తో మొదలై అనేక రచన ప్రక్రియలను తనలో చేర్చుకుని దిన దిన ప్రవర్ధమానమయింది. ఆధునిక కవిత్వానికి 'వస్తువే' ప్రధానం. వీరు ఆ వస్తు వర్ణనకు, విభిన్న ప్రక్రియలు ఎంచుకోవడం విశేషం. అయితే ఇది భాష లో ప్రౌఢత్వం నుండి 'సరళత్వాని'కి, ప్రక్రియలో 'పద్యం' నుండి 'వచనాని'కి మార్పు చెందడం ఒక ముఖ్య పరిణామం.

నిజామాబాద్ జిల్లాలో కూడా సాహిత్యం పద్యం, గద్యం, వచనం వంటి అనేక ప్రక్రియలలో చాలా సంవత్సరాల నుండే రావడం మొదలైంది. ఇంకా వచనంలో మినీకవిత, దీర్ఘకవిత, హైకూ, గజల్ మరియు నానీ వంటి ఆధునిక వచన కవితా రూపాలూ ఉన్నాయి. తెలంగాణ ఉద్యమ కవిత్వమూ వీరికి వస్తువయింది. ఇలా జిల్లా కవిత్వంలో వస్తు వైవిధ్యము, ప్రక్రియా వైవిధ్యం రెండూ స్పష్టంగా మనకు గోచరిస్తాయి.

ఈ అంశమే **"నిజామాబాద్ జిల్లా గేయ, వచన కవిత్వం (2002-12) -ఒక పరిశీలన"** అనే శీర్షికను ఎన్నుకుని పరిశోధక విద్యార్థిగా శ్రీమతి.డా.పి.వారిజా రాణి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం గారి వద్ద నా యొక్క పరిశోధనను కొనసాగించేలా చేసింది. దీనిలో భాగంగా జిల్లాల్లో 2002 నుండి 2012 మధ్య వచ్చిన గేయ, వచన (ముద్రితమైనవి మాత్రమే) ఆధారాలను సేకరించి, వాటిలో కవులు కవయిత్రులు ఎంచుకున్న వస్తు వైవిధ్యాన్ని, రచనా సరళిని, వారు పాటించిన ప్రక్రియా భేదాన్ని పరిశీలించం జరిగింది.

ఆరు అధ్యాయాలుగా సాగిన పరిశోధనలో, 'జిల్లా సాహిత్య-సాంస్కృతిక చరిత్ర' ను, 'గేయ' కవిత్వాన్ని, 'వచన' కవిత్వాన్ని, 'అస్తిత్వవాద' కవిత్వమును, 'ప్రత్యేక ప్రక్రియల'లో వచ్చిన కవిత్వాన్ని, 'భాషా సంబంధిత అంశాల'ను, వరుస అధ్యాయాలలో పరిశీలించటం జరిగింది.

మొదటి అధ్యాయం 'జిల్లా సాంస్కృతిక- సాహిత్య చరిత్ర'ను ప్రస్తావిస్తూ కొనసాగుతుంది. ఇందులో ప్రధానంగా జిల్లా యొక్క విశేషాలు, జిల్లాలో సాహిత్య రచన ఆరంభం-వికాసాలు, దోమకొండ సంస్థానం యొక్క పాత్ర, ఇందూరు జిల్లాలోని గొప్ప కవులు, జిల్లాలోని జానపద కళలు- వాటి ప్రదర్శకులు, జిల్లా సాహిత్యం పై వచ్చిన పరిశోధనలు, జిల్లాలో చరిత్ర రచన ప్రారంభం మొదలగు వాటి పరిచయం గురించి సంక్షిప్తంగా పేర్కొనబడింది. నేటి జిల్లాలోని 'బోధన్' పట్టణం నాటి భారత దేశ చరిత్రలో 'షోడశ మహాజనపదాలు' గా విలసిల్లిన పదహారు మహా జనపదాలలో 'అశ్మక' లేదా 'అస్సక' పేరుతో విరాజిల్లింది. దక్షిణ భారతదేశంలోనే ఏకైక మహాజనపదం మన రాష్ట్రం నుండే ఉండడం గొప్ప విషయం. దీన్ని నాటి శాసనాలు, మెగస్తనీస్ రాసిన 'ఇండికా' గ్రంథం లాంటివి ప్రస్తావించాయి. నాటి రాష్ట్రకూట మూడవ ఇంద్రవల్లభుని పేరున 'ఇంద్రపురి' గా మారిన పట్టణమే నేడు 'ఇందూరు' గాను, నిజాం పాలనలో 1905 సంవత్సరంలో 'నిజాం అలీ ఖాన్' పేరున 'నిజామాబాద్ ' గానూ మారి, ఇదే పేరు స్థిరపడింది.

ఇక జిల్లా సాహిత్యచరిత్రలో వేములవాడ పాలకుడైన అరికేసరి ఆస్థానంలోని 'పంప' (బోధన్ ప్రాంతంలో ఉంటూ) అనే కవి కన్నడంలో భారత రచన ప్రారంభించాడు. ఇక జిల్లా లోనే 'తొలి తెలుగు కవి'గా గొప్ప కథాకావ్యం అయిన 'సింహాసన ద్వాత్రింశిక' ను రచించిన 'కొరవి గోపరాజు' అని నిర్ణయించారు. సిరికొండ మండలం దగ్గర గల 'పల్లికొండ' గ్రామం వీరి స్వంత ఊరు అని గుర్తించడం జరిగింది. నాటి నుంచి నేటివరకు ఆగకుండా సాగుతున్న సాహిత్య రచనకు దోహదపడిన వాటిలో 'దోమకొండ' సంస్థానం కూడా ఒకటి. ఇలా కొనసాగుతున్న సాహితీ వికాసాన్ని తొలుత రచించింది 'గిరినాగభూషణం' గారు. సురవరం వారి 'గోల్కొండ కవుల సంచిక' కూడా కృష్ణమాచార్యులు, హనుమద్దాసు, అనంత రామ శర్మ లాంటి వారిని పేర్కొంది.

అప్పటి నుండి వికసించిన జిల్లా సాహిత్య వికాసాన్ని మేడవరపు అనంత రామకృష్ణ శర్మ , డా. శంకర్, స్వర్గీయ చాట్ల నర్సయ్య మరియు డా. కాసర్ల నరేష్ రావు వంటి వారెందరో వారి పరిశోధనల ద్వారా గ్రంథస్థం చేశారు. 2007 లో జిల్లా శతాబ్ది ఉత్సవ కార్యక్రమలలో ప్రత్యేక సాహిత్య సంచిక కూడా విడుదల చేశారు.

రెండవ అధ్యాయం అయిన 'గేయ కవిత్వం' జిల్లాలో వచ్చిన 'గేయ కవిత్వాన్ని' వస్తు పరమైన విశ్లేషణ చేయడం జరిగింది. ఈ అధ్యాయంలో భక్తి గేయాలు, బాలల గేయాలు, తెలంగాణ ఉద్యమ గేయాలు, సామాజిక సందేశాత్మక గేయాలు, భావ కవితాత్మక గేయాలు (ప్రణయ గేయాలు), ఇంకా సినీగేయాల లాంటి వాటిలో వస్తువును పరిశీలించడమైనది. 'రుద్రంగ్ రమేష్' జిల్లాలోనే వెనకబడిన ప్రాంతంగా పేరొందిన 'మద్నూర్' ప్రాంతానికి చెందినవాడైనప్పటికీ 'సినీ గేయ' రచయితగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తుండటం విశేషం.

కష్టపడే వారికి ఎప్పటికైనా విజయం సిద్ధిస్తుందనే ఉద్దేశ్యంతో "ప్రయత్నానికి లేదు ఎప్పుడు ఓటమి / ధ్యేయమే సాయమై పోగా

ఓడదా ఓరిమి" (అమ్మా నాన్నలు–పుట. 84 ) అనే అభ్యుదయ గేయాన్ని రాశాడు కవి 'రుద్రంగ్ రమేష్'. బాసర క్షేత్ర వర్ణన చేస్తూ "కమనీయం ఈ బాసరపురం కాంచగ రారండి/రమణీయం ఈ దివ్య క్షేత్రం చూసి తరించండి" (లలిత తరంగాలు–పుట. 37) అని క్షేత్ర వర్ణన చేస్తారు కవి డా. కాసర్ల నరేష్ రావు. ఇక, "చదువు రాక దగా పడే మనవాళ్ళకు / చేయూతను అందిద్దాం– చేతనైన సేవ చేద్దాం" (ఏ సిరాతో రాయాలి?–పుట 51) అని తెలంగాణ సమాజంలోని 'స్త్రీ విద్య' యొక్క ఆవశ్యకతను చాటుతోంది కవయిత్రి 'చాడా లలితాదేవి'. తెలంగాణ సమాజంలోని గ్రామీణ పేద ప్రజల జీవితాలను వర్ణిస్తూ "సద్ది అన్నం లేకపాయే గంజినీళు మిగలవాయే / అప్పుల తిప్పలాయే పిల్లలేమో ఎక్కువాయే" (మువ్వ గజ్జెలు–పుట. 16 ) అంటూ 'పడాల రామారావు' గారు రాసిన గేయ పంక్తుల్లో గ్రామాల దుస్థితి, మాండలిక భాషలో వర్ణించబడింది.

మూడవ అధ్యాయం అయిన 'వచన కవిత్వం'లో 2002–12 మధ్య వచ్చిన కవిత్వంలో వస్తు వైవిధ్యాన్ని పరిశీలించడం జరిగింది. వివిధ వచన కవితా సంకలనాలు, కవుల, కవయిత్రుల సంపుటాలను సేకరించి, వస్తు పరమైన పరిశీలన చేయడం జరిగింది. ఇందులో కవులు, కవయిత్రులు చేపట్టిన కవితా వస్తువు ప్రధానంగా సామాజిక అంశాలు, సమస్యలు, రాజకీయాలను, రైతాంగ సమస్యలను, మానవతా విలువలను, వలసలను, స్త్రీల సమస్యలను, కుటుంబ విలువలు, ప్రబోధాత్మకంగాను, వ్యక్తిత్వ వికాసం, ప్రకృతి–పర్యావరణ సంబంధితంగాను ఉంటూ కవుల–కవయిత్రుల ఆసక్తులను, అభిరుచులను మనకు తెలిజేస్తాయి అని చెప్పవచ్చు.

'ప్రకృతి'కి జరుగుతున్న నష్టాన్ని వర్ణిస్తూ "దిక్కులను విశాలం చేస్తున్న నరికివేతల్ని / ముక్కలు చెక్కలుగా నరికి వేయాలి" (చుక్కలు–పుట. 5 ) అని గళమెత్తుతారు కవి 'ఆచార్య అయాచితం నటేశ్వర శర్మ' గారు. దిక్కులు విశాలం చేయడం 'అడవుల నరికివేత' ను సూచిస్తున్నది. మారుతున్న దేశ ముఖచిత్రాన్ని వర్ణిస్తూ "పట్నం ముఖమంటే / చీమలు పడుతున్న బెల్లమే" (చైతన్య వసంతం–పుట. 66)అని తన కవితలో వర్ణిస్తాడు 'గఫూర్ శిక్షక్' అనే కవి. దేశభక్తిని వస్తువుగా గ్రహించి "వందేమాతరం గీతం వాస్తవాలు తెలుపమంది / వందేళ్ల మాతరం / మారలేదు ఈ తరం" (పంపా తరంగాలు – పుట. 64) అని పౌరులుగా మన, మన దేశ జయపజయాలను ప్రశ్నిస్తోంది కవయిత్రి 'జి.విజయ నిర్మల'.

ఈ భూమి మీద అత్యంత విలువైన 'నీళ్ళ' విలువను మనకు చెబుతూ "అలిగి / వెళ్లిపోతేనే కదా / సహారాలు థార్లు" (సూర్యుడు అనేక రంగుల్లో ఉదయిస్తాడు–పుట. 1 ) అని పరోక్షంగా హెచ్చరిక చేస్తాడు సామాజిక దృష్టి కోణంతో కవి. డా. వి.ఆర్.శర్మ. ఇక తన భర్త పంచిన మధురానుభూతులను తలచుకుంటూ "నీలో /అద్భుత చిత్రాన్ని చూశాను /అర్థం కాని కవిత్వాన్ని చూశాను" (నా కలల ప్రపంచంలో–పుట. 47 ) అని భావుకతతో తన భాగస్వామిని గూర్చి వర్ణిస్తోంది కవయిత్రి 'కిరణ్ బాల'. తన ప్రమేయం లేకుండానే తన జీవిత భాగస్వామిని నిర్ణయించే నేటి సమాజాన్ని "నేను మీరు కని పెంచిన మొగ్గను/నను మీ చేతులతోనే నలిపేస్తారా?" (పంపా తరంగాలు – పుట. 46 )అంటూ 'స్త్రీ స్వేచ్ఛ' ను ప్రశ్నిస్తోంది కవయిత్రి 'అలివేణి'. 'ఉగ్రవాదం'ను వస్తువుగా చేసుకుని జంటనగరాల్లో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో "జంట నగరాలకు జంట విస్ఫోటనాలు/పేలుళ్ళ సంస్కృతి పెద్ద ఎత్తున దిగుమతి" (సూర్యుని ఏడో గుర్రం–పుట. 24) అని దేశంలో, రాష్ట్రంలోని ప్రజల భద్రతను సూటిగా ప్రశ్నిస్తాడు కవి 'ఏ.సూర్యప్రకాష్'. ఈ ప్రపంచంలో అత్యంత విలువైన దనిపించుకున్న 'స్నేహాన్ని' వస్తువుగా గ్రహించి "చెట్టుకు పువ్వు స్నేహం / మబ్బుకు నీరు స్నేహం / నీటికి నేల స్నేహం" (అద్దం–పుట. 22) అని వివిధ అంశాల మధ్య ఉన్న విడదీయరాని బంధాలను పోల్చుతూ చెబుతోంది బాల కవయిత్రి 'బి. భానుప్రియ'.

నాలుగవ అధ్యాయంగా ఉన్న 'తెలంగాణ ఉద్యమ కవిత్వం'లో 'తెలంగాణ అస్తిత్వవాదం' పై వచ్చిన వివిధ కవితలను పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలనలో ప్రధానంగా ఉద్యమ కవిత్వంపై వచ్చిన వివిధ వస్తుపరమైన కవితలను విశ్లేషించడం జరిగింది. 'తెలంగాణ ఉద్యమ కవిత్వం' గా పేర్కొన్న ఈ అధ్యాయంలో తెలంగాణా రక్షణల వైఫల్యం, అమర వీరులు , వలస పాలన, తెలంగాణ అమాయకత్వం, నీళ్ళు–నిధులు–నియామకాలు, కమిటీలు, పోరాట పంథా, స్వరాష్ట్ర ఆవిర్భావ ఆకాంక్ష , తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, తెలంగాణ వీరుల స్మృతి , ప్రబోధాత్మకం లాంటి అంశాలే ప్రధాన వస్తువులుగా నిలిచాయి అని చెప్పవచ్చు. ఉద్యమ స్ఫూర్తిని కవులు, కవయిత్రులు కొనసాగించారు. అంతేకాకుండా ఉద్యమ కాలంలో తెలంగాణ భాష, యాసల ప్రాధాన్యత స్పష్టంగా వీరందరి కవిత్వంలో కొనసాగింది. వీరు రాసిన చాలా కవితలు తెలంగాణ భాష, నుడికారం, మాండలిక ప్రయోగంతో వైవిధ్యాన్ని ప్రదర్శించింది అని చెప్పవచ్చు.

"మా నిగ్రహాన్ని ఇలాగే కాలరాస్తే / విగ్రహాలను చిత్తు చేస్తాం/ జంగిటి మోత మోగిస్తాం" (నుడుగుపిడుగులు–పుట. 23) అని తెలంగాణ ప్రజల ఓపికను ఇంకా పరిక్షించొద్దని, తెలంగాణ సాధనకై ఎంతకైనా తెగిస్తామని ప్రకటిస్తాడు ఉద్యమ కవి 'తిరుమల శ్రీనివాస్'. "భూమిలో పాతిపెట్టి విత్తనాన్ని చంపగలరా / దౌర్జన్యాలతో రెచ్చిపోయి ఉద్యమాన్ని అణచగలరా?"(నుడుగు పిడుగులు–48 ) అనే చక్కటి సామ్యంతో వలస పాలకులను హెచ్చరిస్తాడు కవి 'ఘనపురం దేవేందర్'. తన గడ్డపై వలస వాదుల ఆగడాలను గర్జిస్తూ "నా పురిటి గడ్డపై/ నెత్తురు పారిస్తారా /కబడ్దార్! / మూటా ముల్లె సర్దుకోండి" (అంకురం –పుట. 62) అని విప్లవ భావజాలంతో కన్నెర్ర జేస్తోంది 'ఎం. విజయ' అనే కవయిత్రి. "నాది వీర తెలంగాణ దాశరథి భాష/ నాది వేరు తెలంగాణ కాళోజీ బాట" (ఒకటే మాట తెలంగాణ–పుట. 42) అంటూ జరగబోయే ఉద్యమంలో తన భాష, బాటల మార్గాన్ని ముందే ప్రకటిస్తాడు అభ్యుదయ కవి 'సి. హెచ్.మధు'.

ఇక తెలంగాణ, అందునా జిల్లా మాండలిక ప్రయోగంతో "సాఫ్ సీదా /ఖరా ఖండీగా/ఆఖరి మాట/మల్లడగద్దు" (అలజడి-పుట.30) అని రాజధాని, తెలంగాణ ఆత్మ అయిన 'హైదరాబాద్' గురించి తేల్చి చెప్పేస్తాడు కవి 'సి.హెచ్.ప్రకాష్'. తెలంగాణ ప్రజల జీవన శైలిని వర్ణిస్తూ "వ్యవసాయం మా వృత్తి /బీడీలు చేయడం మా ప్రవృత్తి/నిజాంసాగర్ ఉండీ నిండక /వ్యవసాయాన్ని చేస్తోంది అధోగతి" (పంపా తరంగాలు-పుట.32 ) అని ఇక్కడి కడగండ్లను, కళ్ళకు కడతాడు కవి 'అబ్బరాజు శేష తల్పసాయి' అనే కవి. తెలంగాణ బ్రతుకులను "ఉద్దెర బ్రతుకులు, దొరకని మెతుకులు/ ఉరిసే గుడిసెలు / నా తెలంగాణలో" (తబ్దీల్-పుట.48) అని తెలంగాణ ప్రజల స్థితిగతులని హృద్యంగా వర్ణించాడు కవి 'గఫూర్ శిక్షక్'.

'అయిదవ అధ్యాయం'లో 'ప్రత్యేక ప్రక్రియల'లో వచ్చిన కవిత్వమును పరిశీలించడం జరిగింది. తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు వచ్చి చేరాయి. ఇవి జిల్లా కవిత్వంలోనూ కనిపించాయి.

జిల్లా కవులు, కవయిత్రులు ముఖ్యంగా గజల్, మినీ, దీర్ఘ, హైకూ, నానీ లాంటి ప్రక్రియలలో రచనలు చేశారు. గజల్ లాంటి క్లిష్ట ప్రక్రియలో 'సూరారం శంకర్' ఇప్పటికే మూడు గజల్ కవితా సంపుటాలు ప్రచురించారు. జిల్లాలోనే 'మొదటి గజల్ కవి'గా నిలిచారు. వీరి మొదటి గజల్ సంపుటంలో "నా నీడే నా ఉనికిని వీడినట్టుగా ఉంది/నా శ్వాసే నా తనువుని తొడినట్టుగా ఉంది" (సౌగంధిక -పుట.58 ) అంటాడు 'మత్లా' లేదా మొదటి షేర్లో తన మనసు బాధను వ్యక్తీకరిస్తూ. ఇక గజల్ లో కవి 'కలం పేరు' వచ్చే చివరి షేర్ లేదా 'మఖ్తా'లో తన ప్రేయసి నుండి ఎదురైన ఎడబాటును "శిలలతో స్నేహాలు వలదని చెప్పినా వినవేమీ 'శంకర్'/ శిలను శిల్పం చేయబూనితి జాలి కానరాదు" (సౌగంధిక-పుట.42) అని భారమైన హృదయంతో చెప్పుకుంటాడు.

అలాగే 'శాస్త్రాన్ని -సాహిత్యాన్ని' సమ్మిళితం చేసి 'స్వప్న శకలం' అనే దీర్ఘ కవితను సృష్టించారు 'సి.హెచ్.ప్రకాష్'. ఇది బహుశా రాష్ట్రంలోనే విశ్వ ఆవిర్భావంపై తొలి దీర్ఘ కవిత అని 'డా. అద్దేపల్లి రామమోహన్ రావు' గారు ముందుమాట రాస్తూ చెప్పారు. "ఇంత అణువులో/ అనంత విశ్వం ఎలా /ఇముదుకున్నదో" (స్వప్నశకలం-పుట.2) అని మొదలు పెట్టిన ఈ కవి స్వప్నం "అనంత విశ్వ క్షేత్రంలో../ కుశలమే/పృథ్వీతలం/వనమాలి సంరక్షణలో" (స్వప్నశకలం-పుట.60) అనే విశ్వాసంతో ముగుస్తోంది.

"వెన్నెలలు మూట కట్టిన /చీకటి వస్త్రానికి పద్ద చిరుగే/విదియ నాటి చంద్రుడు" (అరుణ కిరణాలు-పుట.42 ) అని విదియ చంద్రుడే లక్ష్యంగా రాసిన హైకూతో ఈ ప్రక్రియలో రాణించే ప్రయత్నం చేసింది శ్రీమతి 'అయాచితం అరుణ కుమారి'. ఆచార్య గోపీ గారు సృష్టించిన 'నానీ' లతో మనల్ని మెప్పించే ప్రయత్నం చేశారు డా. శంకర్, ప్రకాష్, రమేష్ లాంటి వారు. ఇక్కడ కూడా ప్రక్రియా వైవిధ్యమే కాక, వస్తు వైవిధ్యమూ చూపే ప్రయత్నం చేశారు వీరందరూ. "అవినీతిలో ఆధునికతను/దోపిడీలో నైపుణ్యాన్ని/ ఆదర్శాలుగా చప్పరిస్తాం.." (గులేర్ - పుట.47) అని ఈ సామాజిక దుర్లక్షణాలను వ్యంగ్యంగా విమర్శిస్తాడు కవి డా. 'వి.శంకర్' తన నానీలో. "ఆస్తిపాస్తులు /ఉన్నంతవరకే /ఈ బంధాలు/రక్త సంబంధాలు" (యెల్దిరత్నాలు-పుట.37 ) అనే కఠిన నిజాన్ని సూటిగా తన 'మినీ' కవిత ద్వారా వ్యక్త పరుస్తూ, సమాజ సంబంధాలు దేనిపై ఆధారపడుతున్నాయో ఆలోచించుకొమ్మంటాడు కవి 'యెల్ది సుదర్శన్'.

'ఆరవ అధ్యాయం'లో "భాషా సంబధిత అంశాల" పరిశీలన చేయగా, ప్రధానంగా కవులు, కవయిత్రులు వారు వాడిన భాష-మాండలికం, జాతీయాలు, సామెతలు, అన్యాదేశాలు-వాటి ప్రయోగ లాంటి అంశాలను గుర్తించడమైనది. ఈ అంశాల యొక్క ప్రయోగ ఔచిత్యాన్ని పరిశీలించడం జరిగింది. 'తెల్లమొహం వేయు', 'మొసలి కన్నీరు', 'చాప క్రింద నీరు' లాంటి జాతీయాలెన్నో. అలాగే 'కట్టెగ్గద్దు పాము జావద్దు', 'ఇయ్యాల ఇంట్లే,రేపు మంట్లే' లాంటి తెలంగాణ సామెతలు, 'బోఫోర్స్', 'ఫాక్షనిజం', 'కస్టమర్' లాంటి ఆంగ్ల భాషా పదాలు, 'దోస్తీ', 'బాతాఖానీ', 'పైసల్', 'అసర్' లాంటి ఉర్దూ/హిందీ భాషా పదాలు అనేకం వాడబడినాయి. ఇక మాండలిక పదాలయిన 'లెంకిన', 'ఉష్కే', 'పున్నెం' 'ఎంట్కెల్' లాంటి స్థానిక మాండలిక పదాలెన్నో సందర్భోచితంగా వాడబడ్డాయి.

ఈ విధంగా గేయం, వచన కవిత్వాలు జిల్లాలో అనేకమంది కవులు, కవయిత్రులచే ఆదరించబడినాయి. 'ఉద్యమ కవిత్వం' సృష్టించే క్రమంలో తెలంగాణ యాస-భాషకు విలువ ఇచ్చిన కవులు 'మాండలిక భేదాన్ని' చూపారు. ఇలా 2002 నుండి 2012 మధ్య జిల్లాలో 'గేయం' మరియు 'వచనం' లో చెప్పుకోతగ్గ స్థాయిలో కవిత్వం వెలువడింది.

**ఆధార గ్రంథాలు:**

1. అంకురం - మల్లవరపు విజయ 2. అద్దం - కవిత సంకలనం (స్ఫూర్తి సాహితి-కామారెడ్డి) 3. అమ్మా నాన్నలు- రుద్రంగ్ రమేష్ 4. అలజడి - సి. హెచ్. ప్రకాష్ 5. అరుణ కిరణాలు - ఆయాచితం అరుణ కుమారి 6. ఏ సిరాతో రాయాలి? - చాడ లలితా దేవి 7. ఒకటే మాట తెలంగాణ - కవితా సంకలనం- స్నేహ ప్రచురణలు (అనిశెట్టి శంకర్) 8.గులేర్ -డా. వి. శంకర్ 9. చుక్కలు - డా. ఆయాచితం నటేశ్వర శర్మ 10. చైతన్య వసంతం -సిరిసిల్ల గఫూర్ శిక్షక్ 11. తబ్దీల్ - సిరిసిల్ల గఫూర్ శిక్షక్ 12. నా కలల ప్రపంచంలో - కిరణ్ బాల 13. నుదుగు పిడుగులు - ఘనపురం దేవేందర్ & తిరుమల శ్రీనివాస్ 14. పంపా తరంగాలు- కవితా సంకలనం-పంపా సాహితీ పీఠం (బోధన్) 15. మువ్వ గజ్జెలు - పడాల రామారావ్ 16. లలిత తరంగాలు - డా. కాసర్ల నరేష్ రావ్ 17. సూర్యుడు అనేక రంగుల్లో ఉదయిస్తాడు - డా. వి. ఆర్. శర్మ 18. సూర్యుని ఏడో గుర్రం -ఎ. సూర్య ప్రకాష్ 19. సౌగంధిక - సూరారం శంకర్ 20. స్వప్న శకలం - సి. హెచ్. ప్రకాష్

# పద్యమనోహరం - 23

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448

అరపది యొందు మోముల యొయారపు సామినిగన్న మేటియై
అరపది యైదు కుత్తుకల యాతని కక్షయ శక్తినిచ్చియున్
నరపది ముల్కులయ్యను నిరాకృతిజేసి జగద్విధేయుడై
అరపది మోములన్ వెలయు నబ్బఱవేలుపు మమ్ముబ్రోవుతన్

చింతలవల్లి ఛాయాపతి తన చమత్కార 'రాఘవాభ్యుదయ' కావ్యంలో పరమ శివున్ని శబ్దసంయోజనంతో స్తుతించిన పద్యం ఇది. పరమేశ్వరుని కుమారుడు కుమారస్వామి అయినా షణ్ముకుడు. ఆ విషయాన్నే 'అరపది యొందు' (ఐదు + ఒకటి) ఆరు ముఖాలను కలిగిన కుమారస్వామికి తండ్రి. అదేవిధంగా 'అరపది యైదు' (ఐదు + ఐదు) అంటే పది తలలు గలిగిన దశ కంఠునికి అపారమైన శక్తిని ప్రసాదించినవాడు, అట్లే 'అరపది' (ఐదు) బాణాలు కలిగియున్న మన్మథుని ఆకారము లేకుండా భస్మం చేసిన వాడు 'అరపది' (ఐదు) ముఖాలు కలదైవం అంటే సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానుడని పిలువబడే శివుడు మమ్ములను రక్షించుగాక !

ఛాయాపతి చేసిన ఈ స్తుతిలో పరమేశ్వరుని విశేషాలు తెలియడమేగాక కవుల శబ్ద ప్రయోగాలతో చేసే చమత్కారాలు కూడా పాఠకునిలో కొత్త ఉత్సాహాన్ని నింపి పద్యరచన పట్ల , పద్య పఠన పట్ల ఆసక్తిని ద్విగుణీకృతం చేసే లక్షణాలు దర్శనమిస్తున్నాయి. 'అరపది' అనే ఒక్క మాటను నాలుగు పాదాల్లో ప్రయోగించి 'త్రిప్రాస'ను – నిబద్ధించడమేగాక, 'ఒందు', 'ఐదు' అనే రెండు పదాలను ఈ పదానికి జోడించి తనకవవశమైన అర్థాన్ని సాధించిన తీరు కవి ప్రతిభకు నిదర్శనం.

చింతలపల్లి ఛాయాపతి మహబూబ్‌నగర్ జిల్లాలోని బోరవెల్లి సంస్థానానికి చెందిన కవిగా సాహిత్య చారిత్రకారులు పేర్కొన్నారు. ఈ సంస్థాన పాలకులలో ఒకడైన బిజ్జల తిమ్మ భూపాలుడు సంస్కృతంలో, మురారి కవి రచించిన అనర్ఘరాఘవ నాటకాన్ని తెలుగుతో 'అనర్ఘరాఘవము' అనే కావ్యంగా అనువదించాడు. 'మధురవాణీ విలాసము' రచించిన చింతలపల్లి వీరరాఘవ కవి కూడా ఈ సంస్థాన ఆశ్రిత కవులలో ఒకరు. ఉత్తమ కవిత్వాన్ని అందించిన ఛాయాపతి తెలుగు సంస్కృత భాషలలో అపార పాండిత్యము కలిగిన కవి. 'నవఘంట సురత్రాణ' అనే బిరుదం పొందినవాడు.

పద్యనిర్మాణంలో చమత్కారం అధికప్రాధాన్యాన్ని కలిగి ఉంటుంది. ఈ చమత్కారం శబ్ద ప్రయోగం ద్వారా సాధించవచ్చు. భావ ఔన్నత్యం ద్వారా సాధించవచ్చు. అలంకారవైచిత్రి ద్వారా సాధించవచ్చు. తెలుగు సాహిత్యంలో మహాకవులు తమతమ కావ్యాల్లో ప్రదర్శించిన రచనా చమత్కారాలు వారివారి ప్రతిభా మూలకాలు ఈ పద్యంలో ఛాయాపతి పరమేశ్వరుని వృత్తాంతానికి సంబంధించిన విశేషాంశాలను ధ్వనింపజేస్తూ పౌరాణికేతివృత్తాలైన షణ్ముఖ వృత్తాంతము, రామునికి ఇచ్చిన వరాల విషయము, మన్మథ దహనము వంటి సన్నివేశాలను ఒకే ఒక 'శబ్దం' ద్వారా చమత్కరించి విశదీకరించిన చింతలపల్లి ఛాయాపతి కవిత్వ ప్రతిభను, పద్యరచనా ప్రవణత్వమును మనం గమనించవచ్చు.

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

తెలుగు బోధన – నైపుణ్యాలు

# 5. పఠన కౌశలం – బోధన

**డా. వై. రెడ్డి శ్యామల,** ఆచార్యులు, నిఘంటు నిర్మాణశాఖ, పొ.తె.వి.విద్యాలయం,
ఫోన్ : 98496 97688

రాయడం వచ్చిన వారికి చదవడం రాదా? విడిగా చదవడం నేర్పాలా? అసలు చదవడం అనేది ప్రత్యేకమైన విషయమా? అది నేర్పాలా? పఠనాన్ని ఒక అంశంగా బోధించాలా? చదవడంపై కానీ, చదవడం నేర్పడంపై గాని ఏమైనా అధ్యయనాలున్నాయా?

భాష సహజంగా మౌఖికపరమైనది. లేఖనం తరువాత ఏర్పడినది. లేఖనంలో వ్రాయడం చదవడం కలిసి ఉంటాయి. అంటే లిపిరూపంలో భాషను code చేసి పఠనరూపంలో decode చేసుకుంటాం. ఆ భాషా వ్యవహర్తల మధ్య పరస్పర ఒప్పందం ఉంటుంది. కనుక ఎవరు ఎప్పుడు ఎక్కడనుండి రాసినా తిరిగి అదే అర్థంలో మనం చదువుకోగలుగుతాం. కాలగమనంలో వచ్చిన మార్పులను ప్రత్యేకంగా చెప్పుకుంటాం. లిపిరూపంలో ఉన్న దానిని తిరిగి decode చేసుకోవడంలో ఉన్న ఒప్పందాన్ని అనుసరించి చదువుతాం.

**చదవడం నేర్చుకోవాలి**

మంచి చదువరికి చదవడం అన్నది చాలా తేలికైన విషయం, శ్రమలేనిది, సహజంగా జరిగిపోయేది. కానీ ఇది అందరికీ అంత సులువైనది కాదు. అవగాహన కల్పించుకుంటూ చదవడం చాలా కష్టమైనది. ఇది చిన్న వయస్సులోనే అలవరచుకోవలసినది.

పిల్లలు పదాలను విని ఉంటారు. వాక్యాలుగా విని ఉంటారు. కానీ భాషాధ్వనులను ఒక్కొక్కటిగా, అంటే విడివిగా పలకటంకానీ, వాటిని అర్థం చేసుకోవడంకానీ ఉండదు. తెలుగులో క, ల, మ వర్ణాలు. అర్థ భేద సామర్థ్యమున్నవి. కానీ ఇవి వ్యస్తంగా మౌఖికభాషలో ప్రయోగించబడవు. కానీ కమల, అమల, విమల వంటి పదాల మధ్యనున్న భేదం గుర్తించగలం – వింటున్నప్పుడు. ఇది లిఖితరూపం పొందినపపుడు రాతరూపంలో ఉన్న వ్యస్త ధ్వనులను పాఠశాలలో మాత్రమే నేర్చుకుంటారు. లిపిలో ఉన్న ధ్వనులను పఠించాలి. ఈ దశ విద్యార్థి పఠనకౌశలాన్ని పెంచుకోవడానికి అత్యంత కీలకమైన దశ. భాషాధ్వనిని, అక్షరాన్ని, పదాలను పదాంశాలను వింగడించు కుంటూ అవగాహన కల్పించుకునే దశ, భాషాధ్వనికి అక్షర రూపానికి అనుసంధానం కల్పించుకునే దశ కూడా! ఈ దశలోనే పదజాలం పెంపొందించుకుంటారు. ఇంకా చెప్పాలంటే పదం–అర్థం, సందర్భం మధ్యనున్న సంబంధాన్ని గ్రహిస్తారు. దీనిని 6–8 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి ఈ గ్రహణంలో పట్టు సాధిస్తారు. ఈ వయస్సులో పఠన కౌశలంపై గల పట్టు అతని భావి విద్యాత్మక జీవితానికి పునాది అవుతుంది.

అమెరికాలో 2019లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం నాల్గవ తరగతి పిల్లలలో 44% వైట్ విద్యార్థులు 18% బ్లాక్ విద్యార్థులు మాత్రమే వారి తరగతి స్థాయి కలిగి ఉన్నారు. 2012లో బ్రిటన్ లో జరిగిన అధ్యయనం ప్రకారం 15 సంవత్సరాల విద్యార్థుల పఠనస్థాయి 12 సంవత్సరాల విద్యార్థులవలె ఉన్నది. దీనిఫలితంగా అక్కడి విద్యావిధానంలో కిండర్ గార్డన్ నుండి మూడవ తరగతి వరకు 'పఠనం'పై దృష్టి పెట్టారు. పదాలను గుర్తించడంలోకానీ, పలకడంలోగానీ, అవగాహన కల్పించుకోవడంలో కానీ వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. "Third Grade Reading Guarantee" అనే విధానాన్ని ఒహాయో రాష్ట్రంలో ప్రవేశపెట్టారు. ప్రపంచవ్యాప్తంగా 50 దేశాలలో 2016లో అధ్యయనం చేసిన Progress in International Reading Literacy Study (PIRLS) నిర్వహించిన పరీక్షలో రష్యన్ ఫెడరేషన్, సింగపూర్, హాంగ్‌కాంగ్, మొదటి మూడు స్థానాలలో ఉన్నాయి. మనదేశంలో ఈ పరీక్ష జరగలేదు.

ప్రపంచబ్యాంక్ మరొక అధ్యయనంలో 53% పేద, మధ్య తరగతి ఆదాయం గల దేశాలలో 'నేర్వడంలో పేదతనం' Learning Poverty ఉన్నట్లుగా గుర్తించింది. 'నేర్వడంలో పేదతనం' అంటే పది సంవత్సరాల వయస్సుగల విద్యార్థి సులభమైన పాఠ్యాన్ని చదవలేకపోవడం, చదివినా అర్థం చేసుకోలేకపోవడం. దీనినే 'నేర్వడంలో పేదరికం' అని నిర్వచించారు. ప్రాథమిక కౌశలాలు అన్నింటికీ వీరు ప్రాధాన్యమిచ్చారు. అంటే చదవడం, గణితం, తార్కికం, సామాజిక భావాత్మక విషయాలు, వీటిలో ఉన్నా, పఠనానికి ప్రాధాన్యం ఇవ్వబడింది. కారణం చదివి అర్థం చేసుకోగలిగినప్పుడే ప్రపంచంలోని ఏ అంశాన్నైనా అవగాహనలోకి తెచ్చుకోగలరనేదే దీనికి మూలం. కనుక పఠనం అత్యంత ముఖ్యమైన కౌశలం. దీనిలో ఇతర కౌశలాల నైపుణ్యం పొందుపరచబడి ఉంటుంది. నాగరక జీవనంలో పఠనం జీవిత పర్యంతమైనది. అది సృజనాత్మమైనదైనా కావచ్చు, విషయాత్మకమైనదైనా కావచ్చు. సమకాలీనతతో అనుసంధానం కలిగించే మాధ్యమం పఠనం. వార్తాపత్రికలు, బోర్డులు, దారి గుర్తులు కొన్న వస్తువులపై ఉండే విషయాలు, నియమాలు, నిర్దేశాలు ప్రతినిత్యం చదివి ఆకళింపు చేసుకుని అనుసరించాల్సినవి. విద్యాత్మక మార్గంలో పఠనం ద్వారానే నవీన విషయ గ్రహణ సాధ్యమవుతుంది. కొత్త విషయాన్ని వేగంగా చదవడం, చదివిన దానిని సమగ్రంగా అర్థం చేసుకోవడం కూడ ముఖ్యమైనవే.

పఠనంలో రెండు రకాల అంశాలు ఉంటాయి:

1. **సృజనాత్మక సాహిత్య పఠనం**
2. **విషయ సంబంధ పఠనం**

మొదటి దానిలో విద్యార్థుల భావనాశక్తి, ఊహాశక్తి పెంపొందుతుంది. రెండవ దానిలో, కొత్త సమాచారాన్ని గ్రహించడం ద్వారా, వారికి నూతన విషయాలను, వాటిలోని లోతును గ్రహించే 'అవగాహనాశక్తి' పెంపొందుతుంది. తద్వారా అప్పటికే వారికి తెలిసి ఉన్న అంశాలను, కొత్తగా చదివి నేర్చుకున్న అంశాలను సమన్వయ పరచుకునే జ్ఞానం అలవడుతుంది.

చదవడంపై అధ్యయనం చేసిన శాస్త్రజ్ఞులు చదువరులను నాలుగు స్థాయిలలో వర్గీకరించారు.

**1. కొత్త చదువరి :** వీరి వయస్సు ఆరు నుండి ఏడు సంవత్సరాలు. వీరు అక్షరాలను గుర్తించగలరు. పదాలను చదువగలరు. లిపికి, ఉచ్చారణకు మధ్య అనుసంధానం ఏర్పరుచుకుంటారు.

**2. అర్థ పరిగ్రహణగల చదువరి :** ఏడు నుండి తొమ్మిది సంవత్సరాల వయస్సు కలవారు. వీరు అక్షరాలను తొందరగా గ్రహించి, ఉచ్చారణ దోషం లేకుండా చదవగలగడం, ఆత్మవిశ్వాసంతో బిగ్గరగా చదవడం, 3000 పదాలకు పైగా అర్థం చేసుకోగలగడం ఈ స్థాయి వారి సామర్థ్యం.

**3. ధారాశుద్ధిగల చదువరి :** తొమ్మిది నుండి పదహైదు సంవత్సరాల విద్యార్థి. లేఖనంలోని తప్పొప్పులు గుర్తించగలగడం, వేగంగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం, అవగాహన కల్పించుకోవడం వీరి స్థాయి.

**4. పఠన నిపుణుడు :** చదివిన ప్రతి పదాన్ని అరక్షణంలో గ్రహించడం వీరి స్థాయి. విషయ గ్రహణం విశ్లేషణ అన్నవి వీరి అభ్యాసం పైనా, చదువుతున్న విషయంపైనా ఆధారపడి ఉంటాయి.

యాజ్ఞవల్క్య శిక్ష అనే గ్రంథంలో చెడ్డ చదువరులెవరో తెలిపింది.

**గీతీ, శీఘ్రీ, శిరఃకంపీ, తథా అలిఖిత పాఠకః**
**అనర్థజ్ఞః, అల్పకంఠశ్చ షడేతే పాఠకాధమాః**

కూనిరాగాలు తీస్తూ చదివేవాడు, తొందర తొందరగా చదివేవాడు, తల ఆడిస్తూ చదివేవాడు, వ్రాయనిది చదివేవాడు, అర్థం తెలియక చదివేవాడు, సన్నగొంతుకవాడు ఈ ఆరుగురు పాఠకాధములు. వీటిని సరిచేసుకొనుటకే గురుముఖతః చదవడం (మనలిపి పుట్టు పూర్వోత్తరాలునుంచి)

తప్పులు లేకుండా చదవడం మాత్రమే చదవడం కాదు. వర్ణాన్ని ఎంతసేపు చదవాలో అంతలోనే పూర్తి చేయాలి. అంటే 'కమల' అన్నది ఒకే వేగంలో ఉండాలి. సాగదీయరాదు. అలా అనే అతివేగం ఉండరాదు. శరీరంతో చేసే చేష్టలు (తల ఆడించడం వంటివి) చేయరాదు. స్పష్టంగా చదవాలి. ముఖ్యమైనది అర్థం బోధపరుచుకోకుండా చదవరాదు. వీటిని నేర్పవలసిన బాధ్యత ఉపాధ్యాయులదే.

**పఠన కౌశలాన్ని పెంపొందించడం ఎలా!**

విద్యార్థులను చిన్న వయస్సువారిని పైకి చదవమనడం ముఖ్యమైనది. అక్షరాలను స్పష్టంగా గుర్తిస్తున్నారా లేదా తెలుస్తుంది. ఇంకొకటి హ్రస్వ దీర్ఘాల మధ్య, అల్పమహా ప్రాణాలమధ్య భేదాన్ని గుర్తించగలుగుతారు. ఇది పాఠశాలలో నేర్చుకోవలసిన అంశం. దీని ప్రభావం లేఖనంపై కూడా ఉంటుంది. కనుక పఠనానికి తప్పక సమయం కేటాయించాలి. దీనికి విద్యార్థులను వంతులవారిగా చదివించవచ్చు. వారి స్థాయికి తగిన కొత్తపుస్తకాన్ని ఇచ్చి చదివించాలి. కథాపుస్తకం అయితే నిజ జీవితంలో సమన్వయం చేయమని చెప్పాలి. కొత్త విషయంపై పుస్తకమైతే చదివిన దానిని గురించి చర్చించమనాలి. పిల్లలే చర్చించాలి. సగం చదివి పరిష్కారాలను సూచించమనాలి.

పఠనంలో లక్ష్యాలను ఏర్పరచాలి. అంటే సమయం ఇచ్చి వారి వేగాన్ని అర్థావగాహనను మూల్యాంకనం చేయాలి. కొత్త అంశం ఇచ్చి కొత్త పదాలను గుర్తించమనడం, ప్రశ్నలను తయారు చేయమనడం వంటివి చేయడం వలన వారికి కొత్త పాఠ్యాన్ని అర్థం చేసుకొనే శిక్షణ లభిస్తుంది. ఇంకొంచం పెద్దవారైతే ఇచ్చిన పాఠ్యంలోని మూలాంశం ఏమిటో గుర్తించమని చెప్పవచ్చు. ఇది పాఠ్యపుస్తకంలోని పాఠాలను గూడ అభ్యాసంగా స్వీకరించవచ్చు.

వార్తాపత్రికలోని విజ్ఞానాంశాలు, చర్చకు పెట్టవచ్చు. నాలుగు కొత్త వాక్యాలు బోర్డుమీద రాసి అభ్యాసం చేయించవచ్చు. చాలా చిన్న పిల్లలైనా ఈరోజు బుధవారం అని రాసి నిన్న, రేపు వంటివి పైన కింద రాసి సమాధానాలు చెప్పించవచ్చు. అంటే ఎంత చిన్న వాక్యాలతో నైనా తరగతి స్థాయిని బట్టి పఠన అభ్యాసం చేయించవచ్చు.

ఇంగ్లీషు భాషలో లిపిక్రమం, ఉచ్చారణలో భేదం ఉంటుంది. తెలుగులో అభేదం మనకు లేదు. రాసిన పద్ధతిలోనే చదువుతాం. ఇది ఒక సౌలభ్యం. అయితే వాడుకభాషలో లేని ధ్వనులు మహాప్రాణాలు, శషసల భేదం, మూర్ధన్యాలు పాఠశాలలో పరిచయమవుతాయి. కనుక వీటిని తొలిదశలో నేర్పించేటప్పుడు కొంచెం శ్రద్ధ వహిస్తే ప్రతి విద్యార్థి స్పష్టంగా ఉచ్చరిచగలడు. భావి విద్యాత్మక జీవితం ఉన్నతంగా సాగడానికి పఠన కౌశలం అత్యంత ముఖ్యమైనది.

జీవితాంతం ఎవరూ తోడుండి చదివనది అర్థం చేయించరు. ప్రతివ్యక్తి తనకు తానుగా చదివి అర్థం చేసుకోని ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

మూసీ సాహిత్యధార
పుస్తక సమీక్ష

# అస్తిత్వపు వెతుకులాట "తావు"

**తండ హరీష్ గౌడ్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 8978439551

సుంకి రెడ్డి నారాయణరెడ్డి నల్లగొండ జిల్లా వాసి. కవి విమర్శకుడు, తెలంగాణ చరిత్ర కారుడు.తెలంగాణ అస్తిత్వవాద నేపథ్యాన్ని బలంగా తన కవిత్వంలో ప్రకటించిన వ్యక్తి. ఈ కవితాసంపుటిలో తెలంగాణ ప్రజల జీవనస్థితిగతులను, సంఘర్షణలను, పోరాటాలను కవిత్వీకరించారు.వారు నిత్యాన్వేషి."తావు" అంటే 'ఉనికి' లేదా 'అస్తిత్వం' అని అర్థం. ఆ ఉనికి, ఆ అస్తిత్వపు ఛాయలను వెతుక్కునే స్థలంగా తావును చెప్పవచ్చు.

మొదటగా వాగు అనే కవితను పరిశీలిస్తే ఈ కవితలో వాగు యొక్క పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఇప్పుడు వాగును కేవలం వ్యాపార కేంద్రంగా మార్చి ఆనవాళ్లు లేకుండా చేశారన్న విషయం చెప్పారు.

"కాకులు రాళ్ళు వేయకుంటనే/
అంది వచ్చినట్టు /
చెలిమెలు చెలిమెలుగా / మా వాగు"

అంటూ అప్పుడున్న వాగు సహజ లక్షణాన్ని వివరించారు.

అదే కవితలో –

కాళ్ళు వంకర బోయి /
బొక్కల బలం బోయి /
పండ్లు పచ్చగయి /
మావూరిప్పుడో ముసలివగ్గు /

అంటూ బాధలను వివరిస్తూ ఆ వాగే నీరు నందిస్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్నట్టుగా వ్యక్తం చేశారు.

సుంకిరెడ్డి నారాయణరెడ్డి వారి మిత్రబృందంతో కలిసి భావాలను పంచుకునే స్థలంగా తావును చెప్పుకొస్తూ ఉద్యమ ప్రస్థానం మొదలయ్యింది కూడా ఆ తావు లోనే అని 'తావు' కవితలో చెప్పారు.

"అక్కడే
కవిత్వాలు
ఉద్రేకాల మానిపెస్టోలయ్యిందీ
ఉద్యమాలు
ఉద్వేగాల ఎజెండాలయందీ" అని

ఇప్పుడక్కడ ఏముంది, అన్ని ఆధునికతను సంతరించుకున్నాయని కవి వివరించాడు.

తెలంగాణ రాష్ట్ర కాంక్ష నెరవేరుతుందని తెలంగాణను స్వతంత్రంగా పరిపాలించుకునే రోజులు రాబోతున్నాయని

"తొలి పదం మనదే
తొలి కవి మనవాడే
తొలి రాజ్యం మనదే
మరువకు మనాది పెంచుకోకు" అని –

తమ్ముడా మనల్ని మనం హత్య చేసుకునే ఉదంతాలు వద్దని మనాది పెట్టుకోవద్దని కుందేలు పిల్లల్లా ధైర్యవంతులమైన మనం ఒక రోజు మేకతోలు కప్పుకొని సింహాలమనుకునే అరాచకవాదుల బావిలో దుంకించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

"రోడ్డు"అనే కవితలో నదులున్న చోటే జనవాసం చక్కగా ఉ ండి మానవులు నాగరికతను సంతరించుకున్నారని చెబుతూ "రోడ్లు"ఇప్పుడు నదులై కొత్త నాగరికతకు అనుసంధానం చేస్తున్నాయని వివరించారు.

"రోడ్లిప్పటి నదులు
తాము కదలకుంటనే మనల్ని కదిలించే
కొత్త రకం నదులు"

నదుల పక్కనే వర్తక కేంద్రాలు వర్ధిల్లినట్టుగా రోడ్డుతో నేటి మానవ జీవన పరిస్థితులు ముడిపడి ఉన్నాయని ఎంతో చక్కటి పోలిక చేస్తూ రోడ్లకి, నదులకు ముడిపెట్టగలిగా రంటే ఆయన భావుకత ఎంత లోతైనదో మనం గమనించవచ్చు.

నారాయణ రెడ్డి గారు కవిత్వపు లోతులను తొలచి చూస్తూ "నల్ల బంగారం" లాంటి కవితల వెలుగును పంచారు. నిజంగా ఆయన నల్ల బంగారమే.

"ఎవరితో అన్నదే ముఖ్యం" అనే కవితలో –

**"ముల్లు దిగిన పాదం
తమలపాకులా మాట్లాడదు
లాఠీ తలిగిన దేహం
తుమ్మెదలా మాట్లాడదు
అహంకారం శరాఘాతమైతే
అదిరిపడిన నేల
అంకుశమయి మాట్లాడుతుంది"** అని ఎవరి స్వభావం ఆధారంగా వారికి సమాధానం చెప్పాల్సి వస్తుందని చెబుతూ, పోరాట స్ఫూర్తిని పెంపొందించేలా ఈ కవితా పంక్తులను శక్తివంతంగా రాశాడు.

మా భాషను వంక పెట్టేవాడెవడు. మా బాధ మాకుంటే ఏ రాగంలో పలకాలో చెప్పేవాడెవడంటూ ప్రశ్నిస్తూ? కవిత్వ గొప్పతనాన్ని వివరిస్తూ –

**"నీవు కవిత్వమయితే**

**మానవ కబేళాలోంచి చూడు"** అని అన్నారు.

**"కవిత్వం ఎప్పుడు శాశ్వత ప్రతిపక్షం"** అన్నాడు ఈ కవి.

సన్మానాల కోసం పరిగెత్తేది కవిత్వం కాదు అని వివరించారు.

తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్రను పోషించి స్వరాష్ట్ర సాధనకు కృషి చేశారు. "మిలియన్ మార్చ్"

సందర్భంగా రాసిన కవితలో "విగ్రహాల కూల్చివేత "ను

సమర్థించిన తీరు గొప్పగా కనిపిస్తుంది.

**"దశాబ్దాల మా నిరుద్యోగ నిర్నిద్ర కన్న**
**మా పోరల శూన్య దృక్కుల కన్న**
**మా రైతుల స్వీయ ఉరిశిక్షల కన్న**
**కలనేతే మానేతన్నల ఉరితీత అవడం కన్న**
**మొనగానివా ఆ విగ్రహాలు"** అని గట్టిగా నొక్కి చెప్పారు.

తెలంగాణ ప్రజల కలలు నెరవేరిన వేళ , స్వరాజ్యం అందివచ్చిన వేళ నారాయణ రెడ్డి గారు "ఉత్సవం" అనే కవితలో

**"ఎండిన వాగు నురగలెత్తినది**

**స్వరమైన గాయం అలుగుబోసినది"** అంటూ అందరిలో ఉత్సవాన్ని నింపారు.

కవి, విమర్శకుడు, నిత్య పరిశోధకుడైనటువంటి నారాయణ రెడ్డి గారి కవిత్వాన్ని ఆసాంతం పరిశీలిస్తే –


పరిశోధనాతత్వంతో కవిత్వం రాస్తాడా అన్న అనుమానం తలెత్తడం సహజమే. "టచ్ స్క్రీన్" కవితావిషయంలో ఆయన "ఒళ్ళంతా కళ్ళేనని "చెప్పిన మాటలు గుర్తొస్తున్నాయి.ఆ విషయం వాస్తవంగా నారాయణ రెడ్డి గారికి సరిపోతుంది.

నారాయణరెడ్డి గారి కవితా సంపుటి 'తావు'ను సమీక్షించటంలో నాకు కవిత్వంలో కొత్త కోణాలు దొరికినట్టయింది. వీరి కవిత్వ పరిశీలన యువకవులకు చక్కటి మార్గదర్శకం.

---

## సత్సంగం

### గృహస్థుకు మోక్షం



నీవు గృహస్థునని ఎందుకనుకుంటున్నావు? నీవు సన్యసించినా, "నేను సన్యాసిని" అనే భావం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. నీవు గృహస్థువైనా, ఇల్లు విడిచి అడవులకు వెళ్ళినా నీ మనస్సు నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. అహంకారమే ఆలోచనకు మూలం. అదే దేహాన్ని, ప్రపంచాన్నీ కల్పిస్తుంది. నీవు గృహస్థువనే భావాన్ని కలిగిస్తుంది. నీవు త్యజిస్తే జరిగేదేమిటి? "గృహస్థు"ననే తలంపుకు బదులు "సన్యాసిని" అనీ, ఇంటి వాతావరణానికి బదులు, అడవి వాతావరణాన్ని కల్పిస్తుంది. మానసిక అవరోధాలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. కొత్త పరిసరాలలో ఇంకా ఎక్కువ కూడా అవుతాయి. పరిసరాల మార్పిడి వల్ల పెద్ద ప్రయోజనమేమీ ఒరగదు. ఒకే ఒక అవరోధం – మనస్సు, నీవు ఇంట్లో ఉన్నా, అడవిలో ఉన్నా – దానిని అధిగమించాలి. అందువల్ల, పరిసరాలని మార్చవలసిన అవసరమేమిటి? ఏ పరిసరాలైనా, నీ కృషిని ఇప్పుడు కూడా కొనసాగించవచ్చు.

"నేను పనిచేస్తున్నాన"నే భావమే అవరోధం. "పనిచేసే దెవరు?" అని నిన్ను నీవు ప్రశ్నించుకో. నీవెవరవో గుర్తుంచుకో. ఇప్పుడు పని నీకు బంధం కాదు. దానంతట అదే కొనసాగిపోతుంది. జరుగవలసింది తప్పకుండా జరుగుతుంది. నీకు పనిచేసే యోగం లేకపోతే, నీవు ఎంత ప్రయత్నించినా నీకు పని దొరకదు. నీవు పనిచేయవలసి ఉంటే, ఏ విధంగానూ తప్పించుకోలేవు – నీవు పనిలో నిమగ్నమై తీరుతావు. కాబట్టి ఆ సర్వేశ్వరునికే విడిచిపెట్టు – నీ ఇష్టం వచ్చినట్టు త్యజించనూ లేవు. పట్టుకొని ఉండనూ లేవు.

అంతా ఆత్మే. ఆత్మకి భిన్నంగా నీవున్నావా? ఆత్మతో నిమిత్తం లేకుండా పని కొనసాగ గలదా? ఆత్మ విశ్వమంతా ఉంది. కాబట్టి నువ్వు పాటుపడినా పడకపోయినా పని తనంతట తానే కొనసాగిపోతుంది. "కౌరవులను చంపటానికి నీవేమీ పాటుపడనక్కర్లేదు. వాళ్ళని భగవంతుడెలాగూ చంపి వేశాడ"ని కృష్ణుడు అర్జునునకు చెప్పడానికి కారణమిదే. ఒక పనిని చేయాలని సంకల్పించుకోవటం కాగి దాని గురించి చింతించవలసినది గాని అతను కాదు. ఆ సర్వేశ్వరుని సంకల్పాన్ని నెరవేర్చడానికి తన శక్తిని వినియోగించాలి. అంతే.


ఆత్మపై ధ్యానముంచట మంటే, పనిపైన ఉంచటమే. నీవు దేహంతో తాదాత్మ్యం చెంది ఉండడం వల్ల పనిని చేసేది నీవేనన్న భావముంది నీకు. కాని దేహం కాని, అది చేసే పనులు కాని నీ ఆత్మకు భిన్నం కావు. నీవు పనిపై శ్రద్ధ చూపితేనేమి, చూపకపోతేనేమి? నీవు నడుస్తున్నప్పుడు, వేసే ప్రతి అడుగు మీదా శ్రద్ధ చూపవు. అయినా నడిచి గమ్యం చేరుతావు. నీ ప్రమేయం లేకుండా నడక ఎట్లా సాగుతుందో గమనించు. మిగిలిన పనులూ అంతే.


# తెలుగు సాహిత్యం - ధిక్కార స్వరాలు

**డా. ఎన్. రజని,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఫోన్ : 9010501030









**ప్రవేశిక :** సమాజం, సాహిత్యం ఒకదానితో ఒకటి కలిసి ప్రయాణం చేస్తాయి. ఒక్కొక్కసారి సమాజం ముందుంటే సాహిత్యం ఆ ప్రభావంతో వస్తుంది. మరొకసారి సాహిత్య ప్రభావం సమాజం మీదపడి, ప్రేరణతో ఉద్యమాలు వస్తాయి. తెలుగు సాహిత్యం సామాజిక మార్పులకు సమాంతరంగా నడుస్తూ ప్రతి తరాన్ని ఉత్తేజితం చేస్తూ తరతరాలకు ఆ సాహిత్యాన్ని అందిస్తూనే ఉంటుంది. తెలుగు సాహిత్యం సామాజికాంశాలను ప్రతిబింబించడమే కాదు. ప్రతి కాలంలో ప్రతి సమయంలో ప్రభుత్వానికి పాలకులకు, ప్రజలకు మధ్యన ఉన్న ప్రతిఘటన, సంఘర్షణ, ధిక్కారాలను కూడా బలంగా ప్రతిబింబించింది. తీవ్రంగా వినిపించింది. ఆ ధిక్కార స్వరాన్ని, కవిత్వాన్ని వెలికి తీయడమే ఈ పరిశోధనా పత్ర ఉద్దేశం.

**తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి ధిక్కారం :**

11 వ శతాబ్దం వరకు తెలుగు సాహిత్యం మార్గపద్ధతిలో సాగింది. "మార్గ" అంటే సంప్రదాయ కవిత్వమని దానికి కొన్ని నియమ నిబంధనలున్నాయని మనకు తెలుసు. గణాలు, యతులు, ప్రాసలు మొదలైన పద్ధతిలో సాగింది. ఆ సాహిత్యం వైభవంగా కొనసాగిన తరుణంలో అదంతా దాదాపుగా కాల్పనిక కవిత్వం లేదా కాల్పనిక సాహిత్యమే. కానీ, 12వ శతాబ్దంలో పాల్కురికి సోమన ఆ సంప్రదాయాన్ని బద్దలు చేశాడు.

సాహితీ విమర్శకుల అభిప్రాయం ప్రకారం సోమన మొట్టమొదటగా ద్విపద ఛందస్సును ప్రవేశపెట్టాడు. పద్యం సులువుగా చదువుకోవడానికి వీలుగా ఉండడమే కాక, రాజుల నుంచి ప్రజలు కవితా వస్తువులుగా మారారు. అప్పటివరకు పురాణ పాత్రలే కేంద్రంగా ఉన్న సాహిత్య వస్తువునుంచి ప్రాంతీయంగా పేరు పొందిన ప్రముఖులు ముఖ్య పాత్రలయ్యారు. అట్లా వచ్చిందే బసవపురాణం. అందులో అప్పటి సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులు కనిపిస్తాయి. అట్లా ఒక తిరుగుబాటుగా వచ్చిన కవిత్వాన్ని ఆ యుగాన్ని శివకవి యుగంగా చెప్పుకున్నాం. బసవేశ్వరుడు, మల్లికార్జున పండితారాధ్యుడు శైవ సంస్కృతిని వ్యాపింపజేసే ప్రధానపాత్రలు. అట్లా ఛందస్సులోనూ, కవితా వస్తువులోను పాతపద్ధతిని ధిక్కరించింది ఆ సాహిత్యం.

15వ శతాబ్దంలో శతకాలు, కీర్తనలు బాగా వ్యాపించాయి. అందులో చెప్పుకోదగ్గవారు అన్నమాచార్య. దాదాపు 32,000 వరకు కీర్తనలు రచించారు. సామాన్య ప్రజలు ఈ కీర్తనల వల్ల దేవునికి చాలా దగ్గరైనట్టు భావించారు. తిరుమల కొండలు అన్నమయ్య కీర్తనలతో ప్రతిధ్వనించేవట. "బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే", "ఏ కులజుడైననేమి" వంటి కీర్తనలు సంప్రదాయాలను, వ్యవస్థను ప్రశ్నించాయి, ధిక్కరించాయి.

ఇక వేమన శతకాలైతే మొత్తంగా ఈ సమాజంలోని ప్రతి విషయాన్ని ప్రశ్నించాయి. అవసరమైన సందర్భంలో పాలకులను ధిక్కార స్వరంతో ప్రశ్నించాయి.

సాళువ నరసింగరాయలు అన్నమాచార్యులును పిలిచి తన గురించి రాయమన్నాడని కానీ .. "నరహరి కీర్తన నానిన జిహ్వ ఒరుల నుతింపబోదు" అంటూ సమాధానమిచ్చిన ఉదాహరణ లున్నాయి.

15వ శతాబ్దికి చెందిన పోతన, ప్రత్యక్షంగానే రాజులను ధిక్కరించాడు. ఆయన తన భాగవతాన్ని రామునికి అంకితమిస్తూ "ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి నిన్ను అమ్మను భారతీ" అంటూ .. "నిజదార సుతాదుల పోషణార్థమున్ హాలికునైననేమి" అంటాడు.










ప్రబంధ కాలంలోని ధూర్జటి తన కాళహస్తీశ్వర శతకంలో .. "రాజుల్ మత్తులు, వాని సేవ నరకప్రాయంబు ..." అంటూ రాజులను, వారి స్వభావాలను బహిరంగంగా తెల్పుతూ తన ధిక్కారాన్ని తెలుపుతాడు.

ఆ తర్వాతికాలం తెలుగు సాహిత్యంలో క్షీణయుగంగా పిలుస్తారు. ఈ కాలంలో ఎక్కువగా సాహిత్య వ్యాప్తి జరగలేదు. అయినా వచ్చిన సాహిత్యాన్ని ఇంకొంత జాగ్రత్తగా పరిశోధించాల్సిన అవసరం ఉంది.

ఇక ఆధునిక యుగంలోకి వస్తే గురజాడను ఆధునిక యుగకర్తగా చెప్తాం. పాతకొత్తల మేలుకలయిక క్రొమ్మెరంగులు చిమ్మగా అంటూ కొత్త కవిత్వానికి దారులు తీస్తాడు. కన్యక కవితలో ... "పట్నమేలే రాజువైతే పట్టు నన్నిపుడనుచున్..." అంటూ అగ్నిలో దూకుతుంది. పట్నానికి దొర కావచ్చు కానీ అతని అహంకారాన్ని అణచడమే కాదు. అతన్ని ధిక్కరించిన కన్యకగా మనకు కనిపిస్తుంది. మతము లన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటె నిలిచి వెలుగును అంటూ మతమౌఢ్యాన్ని నిరసిస్తాడు.

గుర్రం జాషువా కుల వర్ణవ్యవస్థను ధిక్కరిస్తూ కవిత్వాన్ని రచించారు. అప్పటివరకూ అస్పృశ్యులుగా ఉన్న హరిజనుల ఆవేదనను గబ్బిలానికి నివేదించే సందర్భంలో సున్నితంగా అనిపించినా మౌలికమైన ప్రశ్నను సంధిస్తాడు. దేవుని అస్తిత్వాన్ని, కర్మసిద్ధాంతాన్ని ఇట్లా ప్రశ్నిస్తాడు. "కర్మమననేమో దానికీ కక్షయేమొ" ... అంటూ దళితులపట్ల ఉన్న అసమానతలను ప్రశ్నించే సందర్భంలో వర్ణ ధర్మాన్ని గురించి ధిక్కార స్వరంతో ప్రశ్నిస్తాడు.

'కసరి బుసకొట్టు నీతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

ఇతడు చేసిన పాపకారణమేమొ కానీ, వీన్ని ఉద్ధరించే దేవుడే లేదు. మానవులు ఎక్కడ్నించి ఉద్ధరిస్తారు? అంటూ పదునుగా సమాజాన్ని ప్రశ్నిస్తాడు.

అభ్యుదయ కవిత్వంలో శ్రీశ్రీ ఒక ప్రభంజనమే సృష్టించాడు.

వ్యాకరణాల సంకెళ్ళు విడిచి
ఛందస్సుల సర్ప పరిష్వంగం వదిలి
వడివడిగా వెలువడినై పరుగిడినై ... అంటూ వ్యవస్థను, సంప్రదాయాన్ని, సాహిత్యాన్ని ప్రశ్నిస్తాడు.

ఆత్మకథలో పఠాభి వచన పద్యాలనే దుడ్డు కర్రల్తో పద్యాల నడుములు విరగదంతాను అంటూ తీవ్రమైన పదజాలంతో సంప్రదాయ కవితా విధానంపై తిరుగుబాటు చేస్తాడు.

బాలగంగాధర తిలక్ తన ఆర్తగీతంలో ....

నా దేశాన్ని గూర్చి పాడలేను ... ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి, ఏ బుద్ధదేవుడి జన్మభూమికి గర్వస్మృతి అంటూ తన తలను సిగ్గుతో దించుకోవలసి వస్తున్నందుకు ఈ వ్యవస్థ పట్ల తన తిరస్కారాన్ని ప్రకటిస్తాడు.

కుందుర్తి 'కదిలిందొక మహాయాత్ర' అంటూ వారి చేతగాకుంటే ప్రభుత్వాన్ని మనమే నడుపుదాం అంటూ ప్రభుత్వంపై దండయాత్ర ప్రకటిస్తాడు.

ఆంధ్ర పురాణంలో మధునాపంతుల సత్యనారాయణ గుణాఢ్యుడి కథ రాస్తూ కావ్యానికి ప్రతిగా హాలుడు తనకు వెండిరూకలు బహూకరించి తన బృహత్కథను అవమానించిన సందర్భంలో, తానురాసిన 7 లక్షల పద్యాల (కృషిని) కావ్యాన్ని అగ్నికి ఆహుతి చేస్తూ....

సౌజన్యంబను మేతోలు మెయి నాచ్ఛాదించుకొన్నట్టి
యీ రాజుల్ రాజులు కారు, బెబ్బులులు

మీసపు తేనియల్, విసపు మెచ్చులు ... అంటూ రాజులపట్ల తన తిరస్కార భావాన్ని చాలా పదునైన మాటలతో చెప్తాడు.

త్రిపురనేని రామస్వామి చౌదరి సూతపురాణం మరొక రకమైన తిరుగుబాటు సాహిత్యం.

ఇల్లిల్లు తిరిగెడి యిల్లాలి కోసమై

దైత్యారి యూరూరు తిరుగుచుండు ... అంటూ దేవుళ్ళకే సమస్యలు తీర్చుకునే దారిలేదు. వాళ్ళు నా సమస్యను ఎట్లా పరిష్కరిస్తారు అంటూ హేళనగా, తిరస్కార భావంతో ప్రశ్నిస్తాడు.

ఇస్మాయిల్ తన చెట్టు కూలుతున్న దృశ్యంలో నిరుద్యోగ వ్యవస్థను పెంచి పోషిస్తున్న ప్రభుత్వాన్ని ధిక్కరిస్తాడు.

ఆ తర్వాత వచ్చిన దిగంబర కవిత్వం ప్రపంచానికే షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చింది. ఈ కవిత్వం సంప్రదాయాలను, ఎల్లలను, మొహమాటాలను విడిచిపెట్టి అన్నిటినీ ధిక్కరించింది. కవిత్వ రూపంలో, వస్తువులో, ఆవిష్కరణలో కూడా నూతనత్వమే తీసుకొచ్చారు.

జాతీయోద్యమ కవిత్వంలో గరిమెళ్ళ సత్యనారాయణ "మాకొద్దీ తెల్లదొరతనము..." అంటూ ప్రత్యక్షంగానే ధిక్కార స్వరాన్ని వినిపించారు.

ఇక అభ్యుదయ సాహిత్యం దాదాపుగా ప్రతి ఘటనా సాహిత్యంగానే ముందుకొచ్చింది.

ఓ నిజాము పిశాచమా కానరాదు మా కెన్నడేని నీవంటి రాజులు ... అంటూ ప్రశ్నించాడు.

70లలో వచ్చిన విప్లవ కవిత్వం ఆ దశాబ్దమే తనదిగా చెప్పుకుంది. ఎమర్జెన్సీ సమయంలో వారు వెలువరించిన పుస్తకాలు "మార్చ్", "ఝంఝు" నిషేధానికి గురయ్యాయంటే విప్లవకవులు ఎట్లాంటి ధిక్కార స్వరంతో రాజ్యాన్ని ప్రశ్నించారో అర్థం చేసుకోవచ్చు. వారి రాతలు తరవాతి తరానికి ప్రేరణగా నిలిచాయి. వారి కవిత్వం నినాదాలుగా మారి రాజ్యాన్ని ప్రశ్నించాయి, భయపెట్టాయి.

కాళోజీ ఒక చోట ఇట్లా అంటాడు.

దోపిడీ దౌర్జన్యానికి కారకులగు
దుష్టుల దొంగల ముఠాల
రక్షించెడి అధినేతల
అసహ్యించి కసిబూని
రూపుమాపు ధీమాతో

బతుకదలచినట్టి మనిషి బ్రతుకు తిరుగుబాటు.. మరోచోట కాలంబు రాగానే కాటేసి తీరాలె ... అంటూ తీవ్రస్వరంతో రాజ్యాన్ని ప్రశ్నిస్తాడు కాళోజీ.

విప్లవ కవుల్లో ఒకరైన వరవరరావు విప్లవకవుల ప్రభావాన్ని గురించి చాలా స్పష్టంగా ఈ కవితలో వివరిస్తారు.

అక్షరం మీద గురితోనే మొదలుపెట్టాను
అ ఆ లు నేర్చుకున్న ఆనందంలో
అమ్మ అరక ఆట ఆకాశం
అన్నీ చిన్ననాటి అనుభవంలోనే రాశాను.
అబద్ధం నేర్వడం విద్య అని
కల్పనకు లోకంలో గౌరవం ఉందని
అనిబద్ధ సాహిత్యం ఉంటుందని
ఆయుధం నన్ను గురిచూసే దాకా తెలియదు

కనిపించని ధిక్కారం ఈ కవిత్వంలో కనిపిస్తుంది.

చెరబండరాజు, శివసాగర్, వరవరరావు వంటి ఎంతోమంది విప్లవకవులు ఒకవైపు వారి అస్తిత్వాన్ని కాపాడుకుంటూ రాజ్యాన్ని ధిక్కరిస్తూ ఎంతో కవిత్వాన్ని రాశారు. ప్రభుత్వాన్ని, వ్యవస్థను, దోపిడీని ప్రశ్నిస్తూనే ఉన్నారు. ధిక్కార స్వరాన్ని వినిపిస్తూనే ఉన్నారు.

తెలంగాణ ప్రాంతంలో తమ అస్తిత్వం కోసం జరిగిన పోరాటంలో ఎన్నో ధిక్కార స్వరాలు వినిపించాయి. మొదట నిజాంకు వ్యతిరేకంగా, తొలిదశ, మలిదశ పోరాటాల్లో రాజ్యానికి వ్యతిరేకంగా తమ ధిక్కార గళాన్ని వినిపించిన కవులు, గాయకులు ఎంతోమంది ఉన్నారు. 12వ శతాబ్దం నుంచి తెలుగు సాహిత్యం వ్యవస్థను, సమాజాన్ని, పాలకులను రాజులను, వారి అన్యాయాలను, అక్రమాలను, అకృత్యాలను ధిక్కరిస్తూ, ప్రశ్నిస్తూనే సాగింది. అట్లా సాగుతూనే తనకంటూ ఒక ప్రత్యేక అస్తిత్వాన్ని నిలుపుకుంటూనే ఉంది.

ఇన్ని శతాబ్దాలుగా ప్రతిఘటనతో, ధిక్కారంతో అంతకు ముందున్న వ్యవస్థను, పద్ధతిని, సంప్రదాయాన్ని ప్రశ్నిస్తూనే ఉంది. ఈ పత్రం ద్వారా చెప్పదలచుకున్న ప్రత్యేకమైన అంశం కూడా అదే.

ప్రశ్న మానవ స్వభావం


ప్రశ్న తిరుగుబాటును నేర్పిస్తుంది

ప్రశ్న పరిష్కారాన్ని వెతుకుతుంది

ప్రశ్న అస్తిత్వానికి బాటలు వేస్తుంది

ప్రశ్న అన్యాయాన్ని ధిక్కరిస్తుంది

ప్రశ్న తెలుగు సాహిత్యకారుల ఊపిరి. అందుకే ప్రశ్నిస్తున్న సాహిత్యం వస్తుంది కనుకనే ఇంకా జీవన వైరుధ్యంతో, సమాజాన్ని ప్రశ్నిస్తూ, సామాజిక రుగ్మతలను ధిక్కరిస్తూ తెలుగు సాహిత్యం సజీవ చైతన్యంతో తొణికిసలాడుతుంది.



## సాధన పంచకమ్


**సంగః సత్సు విధీయతాం భగవతో భక్తిర్ దృఢాఽఽధీయతాం**
**శాన్త్యాదిః పరిచీయతాం దృఢతరం కర్మాఽఽశు సంత్యజ్యతామ్**
**సద్విద్వానుప సర్ప్యతాం ప్రతిదినం తత్పాదుకా సేవ్యతాం**
**బ్రహ్మైకాక్షర మర్థ్యతాం శ్రుతి శిరోవాక్యం సమాకర్ణ్యతామ్.**

తాత్పర్యం : 1. సత్పురుషులతో సాంగత్యమును ఏర్పరచుకొన వలెను. 2. దృఢమైన భగవద్భక్తిని కలిగి ఉండవలెను. 3. శాంతి మొదలైన సద్గుణములను తెలిసికొని ఆచరించవలెను. 4. వదలని కర్మబంధనము (కామ్యకర్మలు) వెంటనే వదిలిపెట్ట బడు గాక! 5. సద్గురువును ఆశ్రయించవలెను. 6. ప్రతిదినము గురుదేవుని పాదుకలను సేవించవలెను. 7. అద్వితీయమగు బ్రహ్మజ్ఞానమును అర్థించవలెను. 8. వేదములకు శిరస్సుల వగంటి ఉపనిషత్తుల వాక్యములను శ్రవణము చేయవలెను.

**వివరణ**

**2. భగవతో భక్తిర్ దృఢాఽఽ ధీయతామ్ -**

దృఢమైన, నిశ్చలమైన భగవద్భక్తిని పెంపొందించుకొనవలెను. విశ్వాసం గల వ్యక్తికి సత్పురుష సాంగత్యం వలన భగవద్భక్తి అంకురించి దినదినము క్రమాభివృద్ధిని పొందగలదు. భక్తి అనగా ప్రేమ, అది వట్టి ప్రేమ కాదు, పరమ ప్రేమ. “సా త్వస్మిన్ పరమ ప్రేమ రూపా” భగవంతుని పట్ల ఉత్కృష్టమైన ప్రేమను కలిగి ఉండుటయే భక్తి అని నారదమహర్షి తన భక్తి సూత్రములలో నిర్వచించినాడు. ప్రపంచం పట్ల ఉండే ప్రేమ, రాగం అవుతుంది. పరమాత్మ పట్ల కలిగే ప్రేమ భక్తిగా మారుతుంది. శాశ్వతుడు, సనాతనుడు ఐన పరమాత్మవైపుకు నిర్హేతుకంగా, నిరాటంకంగా ప్రవహించే పరమ ప్రేమయే భక్తి. అట్టి భక్తి ఎప్పుడూ నశించదు. అందుకే “అమృతస్వరూపా చ” అది అమృత స్వరూపమైనది అని చెప్పబడినది. కావున సంసార దుఃఖాన్ని పోగొట్టుకొనుటకు సత్సాంగత్యం ద్వారా దృఢమైన భగవద్భక్తిని పెంపొందించుకోవాలి అని సాధనపంచకంలోని రెండవశ్లోకం ఉపదేశిస్తున్నది. (సశేషం)



## మాండుక్యోపనిషత్తు

హేతువేమన అదియదృష్టము
వాక్కు కందని దంతులేనిది
శబ్దమాదిగ గోచరించెడి
లక్షణమ్ములు కూడ లేనిది; 25

ఇంద్రియముల కతీతమైనది
చింతనకు లభియించనట్టిది
పేరుతో పిలువంగ రానిది
వ్యాపకంబై అలరునట్టిది; 26

బ్రహ్మమొకటే; అదియు వ్యాపక
తత్త్వమై వెలుగొందు చుండియు
కార్యరూపంబైన జగమున
కెల్ల శాంతి స్థానమైనది 27

తనకు తుల్యము లేనిదగుచును
తనను మించిన దేది లేకను
బ్రహ్మమే అద్వైతమైనది
బ్రహమే కల్యాణమైనది 28

అట్టి బ్రహ్మ చతుర్థ పాద
మ్మది తురీయమ్మనుచు పండితు
లాత్మగతమున దలచుచుందురు
అదియె వాస్తవ రూపమందురు 29

పాదకల్పన తోడ చెప్పం
బడిన బ్రహ్మమె ప్రణవ రూపము
‘ఓం’ నందలి మాత్రలే పర
మాత్మ యందలి పాదకల్పన 30

జాగరిత స్థానమున వైశ్వా
నరుడు సృష్టి జేయుచుండగ
వ్యాప్తి కదియే మొదలు కాగా
అది ‘అ’ కారముగాను తెలియుడు 31

‘అ’కారమ్మే వర్ణమాలకు
ఆదియై నొప్పారుచున్నది
‘అ’కారమ్మే సకలమై - వాన
పించుచున్నది వాక్కు నందున 32.

**జక్కని వెంకటరాజం**
**సిరిసిల్ల, ఫోన్ : 9440021734**

గ్రంథాంతరంగం 05

# ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

వంగూరి సుబ్బారావుగారి (1920) నుంచి వెలమల సిమ్మన్నగారి (2011) దాకా సుమారు 10 మంది పండితాగ్రణులు ఆంధ్రవాఙ్మయ చరిత్రను తమదైన శైలిలో రచించి యశోధనులైనారు. అనంతపురం వాస్తవ్యులైన ఓ అయ్యావారు రాసిన 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము' ను వావిళ్ళ ప్రెస్సు అధిపతులు వేంకటేశ్వరశాస్త్రిగారు రచయిత కోరినట్లే **'కవిత్వవేది'** అన్న పేరుతో ప్రచురించి (1928) దేశం మీద వదిలారు. 304 పేజీల ఆ ముచ్చటైన పుస్తకం మరో ఎనిమిదేళ్ల (1936) కు మలిముద్రణ భాగ్యానికి నోచుకోగలిగింది. విశేషమేమంటే 'కవిత్వవేది' గా పరిచితులైన ఆ గ్రంథకర్త ఈ రెండవ ముద్రణలో ప్రచ్ఛన్ననామం వదిలి కల్లూరు వేంకటనారాయణరావు పేరుతో పాఠక ప్రపంచం ముందు సాక్షాత్కరించారు. సాహిత్య విద్యార్థుల, పండిత ప్రకాండుల ప్రశంసలు మూటకట్టుకొన్నారు కూడా.



1902లో జన్మించిన కల్లూరు వేంకటనారాయణరావు అనంతపురం సీడెడ్ డిస్ట్రిక్ట్ కాలేజి – నేటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగేళ్ల పాటు (1921-25) విద్యాభ్యాసం చేసి మల్లాది సూర్యనారాయణ శాస్త్రి, ప్రయాగ వేంకట రామశాస్త్రి, గరిమెళ్ల సోమన్న పంతులుగారి శిష్యరికంలో తెలుగు సాహిత్యాన్ని తలస్పర్శిగా అధ్యయనం చేశారు. మద్రాసు విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్ష తెలుగులో సర్వ ప్రథములుగా ఉత్తీర్ణులై బొబ్బిలి మహారాజు బంగారు పతకం గెల్చుకోగలిగారు. తర్వాత కల్లూరు వారు రాజమండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో 1926 వ సంవత్సరం వేసవి సెలవుల్లో నలభై రోజుల పాటు రాత్రింబవళ్లు కృషి చేసి, ఆ పట్టణంలో తెలుగు ఉపాధ్యాయులు చిలుకూరి నారాయణరావుగారి సలహా మేరకు 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము' రచించారు. ఆయన సిఫారసు మీదనే వావిళ్ళ ప్రెస్ వారు ఆ అమూల్య గ్రంథాన్ని 1928లో ప్రచురించారు. వేంకట నారాయణ రావుగారికి తమ జీవితకాలంలో ఆపుస్తకం ప్రతులు ఐదంటే ఐదే లభించాయి. పారితోషికం హుళక్కి. ఈ అద్వితీయ గ్రంథానికి చిలుకూరి నారాయణరావుగారు 27-9-1928 లో 'పీఠిక' సంతరిస్తూ 'కవిత్వవేది' గారి 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము' వంగూరి సుబ్బారావుగారి 'ఆంధ్రవాఙ్మయ చరిత్రము' (1920), భోగరాజు నారాయణమూర్తిగారి 'ఆంధ్రకవిత్వ చరిత్రము' (1926)ల కంటే మిన్నగా వున్నదనీ, ఆ రెండు పుస్తకాల్లోని దోషాలు ఈ పుస్తకంలో లేవనీ, పైగా ఈ గ్రంథం 'నవ్యదృష్టి విలసితమై' వున్నదనీ అన్నారు. (పేజి:11)

చిలుకూరి నారాయణరావు **"విషయ విభాగము నందును, రచనా విధానము నందును, నీ గ్రంథము నూతన పథ ననుసరించి నూతన దృక్పథమును వెలయించు చున్నది."** (పీఠిక. పేజి: 13) కవిత్వవేది తమ పుస్తకంలో ప్రదర్శించిన కొత్త వైఖరి ఏమిటో తెలుసుకొందాం. పూర్వ సూరులైన వంగూరి సుబ్బారావు కాని, భోగరాజు నారాయణ మూర్తి కాని, వారి కంటే పూర్వులైన గురజాడ శ్రీరామమూర్తి పంతులు, కందుకూరి వీరేశలింగం పంతులు గాని కవుల కాలనిర్ణయం, ఆశ్రయ దాతల వివరాలు, కవుల కులగోత్రాల గురించి పటించుకున్నంతగా ఆకాలంనాటి సాంఘిక, రాజకీయ, ధార్మిక పరిస్థితుల నేపథ్యంలో ఆకాలంనాటి కృతులు రూపొందిన వైనాన్ని గమనించినట్లు అగపడదు. పైగా కావ్యాల, వ్యాకరణాల, శబ్ద ఛందస్సుల పరిధిని దాటి కావ్యాత్మ, గురించి కూడా చర్చించినట్లు కనబడదు ఈ నేపథ్యం నుంచి చూస్తే 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము' కర్త కవిత్వవేది నూతన దృక్పథము కనపరిచినారనే చెప్పవలిసివస్తుంది. అలాంటి సమయంలో కల్లూరు వేంకటనారాయణ రావుగారు పైలా పచ్చీసు వయస్సులో 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము' ను నూతన గుణ సమన్వితంగా రచించడం మహత్సాధనమే.

'కవిత్వవేది' తమ గ్రంథాన్ని ఐదు ఖండాలుగా విభజించి, ఒక్కో ఖండాన్ని కొన్ని యుగాలుగా భావించి, ఆయుగ కాలావధిని పేర్కొని కింది అంశాలవారీగా పరిశీలించారు. 1. సంఘచరిత్ర 2. వాఙ్మయ చరిత్ర 3. కావ్యవిమర్శ 4. యుగ లక్షణ సమన్వయము. మనుపటి, తర్వాతి తెలుగు సాహిత్య చరిత్రకారులు ఎవ్వరూ ఈ దృష్టితో తెలుగు సాహిత్య చరిత్రను పరామర్శించిన వైఖరి కనపడదు. కల్లూరు వేంకటనారాయణ రావు ఒక్కో యుగం కాలపరిమితి లోని దేశ సాంఘిక, రాజకీయ, మత పరిస్థితుల్ని సమీక్షించి ఆకాలంలో వెలువడ్డ కవిత్వానికి ప్రేరకమైన స్థితిగతుల్ని నిరూపించారు.

'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము' ప్రథమ ఖండంలో ప్రాచీన కవిత్వం గురించి రాస్తూ మన తెలుగుసాహిత్య చరిత్ర కర్తలకు భిన్నమైన రీతిలో తెలుగు కవిత్వ ఆవిర్భావ, ప్రారంభ దశను అవలోకించారు. భారతదేశంలో దేశీయ భాషలు వికాసం చెందడానికి మూలకారణం బుద్ధ భగవానుడని పేర్కొన్నారు. **"బౌద్ధమత వ్యాప్త్యనంతరము గాని దేశభాషా ప్రాబల్యము వెలయలేదు. వేదవాఙ్మయ గ్రీష్మ భానుదు మధ్యాహ్నాంబరమున నుండిన దాక దేశీయ భాషాలతలు వాడవాఱియే యుండినవి. దేశ్యము మూలముననే ప్రజాప్రబోధమగునని మొదట గనిపెట్టినవాడు బుద్ధ భగవానుడు."** (ఆం. వా. చ. సంగ్ర. పేజి: 32) ఆంధ్రదేశంలో బౌద్ధమంతగా వ్యాపించ లేనందువల్ల, జైనమతానికి ప్రాచుర్యం లభించి వుండి నందువల్ల జైనమత రచనలు తప్పక రచింపబడి వుంటాయని విశ్వసించారు కల్లూరు వారు. బౌద్ధమత రచనలు కూడా వెలువడి వుంటాయని నమ్మారు. అలా గాఢంగా విశ్వసిస్తూ కవిత్వవేది ఇలా ప్రశ్నిస్తారు– **"బౌద్ధజైన మత మేఘములు శంకరవాద ఝంఝామారుతమునకు జెదరిపోగా, గురిసిన వైదికగ్రీష్మాతపము నకు నెన్ని కావ్యసస్యములు వాడెనో? మతోద్రేకముగల్గిన యకాలప్రళయములో నెన్ని మత గ్రంథములు నిర్నామము లైనవో? లేకున్న భాషాభివృద్ధి యెంతయో యయికృతులుండి యుండవా? నన్నయ భారతము వంటి యుద్గ్రంథ మాకసము నుండి యూడిపడి యుండననుట సత్య దూరము కాదా?"** (పేజి: 33) అంటూ ఎలాంటి విచికిత్సకూ అవకాశం ఈయకుండా **"అప్పటికీ (క్రీ. శ. 500 వఱకు) బౌద్ధజైన ప్రాబల్యమే తెనుగుసీమలో గలదుగాన సారస్వతము వారిదే యై యుండవచ్చు ననియు జెప్పవచ్చును."**(పేజి: 35) అని నొక్కి వక్కాణించారు రావుగారు 'వాఙ్మయచరిత్ర' అనే రెండో విభాగంలో తత్కాలీన వ్మాయాన్ని చారిత్రక, సాంఘిక, ధార్మిక పరిప్రేక్ష్యంలో పరిశీలించారు.

గ్రంథకర్త ద్వితీయఖండంలోని పురాణ కవిత్వాన్ని బ్రాహ్మణ శైవ కవిత, వీరశైవ కవిత, శాస్త్ర కవిత, కావ్య కవిత, నీతి కవిత అంటూ ఐదు భాగాలుగా వింగడించి, విమర్శించారు. తర్వాత కవిత్వవేది 'కావ్య విమర్శ' శీర్షిక క్రింద పురాణకవులైన కవిత్రయాన్నీ, శివకవుల్నీ, ప్రబంధ కవుల్నీ, దక్షిణాంధ్ర యుగ కవుల్నీ, వారి కృతుల్నీ, కావ్యసిద్ధినీ ఎంతో ప్రతిభావంతంగా విమర్శించారు.– **"నన్నయ పురాణ కవితకు మార్గదర్శి యయ్యెను తర్వాత తిక్కన. మారన, ఎఱ్ఱన, సూరన, నంది మల్లయ్య, ఘంట సింగనలు పురాణ కవితా ధోరణిని పెంపొందించిరి. నన్నెచోడుడటులనే కావ్య ప్రబంధ కవితా ఫక్కికి మార్గదర్శి యయ్యె దీనికి జేరి శ్రీనాథుడు పెంపు గూర్చెను! పెద్దన విపులీకరించెను: తర్వాత భట్టుమూర్తాదులు శ్లేషను జేర్చిచి కూర్చిరి: మార్చిరిబీ ఇంకను నర్వాచీనులు చెఱచిరి."** (పేజి: 68) కవిత్వవేది ఒక్క విసరు (స్ట్రోక్)తో –అదీ 'మాస్టరు స్ట్రోకు'తో ఒక్కయుగ కవితనే సమీక్షించి వేశారు!

కల్లూరివారు సునిశితమతి, సారమతి కూడానూ. ఒక కవి సాహిత్య సిద్ధిని, అతని ప్రక్రియ, శైలి ఏరకమైనదైననూ – నిష్పక్షపాతంగా సూక్ష్మేక్షికతో చూడగల ద్రష్ట. వీరశైవ కవి పాలకురికి సోమనాథుని కవిత్వాన్ని అంచనా వేసిన వైనాన్ని గమనించండి. **"ఆంధ్రమున నాద్యమైన యనుష్టుప్పు వంటి ద్విపద గంగావాహిని యజ్ఞాతమగు ప్రాచీనాంధ్ర సారస్వతాంబరంబున నెటదాగి యుండెనో మన మెఱుఁగముగాని, శివుని జటాజూటము నుండి వెలువడినట్లు, సోమనాథుని బసవపురాణ, పండితారాధ్య చరిత్రల ద్వారా అనర్గళముగా బ్రవహించినది. ఆ గడుసుపోకడలను, ఆ భావతరంగములను, ఆ జాతీయముల మర్మధ్వనులను, తర్వాతి కవులలో బెక్కురు సంగ్రహించు కొనిరనుట వాస్తవము."**(పేజి: 69)

కవిత్వవేది కవిత్వకళా మర్మజ్ఞుడు. ఒక మహాకవి రచనా ప్రతిభను గుర్తించడమే కాదు, అతని కవిత్వాన్ని మరొక మహాకవి కవిత్వంతో తౌలనిక అధ్యయనం చేసినప్పుడు ఆయన దృక్పథ విశేషం ఆశ్చర్యం కలిగిస్తుంది. అల్లసాని పెద్దన, రామరాజ భూషణుల కృతుల్ని కాని, ఎఱ్ఱన – నాచన సోమనల కావ్యాల్ని కాని బేరీజు వేసేటప్పుడు వేంకటనారాయణ రావు గారి సూచీముఖ ప్రతిభ ఇలా వ్యక్తమవుతుంది.

"మనుచరిత్రరత్నహారము, వసుచరిత్ర రత్నముల రాశి. రత్నఖని యొకటి, రత్ననిధి యొక్కటి. మనుచరిత్ర యెడనున్న ప్రజాప్రీతి వసుచరిత్ర యెడ లేదుగదా? సోమన యధికుడే యగును. కాని ఎఱ్ఱన ప్రజా ప్రీతిపాత్రుడు. ప్రజాలక్ష్యమేమి? పండితులు లేరా? యనుకొన్నచో పండితులకే పనికివచ్చు వాఙ్మయముండుగాక! అది కళా పరమధర్మమగు నానందము నొసంగి, ప్రాచుర్యము గాంచక యడవిమల్లె యగుచున్నది. దానం జేసి **"కళాధర్మముతో విశ్వహృదయమును మేళగించి ప్రజా సామాన్యమునకు (పండితులకే కాని, పామరులకే కాని ప్రత్యేకించి రచింపక) సుబోధమగునట్లు కవిత జెప్పినవాడే ధన్యుడు."** (పేజి: 113, 114)

తెలుగుసాహిత్యచరిత్రకారుల్లో చాలామంది సమగ్రంగా సాహిత్య చరిత్రను రాయాలనే ఉద్దేశ్యంతో వివిధ యుగాల్లో వర్ధిల్లిన కవుల రచనల్ని పైపైన తడిమి వదిలి పెడ్తుంటారు. ఆయా యుగ లక్షణాల్ని వ్యక్తీకరించిన కావ్యాల స్థూలపరిచయం చేసి తృప్తి చెందుతారు. కాని ఏ కొద్దిమందో తెలుగు సాహిత్య చరిత్ర కారులో అసామాన్య, సామాన్య కవుల రచనా వైశిష్ట్యాన్ని వెలికి తీయగలుగుతారు. పైగా కావ్యానుశీలనలో ఆకవులు పాథేయంగా పొందిన పూర్వ కవుల సంప్రదాయాన్ని అనుసరిస్తూ, తమ ప్రతిభను జోడించి మునుముందుకు సాగిన కావ్య యాత్రను కూడా వివరిస్తారు. విలక్షణ ప్రతిభాసంపన్నులైన సాహిత్య చరిత్ర కర్తలు. అంతేకాదు.

తర్వాత కవుల రచనలపై వారి ప్రజ్ఞా పాటవాల ప్రభావాన్ని కూడా దర్శించి ప్రబుద్ధపాఠకులకు సూర్యాలోకనం కలిగిస్తారు. కవిత్వవేది కల్లూరు వేంకట నారాయణ రావు ప్రతిఖండంలోని యుగ

కవిత్వాన్ని పరామర్శించి చివర్లో యుగలక్షణ సమన్వయం చేస్తారు. తృతీయఖండంలోని శ్రీరాయల యుగం (1501–1650) నాటి కావ్యాల యుగలక్షణ సమన్వయం చేస్తూ కల్లూరు వారు చేసిన సర్వేక్షణ (సర్వే) విశాలమైనదీ, లోతైనదీనూ.

కవిత్వవేది యుగలక్షణ సమన్వయ మంటూ పేర్కొన్న అంశాలు గమనార్హాలు. వారు ఉల్లేఖించిన 12 అంశాలో కొన్నింటిని మాత్రమే పొందు పరుస్తున్నాను – కవిత్వవేది మాటల్లోనే –

1. ఈ యుగములోని ప్రధాన కవులొకరిని మించి యొకరు వ్రాసిరి. ఒకరి కింకొకరు మెఱుగులు పెట్టినారు ఒక్కొక్క రొక్కక్క ప్రబంధరీతిని బోషించినారు.

2. వాఙ్మయము పూర్వార్ధమున బెంపొంది, యుత్తరార్ధమున నీరసమైనది. లాక్షణికులు పెక్కురైరి.

3. వాఙ్మయము విస్తృతి గాంచి నానాముఖముల బ్రవహించు సూచనల నిచ్చినది.(చూ. రాయవాచకము)

4. అచ్చతెనుగు కావ్యములకు, "పిల్ల" ప్రబంధములకు "మోహ" కావ్య" పరంపరకు బీజములు చక్కగా నాటబడినవి.

5. నీతి కావ్యకవిత వేమన యందు రెండున్నరవేలు గ్రంథముగా మాటి సంపూర్ణ స్వాతంత్ర్య పరిణతి నొంది ఫలించినది.

6. ఈ యుగమున గుణదోషములు సమ్మిశ్రములు. దోషములు ముందునకు మార్గదర్శకములయ్యెను. మానవ జీవిత పరిశీలనమున, నసామాన్యమైన నారికేళపాకమును జూపినది. ప్రబంధ రచనపై ప్రజాభిమానము మోదగుటచే గుప్పతెప్పలుగా నవియే పుట్ట దొడగినవి. ద్వర్థి కావ్యములు శ్లేషకు దారి వైచినవి. పాండిత్య ప్రకర్ష మొక గుణముగా చాటింపబడినది.

7. పై యుగము లోని కావ్యసరస్సు కట్టతెగి ప్రబంధ నదియై యీ యుగమున చారి సాధారణ గ్రంథ సముద్రజల విరసక్షారములతో జేరి భావి యుగమున వెగటైనది (పేజి: 217, 221, 222)

'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము' గ్రంథకర్త తమ 24 వ ఏట – 1926లో రాజమండ్రిలో ఎల్.టి. విద్యార్థిగా వున్నప్పుడు చేసిన తొలి చదువు సాముల ఫలితం ఈ అమూల్య గ్రంథం.

ఈ పుస్తకం ప్రతి పుటలోనూ రచయిత విస్తృత అధ్యయనం, లోతైన పరిశీలన, ఆచితూచి చేసిన పదప్రయోగం, అక్కడక్కడ పాఠకుల్ని తమవైపు లాక్కునే కవితామయమై, అలంకార భూషితమై, లోకోక్తి సమన్వితమైన వాక్య నిర్మాణం ప్రతిభామూర్తులైన పండిత వరేణ్యుల అభిప్రాయాల ఉటంకింపులు మీదు మిక్కిలి పాదటిప్పణుల్లో విలువైన పత్రికలు చూడమనే సూచనలు దృగ్గోచరమవుతాయి. కల్లూరు వారు ఎంతోమంది సరస్వతీపుత్రుల రచనల్ని ఆకళింపు చేసుకోవడమే కాక, కృతజ్ఞతాపూర్వకంగా సందర్భానుసారంగా వాళ్లను స్మరించడం ఆకాలంలోనే కాదు, ఈ కాలంలో కూడా అపురూపమే.

తెలుగు సాహిత్య చరిత్రకారులు చాలా మంది యుగ విభజన చేసి, సాహిత్య వికాసక్రమాన్ని అక్షరబద్ధం చేసినంతగా కవి కృతుల గంభీర విమర్శనం చేసినట్లు అగపడదు. ఎంత గొప్ప విద్వాంసులకైనా వేయి సంవత్సరాల సుదీర్ఘకాలంలోని వివిధ ప్రక్రియల రచనల గుణదోష నిర్ణయం చేయడం కష్టం. పైగా వాళ్లకంటూ ప్రత్యేకమైన అభిరుచులు వుండనే వుంటాయన్న సంగతి కూడా మనం మరవరాదు. అంటే సాహిత్య చరిత్ర రచనలో గ్రంథకర్త ఇష్టాయిష్టాలు ప్రతిఫలించడం సాధారణమే. కాని కవిత్వవేది ఎంతో జాగ్రత్తగా వ్యవహరించి, అన్ని యుగాల రచనల పట్ల సాధ్యమైనంత వరకు సామరస్యం ప్రకటించారు. కవుల యోగ్యతానుసారం గౌరవాదరాలు చక్కని రీతిలో వ్యక్తం చేశారు. కల్లూరు వారు కవిత్రయం, పాలకురికి, నన్నెచోడుడు, శ్రీనాథుడు. పోతన, ప్రబంధ కవుల రచనల గుణావగుణాల్ని చర్చించి, గౌరవించినట్లే దక్షిణాంధ్రయుగంలోని చేమకూర వేంకటకవి, శతక కవి వరేణ్యుడైన వేమన్నను తలకెత్తుకున్నారు. వేంకట నారాయణ రావు విమర్శలోని ఈ 'అచ్చపు సహృదయత' (ఇది పింగళి లక్ష్మీకాంతం వారి మాట) చాలా మందిలో కానరాని సుగుణం. విజయ విలాస కావ్యకర్త గురించి కవిత్వవేది అభిప్రాయం చూడండి. – **"తెలుగు లోకోక్తులతో జాలు వాఱి, యలంకారములతో గులికి, రసోదంచితంబై, సూరన్న రచనలకు బిమ్మట, తేటతెలుగు పదముల కలయికతో, శ్లేషను కల్పించుట యందద్వితీయుడై మెఱసిన వేంకట కవి ధార ప్రశంసనీయమే!"** (పేజి: 200)

విశాలమైన వేయి సంవత్సరాల తెలుగు సాహిత్య చరిత్రలో కుమ్మరి మొల్ల కావ్యకళా ప్రతిభను వేంకటనారాయణ రావు గారిలా గుర్తించారు. – **"కుమ్మరి మొల్ల నెల్లూరు మండలము లోనిది. ఈమె రామాయణమును చిన్న కావ్యముగ వ్రాసెను పురుషులు వ్రాసిన చిన్న చిన్న రామాయణము లన్నిటికన్న నిది నుత్కృష్టముగ నున్నది. శబ్దాలంకారములలో నిండి, మధురమై, మనోహరమై, అవిరళ ధారాస్పదమై యరుదారినది. స్త్రీలలో నీమెయు, తరిగొండ వెంకమ్మయు నగ్రగణ్యలు."** (పేజి: 201) కల్లూరు వారు ప్రజాకవి వేమన పద్యాల్లోని భావగరిమను, భాషాగాంభీర్యాన్ని ఇలా ప్రశంసించారు– **"....ఇతని యందు పాఠకుని మనస్సును సమాలోచన జేయుటకు బురికొల్పుట ముఖ్యగుణము. ఇది మహాకవి లక్షణము. ఒక విషయమును దడవినచో ననేకము లూహలు గల్గునట్లు భావనా ప్రపంచమున నోలలాడించు శక్తియే 'ధ్వని'యని ముందనుకొంటిమి. ఇట్టి ధ్వని కీతడునిధి."** (పేజి: 216)

కవిత్వవేది కావ్యాంతరంగాన్ని మథించడంలో మహానిపుణులు. ఈయన గారి యీ విలక్షణ ప్రతిభ 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము'లో పలుచోట్ల వ్యక్తమయింది. శతకాల వైలక్షణ్యాన్ని వెలువరిస్తూ, శతాబ్దాల తర్వాత రచింపబడ్డ భావకవిత్వ లక్షణాల్ని ఎంతో చాతుర్యంతో ఈ శతకాల్లో ఇలా పసిగట్టారు– **"శతకములను భావగీతములనిరి. భావగీతములు శతక కవితలో దాగుడుమూత**

**లాడినవి గాని, శతకములు భావగీతములు మాత్రమే కావు. ప్రకృతి సందర్భన తన్మయత్వమున ముగ్ధుడై యొకే మనో వికృతిని విపులీకరించి కవి పాడుకొనునది భావగీతము(లిరిక్).”** (పేజి:218) (కవిత్వవేది ఈ దృష్టి నైశిత్యం పట్ల నాచూపు మరల్చిన విమర్శక వరేణ్యులు ఆచార్య కె. కె. రంగనాథాచార్యుల వారికి నా వందన శతాలు) కందుకూరి రుద్రకవి రాసిన ‘‘జనార్దనాష్టకము భావగీతరాజము” (పేజి: 200) అనడంలో కూడా కల్లూరి వారి కళామర్మజ్ఞత వ్యక్తమవుతుంది.

రావుగారు ఆధునిక తెలుగుసాహిత్యంలోని వివిధ ప్రక్రియల రచనల్ని క్షుణ్ణంగా, తలస్పర్శిగా పరిశీలించినారని చెప్పలేం. కాని ప్రతిభాశాలి కల్లూరి వారు వాటిని అభ్యసించినంత వరకు, అంతరంగమథనం చేసినంతవరకు వెలిబుచ్చిన అభిప్రాయాలు శాంతి సమ్రాట్టు అశోక చక్రవర్తి శిలాశాసనాల వంటివే.

‘ఆంధ్రకవుల చరిత్రము’ అందించిన కందుకూరి వారి ప్రతిభను ఈ విధంగా ఉగ్గడించారు– **“ఎందఱెన్ని విధముల వ్రాసినను, ఎట్లో యాతని పరిశ్రమమునను, చౌర్యముగనో, తెలియజేసియో యుపయోగించుకొనక తప్పదు. ఎన్ని వాఙ్మయ విమర్శనములు బయలుదేరినను, ఇతని కవి చరిత్ర యితని స్థానమును వాఙ్మయమున Johnson వంటి వానిని (Lives of poets) చేయక విడువదు. కాల నిర్ణయము కావ్య విమర్శ కన్న నితనిలో నధికము. జీవితకారునిది (గురజాడ శ్రీరామమూర్తి) కావ్య విభజనము, చరిత్రకారునిది కాల విభజనము. చరిత్రకారుడు పాటించిన విశేషములు– కాల నిర్ణయము, కవి జీవిత కథనము, తత్కాల ప్రభువుల స్థితి, కృతి నామములు, భాషా దోషములు, గ్రంథము గడించిన కీర్తి పదవులు శైలి స్వరూపమునను నేడింటిని పేర్కొననగును. విమర్శ వాఙ్మయమున నెన్నడును చెదరని పునాది నితడు వేసెనని యుగ్గడింపనగును.”** (పేజి: 278)

కల్లూరు వేంకటనారాయణ రావు పాతికేళ్లు నిండకముందే సముపార్జించిన సాహిత్య వైదుష్యం, ఆలోచనాతీక్ష్ణత, అభివ్యక్తి విధానం, అమోఘమని చెప్పవచ్చును. ఆయన తెలుగు సాహిత్య చరిత్రను సంగ్రహంగానే చెప్పినా అక్కడక్కడ కావ్యశాస్త్ర పారిభాషిక పదాల్ని స్పష్టంగా నిర్వచించిన వైఖరి చేతోహారి.

కవిత్వవేది కావ్యమర్మజ్ఞతకు ఎన్నో నిదర్శనాల్ని చూపవచ్చు. కాని కొన్నిటిని మాత్రమే పాఠకుల ముందుంచుచున్నాను.

1. కళా కాంతితో జికిలి యొనర్చి యున్నత భావసుమములతో గైసేసిన గ్రంథకలాపమే వాఙ్మయ మననగు (పేజి: 26)

2. భావ విస్పష్టతకై సాదృశ్యోద్దీపకములగు నుపమాద్యలంకృతులు గావలయును. కాని, యలంకారముల గారడీని జూపుటకు గృతి యేర్పడ గూడదు. (పేజి: 27)

3. “కావ్యములో కవి యున్నాడు. కవి వెనుక జాతి యున్నది. ఆజాతిని సాంఘిక, భౌతిక వాతావరణము లందగొని యున్నవి. కవి జీవితముతో పాటు, కవి కాలదేశపరిస్థితులను గమనించినచో కావ్యసందేశము బయల్పడును. కవి కృతి వ్యక్తి జీవికా ప్రతిబింబిత సంఘ జీవనమే గదా!” (పేజి: 28)

4. “సంస్కృత పద ప్రాచుర్యమునకు దగిన యర్థపుష్టి కఱవైనది. అర్థపుష్టి పోయి యలంకారవృష్టి కురియ దొడంగినది. అంతటితో ప్రబంధము మొదలైనది. కాబట్టి పురాణ విపుల కావ్యకథకు ప్రబంధ కవితకును మధ్య కాలము మిశ్ర కావ్య ఫక్కియని తేలినది. మిశ్ర కావ్యపరిణతికి కేతనయును, ముఖ్యముగా త్రిపురాంతకుడును మూలమైరి. మదనవిజయ, దశకుమారచరిత్రలు శృంగార వర్ణనకు, నుపాఖ్యాన సంబద్ధము లగునవి మహాత్మ్య కథానకములకు దారి తీసినవి. వివిధ కావ్య లక్షణము లించుమించుగా నీ మాహాత్మ్యములలో జేరినవి. అష్టాదశ వర్ణనలకు జే యొగ్గిన దీ మిశ్ర కవితయే దీని పరిణామము ప్రబంధము.” (పేజి: 130) ప్రబంధ కవిత్వ ఆవిర్భావ వికాసాల్ని ఇంత క్రమబద్ధంగా, లక్షణ సహితంగా నిరూపించిన ఆంధ్ర వ్మాయ చరిత్ర కారులు కవిత్వవేది కాక వేరొకరున్నారా?

5. సంఘము ననుసరించియే నేను నట్టి యధర్మ ప్రేమలను వర్ణించు గ్రంథములను మోహశృంగార కావ్యములని నామకరణము జేసితిని. (పేజి: 244) ఉదా : తారాశశాంకము, రాధికాసాంత్వనము మొ॥

కల్లూరి వారు తమ ‘ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము’ లో భారతీయ కావ్య సంప్రదాయాన్ని అనుసరిస్తూ, పాశ్చాత్య కావ్యశాస్త్ర సంప్రదాయంలోని కొన్ని సుగుణాల్ని పుణికి పుచ్చుకొని, మౌలిక చింతనల్ని మేళవించి, మణి కాంచన సంయోగ నిదర్శనంగా అమూల్యమైన ఈ విమర్శనా కృతిని వెలియించారు.

‘ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము’ (1928) లో కవిత్వవేది వెలిబుచ్చిన అత్యంత మూల్యమైన రెండు విషయాల్ని ప్రస్తావించడం అవసరం.

1. పాశ్చాత్య కళా ధర్మములను నెత్తిపై నుంచుకొని, మన నాగరకతా పృథకత్వమును కాలదన్నుట పాడిగాదు. ఆలోచించినచో పాశ్చాత్యుల పాంచ భౌతిక ప్రకృత్యనుకరణ మవశ్యముండదగినదే కాని, ప్రాచ్యదర్శనములతో మేళవింపవలయును. ఆత్మ శరీరముల బోలునవి ప్రాచ్య పాశ్చాత్య శిల్పములు. (పేజి: 331)

**“పత్రికాధిపతులు, విమర్శకులు దక్షిణాంధ్ర తెలంగాణా, దత్తమండల సీమలలోని రచయితలను నిరాకరించుట తగదు. స్వమండలాభిమాన మున్నను నాంధ్ర దేశస్థులెవరైన నొక్కటే యనుట మఱువరానిది.”** (పేజి: 303)

ఐదు ఖండాలుగా విభజింపబడ్డ కవిత్వవేది కల్లూరు వేంకట నారాయణరావుగారి ‘ఆంధ్రవ్మాయ చరిత్ర సంగ్రహము’ తర్వాతి సాహిత్యచరిత్రకర్తలకు మరింత సూక్ష్మమైన వింగడింపులకు అవకాశం కల్పించింది. మౌలిక ఆలోచనకు పురికొల్పింది.

మూసీ సాహిత్యధార
ప్రధాన ప్రసంగం

# పరిశోధన - స్వరూప స్వభావాలు -2

ఆచార్య జి.ఎస్. మోహన్, విశ్రాంత తెలుగు ఆచార్యులు, బెంగుళూరు.
ఫోన్ : 944 840 5110

(మొదటి సంపుటి తర్వాయి భాగం)

**సిద్ధాంత గ్రంథ రచన శైలి :**

పరిశోధన వచన ప్రక్రియ, వివరణాత్మక వచన ప్రక్రియ. కవిత్వంలాగా సృజనరచన కాదు. అందువల్ల ప్రతిపాదించే సిద్ధాంతానికి ఆధారాలు చూపడంలో ఆవేశానికి, ప్రాధాన్యం ఇవ్వక సిద్ధాంత రచనకు ఉపక్రమించాలి. పరిశోధనకు పరిశోధకుడు అర్థం చేసుకొన్న విధానాన్ని తెలియచెప్పే సాధనం సిద్ధాంత గ్రంథశైలి. ఇక్కడ ఆడంబరాన్ని ప్రదర్శించ్చిన అవసరంలేదు. అందువల్ల సిద్ధాత గ్రంథం పరిశోధకుని పాండిత్య ప్రకర్షకు వేదిక కాకూడదు; రచన సరళంగా ఉండాలి.

చెప్పదలచుకొన్న విషయం స్పష్టంగా ఉండాలి. అస్పష్టత వల్ల చెప్పదలచుకొన్న విషయం మరుగున పడిపోతుంది. వర్ణక్రమ దోషాలను పరిహరించడం వల్ల, వ్యాకరణ విషయాల్లోను, విరామ చిహ్నాలను ఉంచడంలోను ప్రత్యేకమైన శ్రద్ధను పాటించడం వల్ల వ్యాసరచనకు స్పష్టత ఏర్పడుతుంది.

పరిశోధకుడు తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పాలి కాని, ఉండొచ్చు, చూడొచ్చు, చెప్పవచ్చు, అనుకోవచ్చు, గమనింపవచ్చు, గుర్తింపవచ్చు లాంటి మాటల్ని వీలయినంత వరకు తక్కువగా ప్రయోగించాలి. లేకపోతే శైలిలో సందిగ్ధత చోటు చేసుకుంటుంది.

అల్పాక్షరాలలో అనల్పభావాన్ని చెప్పడం, చిన్న చిన్న వాక్యాలలో రచనచేయడం సిద్ధాంత గ్రంథ శైలిలో గమనించాల్సిన అంశాలు. అంటే వాక్యాలు మిక్కిలి సంకీర్ణంగాను, క్లిష్టాన్వయంగాను ఉండ కూడదు.

సిద్ధాంత వ్యాసాలను వ్యావహారిక భాషలోనే వ్రాస్తున్నాము కనుక గ్రాంథిక భాషను కలిపి కలగాపులగము చేసి, మిశ్రమ భాషను విచ్చలవిడిగా ప్రయోగించకూడదు. అందువల్ల వీలయినంతవరకు తేటతెలుగు మాటల్ని వాడుతూ రచన చేయాలి.

**పర్యవేక్షకుడి పాత్ర :**

పరిశోధనలో పర్యవేక్షకుడు కీలకపాత్రను వహించాలి. పరిశోధకుడు సేకరించి సమాచారాన్ని వర్గీకరించి, విశ్లేషించే సమయంలోనే పర్యవేక్షకుని బాధ్యత ఆధారపడి ఉంది. పర్యవేక్షకుని అనుభవం పరిశోధకుని సిద్ధాంతవ్యాస రూపకల్పనలో తోడ్పడాలి. సూచనలు, సవరణలు ఉత్తమసిద్ధాంతవ్యాసచనకు తోడ్పడతాయి. సత్ఫలితాలను సాధించడానికి ఉపయుక్తమవుతాయి.

పరిశోధకుడు, పర్యవేక్షకుడు ఇద్దరూ పరిశోధనకు రెండుకళ్ళు. సిద్ధాంత వ్యాసరచనలో పరిశోధకుడి పాత్ర ఎంత ఉంటుందో అంతే పర్యవేక్షకుడి పాత్రకూడ ఉండాలి. పర్యవేక్షణ అంటే కేవలం పక్షివీక్షణంలా ఉండకూడదు. పరిశోధకుణ్ణి సక్రమమార్గంలో పెట్టగల మార్గదర్శకత్వం ఉండాలి. సిద్ధాంత వ్యాసరూపకల్పనలో పర్యవేక్షకుని పాత్ర తప్పనిసరిగా ఉండాలి. ఇద్దరిమధ్య సయోధ్య ఉన్నపుడే ఒక ఉత్తమ సిద్ధాంతవ్యాసం వెలుగు చూడడానికి వీలవుతుంది.

పర్యవేక్షకుడు కూడ పరిశోధకుడు సిద్ధాంతవ్యాసాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించే సమయంలో అక్షరదోషాలను, వ్యాకరణదోషాలను దిద్దాల్సిన అవసరం ఉంది. సాధారణంగా ఈ దోషాలను డి.టి.పి. వాళ్ళమీద మోపడం జరుగుతుంది.

సిద్ధాంతవ్యాసాన్ని పర్యవేక్షకుడు దిద్ది ఇచ్చినతర్వాత పరిశోధకుడు తప్పనిసరిగా దిద్దిరాయాలి. ఆ దోషాలను సరిగ్గా చేశారో లేదో ఉన్న విషయాన్ని పర్యవేక్షకుడు కూడ తప్పనిసరిగా చూడాలి. లేకపోతే ఆ సిద్ధాంతవ్యాసం తప్పులతడకలా నవ్వులపాలవుతుంది.

పరిశోధక విద్యార్థిగా స్వీకరించిన రోజునుంచీ విద్యార్థి బాగోగులను విచారిస్తూ ఉత్సాహాన్ని నింపుతూ పరిశోధన సమస్యను పరిష్కరించడానికి తనవంతు సహకారాన్ని అందిస్తూ, ఒక ఉత్తమ సిద్ధాంతవ్యాస రూపకల్పనలో సూచనలను, సవరణలను తెలియజేయడం ఉత్తమ పర్యవేక్షకుని లక్షణంగా, లక్ష్యంగా ఉండాలి.

1. పర్యవేక్షకుడు ఎప్పుడూ తన అభిప్రాయాలను తనదగ్గర పరిశోధన చేస్తున్న విద్యార్థిపై రుద్దకూడదు.

2. పర్యవేక్షకులు పరిశోధకుని అభిరుచి బట్టీ, ఆసక్తినిబట్టి విద్యార్థితో బాగా చర్చించిన తర్వాతనే పరిశోధనాంశాన్ని ఇవ్వాలి.

3. పరిశోధకుడు ఎన్నుకొన్న అంశంమీద పర్యవేక్షకుడు కూడ దృష్టిని కేంద్రీకరించాలి. పరిశోధకుడు పనిచేస్తున్న తీరును పర్యవేక్షకుడు పరిశీలిస్తుండాలి.

4. పరిశోధకుడు చదవాల్సిన పుస్తకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షకుడు తెలియజేస్తూ ఆపుస్తకాలలోని సారాంశాన్ని ఎలా గ్రహించాలో మొదలైన టెక్నిక్ లేదా మెలకువలను వివరిస్తుండాలి.

5. పరిశోధన అన్నది ఒక్క పరిశోధకునికి సంబంధించింది మాత్రమేకాదు. ఆ బాధ్యతను స్వీకరించిన పర్యవేక్షకుని మీద కూడ ఉంటుందన్న విషయాన్ని మరిచిపోకూడదు. అందువల్లనే పాశ్చాత్యులు తనవిద్యార్థి తనతో పరిశోధన చేస్తున్నారు.

6. ఒక్కోసారి పర్యవేక్షకుడికి తెలియని కొత్త విషయాలను పరిశోధకుడు ఆవిష్కరించవచ్చు. దాన్ని చూసి పర్యవేక్షకుడు గర్వించాలి. విద్యార్థిని ఉత్సాహపరచాలి. పరిశోధన సత్ఫలితా లివ్వడానికి ఈ దృక్పథం సహకరిస్తుంది.

7. తులనాత్మక పరిశోధనలో పరిశోధకుడికీ, పర్యవేక్షకుడికీ రెండు భాషలూ వచ్చి ఉండాలి. ఉదాహరణకు కన్నడతెలుగు కావ్యాలకు సంబంధించి పరిశోధన చేసేటప్పుడు విధిగా కన్నడ భాషాసాహిత్యాలకు సంబంధించిన పరిజ్ఞానం కావాలి. ఆయా సంస్కృతులకు సంబంధించిన అవగాహన ఉండాలి. అయితే కన్నడ భాష రాకపోవడం వల్ల దానికి అనుసంధానంగా ఆ కావ్యానికి సంబంధించిన ఇంగ్లీషులో వచ్చిన అనువాదాలను, వ్యాఖ్యానాలను ఆధారంగా తీసుకొని పరిశోధన చేయడం జరుగుతుంది. మూలంలోని విషయాలను సరిగా తెలుసుకోకుండా పరిశోధన చేయడం సత్యావిష్కరణ కాదు. మూలరచయిత అభిప్రాయాలను, ఉద్దేశాలను అవగాహన లేక సిద్ధాంత వ్యాసం రాస్తే మూలానికి అన్యాయం చేసినట్టవుతుంది.

8. జానపద విజ్ఞానానికి, భాషాశాస్త్రానికి సంబంధించిన పరిశోధనలో క్షేత్రపర్యటన సమగ్రంగా జరగడం లేదు. ఎలా చేయాలో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులున్నారు. అందువల్ల పర్యవేక్షకులు పరిశోధకుడు ఫీల్డ్ వర్క్ చేసే సందర్భంలో ఒకటిరెండుసార్లు మొదట్లో వాళ్ళతో కలిసి వెళ్ళి సరియైన మార్గదర్శకత్వాన్ని వహించాల్సిన అవసరం ఉంది. అలాంటి శిక్షణను పర్యవేక్షకుడు ఇచ్చినట్టవుతే ఉత్తమ సిద్ధాంత వ్యాసాలు వెలుగు చూస్తాయి.

9. పరిశోధకుణ్ణి సక్రమమార్గంలో పెట్టగలిగిన చాకచక్యం పర్యవేక్షణలో ఉండాలి. అన్ని విషయాలలో గైడ్‌గా ఉండాలే కాని, కేవలం సూపర్‌వైజర్‌గా ఉండకూడదు.

10. జానపద సాహిత్యానికి, భాషకు సంబంధించిన అంశాలను పరిశోధకుడు తప్పనిసరిగా వ్యవహర్తల గురించి అనుబంధంలో చేర్చాలి. చేర్చారో లేదో అన్న విషయాన్ని పర్యవేక్షకుడు తప్పక గమనించాలి.

11. థీసిస్‌ను కరెక్ట్‌చేసి ఇచ్చిన తర్వాత వాటిని సరిగ్గా క్యారీ అవుట్ చేశారో లేదో మళ్ళీ గైడ్ తప్పని సరిగా చూడాలి.

12. ఆధార గ్రంథాలను పేర్కొనపుడు అకారాది క్రమాన్ని పాటించాడో లేదో, మెథడాలజీ పాటించారో లేదో పర్యవేక్షకులు గమనించాలి.

13. జానపద సాహిత్య సిద్ధాంతవ్యాసాలు ఈ రోజుల్లో కేవలం సమీక్షా వ్యాసాలుగా మాత్రమే వస్తున్నాయి. ఉదాహరణకు గేయ సాహిత్యానికి సంబంధించిన సిద్ధాంతాన్ని చూస్తే కేవలం యథాతథంగా వ్రాసి పుటలతో నిండిన థీసిస్ లే ఎక్కువగా వచ్చాయి. ఈ పని ఎవరైనా చేయగలరు. ఆ గేయంలో భాషా సంస్కృతులకు సంబంధించిన విషయాలు ఏవి ఉన్నాయో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. పర్యవేక్షకుడు తప్పొప్పుల్ని దిద్దే సమయంలో దీన్ని గమనించాలి.

14. పర్యవేక్షకుడు అక్షరదోషాలను, వ్యాకరణ దోషాలను దిద్దాల్సిన అవసరం ఉంది. సాధారణంగా ఈ దోషాలను డి.టి.పి. వాళ్ళమీద మోపడమో లేదా సమయాభావం వల్ల సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించానని చెప్పడమో జరుగుతోంది.

**అలాగే పరిశోధకుడితోపాటు పర్యవేక్షకుడు కూడ గమనించాల్సిన సాధారణ విషయాలు.**

1. పునరుక్తులు ఉండకూడదు. భాషా విషయంలో, భావవిషయంలో ప్రతిపాద్య విషయంలో, వివేచన విషయంలో జాగ్రత్తపడాలి.

2. బలహీన ప్రతిపాదనలు ఉండకూడదు. చేతకానప్పుడు వదిలేయాలి.

3. అప్రామాణిక విషయాలను ఆధారాలుగా చేర్చకూడదు.

4. పరిశోధనాంశాన్ని ప్రతికూలంగా ప్రతిపాదించకూడదు.

5. తెలియనివాటిని తెలిసినట్టుగా బుకాయించకూడదు.

6. అసమగ్రతను ఆపాదించకూడదు.

7. అందులోకొంత ఇందులో కొంత తీసి అతుకుల బొంతగా చేయకూడదు.

8. చర్వితచర్వణంగా చర్చించకూడదు.

9. మత, వర్గ, స్థల, కుల, లింగ భాషాది దురభిమానాలకు విద్వేషాలకు తావీయకూడదు.

10. ఖండన మండనాలలో ప్రమాణికతను పాటించాలి.

11. భాషలో ప్రయోగించే పదాలు కచ్చితమైన అర్థాన్ని ఇచ్చేట్టుగా ఉండాలి. ద్వంద్వార్థాలనివ్వడం వల్ల అపార్థాలు వస్తాయి.

12. అనవసరంగా పదాలను ప్రయోగించకూడదు అంటే కేవలం అలంకారానికి కానీ, ప్రదర్శనకు కానీ పదాలు వ్యర్థం కూకుండా జాగ్రత్తవహించాలి.

13. పారిభాషిక పదాలను వాటి అర్థాలకు భంగం కలుగకుండా ఉపయోగించాలి.

14. వాక్యాలు వీలయినంత వరకు సరళంగా సమగ్రంగా విషయాన్ని అభివ్యక్తి చేసేట్టుగా ఉండాలి.

**పరిశోధకుడు ఎదుర్కొంటున్న సమస్యలు**

1. పరిశోధనను ఎలా చెయ్యాలో, ఎటువంటి విధానాన్ని అవలంబించాలో తెలియని స్థితిలో నేటి పరిశోధకుడు ఉన్నాడు.

అందువల్లనే విశ్వవిద్యాలయ స్థాయిలో నేడు భాషా సాహిత్య పరిశోధనలు, జానపద విజ్ఞాన పరిశోధనలు చాలావరకు విశ్లేషణా సామర్థ్య లోపం కలిగి ఉన్నాయి. కేవలం సమీక్షవ్యాసాలుగా సిద్ధాంత వ్యాసాలు విశ్వవిద్యాలయాలకు సమర్పింపబడుతున్నాయన్న అభిప్రాయం ఉంది. క్షేత్ర పర్యటన చేయకనే జానపద విజ్ఞానానికి, భాషాశాస్త్రానికి సంబంధించిన సిద్ధాంత వ్యాసాలు రూపొందు తున్నాయి. అందువల్ల వీటికి సంబంధించిన వర్కుషాపుల్ని, సెమినార్లను, అల్పవ్యవధి శిక్షణ కోర్సులను నిర్వహించి పరిశోధకులలో పరిశోధనాసక్తిని కల్గించాల్సిన అవసరం ఉంది. పరిశోధన పద్ధతులు అంటే థీరెటికల్‌గా ఏమీ తెలియక క్షేత్రపర్యటన అంటే ప్రాక్టికల్‌గా తెలియక పరిశోధకులు ఇబ్బంది పడడం జరుగుతుంది.

**సత్యాన్వేషణమే పరిశోధన.** పరిశోధనకు నిబద్ధత అవసరం కనుక అందుకోసం క్షేత్రస్థాయిలో పర్యటించడం జానపదవిజ్ఞాన, భాషాపరిశోధకులకు తప్పనిసరి. నేరుగా వ్యక్తులనుండి సేకరించే సమాచారం ప్రైమరీ డేటా. పుస్తకాలు, సంచికల నుండి సేకరించే సమాచారం సెకండరీ డేటా. అందువల్ల క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించడానికి ఓపిక, నేర్పు, పట్టుదల, అవగాహన, పరిశీలన ప్రధానంగా ఉండాలి.

2. విశ్వవిద్యాలయ విభాగాల్లోను తక్కిన పరిశోధన సంస్థలలోను ఏయే విషయాల మీద పరిశోధనలు జరిగాయో తెలియక పోవడం పరిశోధకుడు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. దీనివల్ల పరిశోధన విషయాలు పునరుక్తం కావడం లేదా పరిశోధించాల్సిన విషయాలు స్పృశింపబడక పోవడం జరుగుతోంది. ఈ దిశలో ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారి **'విశ్వవిద్యాలయాలలో తెలుగు పరిశోధన'** గ్రంథం ఉపయుక్తంగా ఉంది. ఇది నివారింప బడాలంటే ఆయా విభాగాలు, సంస్థల మధ్య ఇంటరాక్షన్, ర్యాపోర్ట్ ఉండాలి.

3. విశ్వవిద్యాలయ విభాగాల్లోను, పరిశోధన సంస్థల్లోను వ్యక్తుల మధ్య స్పర్థలు, మనస్పర్థల వల్ల పరిశోధకుడు పరిశోధన విషయం లోను, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించడంలోను కొన్ని సమస్యల్ని ఎదుర్కొనడం జరుగుతోంది. ఇది నివారింపబడాలంటే కొన్ని ఆంక్షలు, నియమ నిబంధనలు విధింపబడాలి.

4. పరిశోధకుడికి ఎదురవుతున్న మరొక ముఖ్యమైన సమస్య ఆర్థిక సమస్య. అందువల్ల పరిశోధనలు పూర్తికాక అర్థాంతరంగా నిలిచిపోవడం జరుగుతుంది. ఇది నివారింపబడాలంటే విశ్వవిద్యాలయాలు, పరిశోధక సంస్థలు విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం సకాలంలో పరిశోధకులకు ఆర్థిక సహాయ సహకారాలను అందించాలి.

5. గ్రంథాలయాల నిర్వహణ తృప్తికరంగా లేకపోవడం పరిశోధకుడి మరో సమస్య. గ్రంథాలయాల్లో పుస్తకాలు, పత్రికలు, రిపోర్టులు సరియైన స్థలంలో ఉంచకపోవడం వాటి గుర్తింపు సంఖ్యలను సరిగా వేయకపోవడం, గ్రంథాలను తారుమారు చేయడం వల్ల పరిశోధకుడు వీటిని వెదకడంలోనే తన కాలాన్ని, శక్తినీ వ్యర్థం చేస్తున్నారు. ఇది నివారింపబడాలంటే గ్రంథాలయ నిర్వహణ సక్రమంగా జరగడంతో పాటు అవసరమైన గ్రంథాలయ సిబ్బందిని ఆయా సంస్థలు నియమించాలి.

6. గ్రంథాలయాలలోని అనేక గ్రంథాలు, పత్రికలలోని కొన్ని పేజీలకు పేజీలే మాయం కావడం పరిశోధకుడు ఎదుర్కొంటున్న మరోసమస్య అయితే, జిరాక్స్ కాపీలను తయారుచేసే యంత్రాలు ఉన్నా అవి సరిగ్గా పనిచేయకపోవడం, జిరాక్స్ యంత్రాలను నిర్వహించే సిబ్బంది లేకపోవడం పరిశోధకుడు ఎదుర్కొంటున్న ఇంకోసమస్య. ఈ సమస్యలు నివారించపడాలంటే గ్రంథాలను, గ్రంథాలలోని పుటలను తస్కరించకుండా సిసి టివిలను అమర్చాలి.

**ఉత్తమ పరిశోధకుడి లక్షణాలు :**

1. పరిశోధకుడు న్యాయాధీశుడిలా పనిచేస్తూ సత్యాన్ని బహిర్గతం చెయ్యాలే కాని, న్యాయవాదిలాగ కేవలం తన ఫిర్యాదుదారుడికోసం వాదాన్ని ప్రతిపాదించేటట్టుగా ఉండకూడదు. అంటే తన పరిశోధన ఫలితాలను యథార్థంగాను, నిర్భయంగాను వెలువరించాలి.

2. పరిశోధకుడికి శాస్త్రీయ దృక్పథం ఉండాలి. పరిశోధన రీతుల్ని పాటించాలి. కేవలం పరిశోధన కోసమో, డిగ్రీకోసమో పరిశోధన చెయ్యకూడదు. పరిశోధన చెయ్యదలచుకొన్న విషయంమీద సంపూర్ణమైన జ్ఞానం అధికారం ఉండాలి. ఈ జ్ఞానం ప్రశ్నావళులను తయారు చేయడానికి సందర్శపద్ధతికి (ఇంటర్వ్యూ) ఉపకరిస్తుంది.

3. పరిశోధకుడికి ఆలోచించే సామర్థ్యం ఉండాలి. స్వశక్తిమీద ఆధారపడి పరిశీలించే శక్తి కావాలి.

4. పరిశోధకుడికి సత్యాన్వేషణే ప్రధానం కాబట్టి ఎన్ని ఆటంకాలు, ఒడిదుడుకులు ఏర్పడ్డా సహనాన్ని కోల్పోకూడదు.

5. పరిశోధకుడు విషయాన్ని వెంటనే అవగాహన చేసుకునే స్థితిని కలిగి ఉండాలి. సందర్భాన్ని అనుసరించి ప్రతిక్రియను చూపాలి.

6. పరిశోధకుడు తన సిద్ధాంత ప్రతిపాదన విషయంలో స్పష్టతను కలిగి ఉండాలి.

7. తాను చేస్తున్న పరిశోధన విషయం మీద వ్యక్తిగతమైన అభిరుచి, ఆసక్తి కలిగి ఉండాలే కాని, ఎవరి ఒత్తిడి మీదనో పరిశోధనను చేపట్టకూడదు. స్వేచ్ఛగా పరిశోధించడానికి పూనుకోవాలి.

8. క్షేత్రకార్యానికి సంబంధించి పరిశోధన చేసే వాళ్ళు ముఖ్యంగా వ్యవహర్తలతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉండాలి. ఇది వ్యవహర్తల నుండి సరియైన సమాచారాన్ని సేకరించడానికి దోహదం చేస్తుంది.

9. పరిశోధకుడికి కృషి అవసరం. తన పరిశోధనకు సంబంధించి అనేక గ్రంథాలను, పత్రికలను, వ్యాసాలను చదవాలి. వాటి సారాంశాన్ని ఒంటబట్టించుకోవాలి.

10. భాషమీద అధికారం, వివిధ విజ్ఞానాల మీద పరిచయం ఉండాలి.

**ఉత్తమ పరిశోధన లక్ష్యాలు :**

1. పరిశోధన శాస్త్రీయంగా జరగాలి. 2. పరిశోధన ఉద్దేశం స్పష్టంగా చెప్పబడాలి. 3.పరిశోధన విషయంలో పరిశోధకుడు అవలంబించిన విధానం వివరింపబడాలి. ఇది తర్వాతి పరిశోధకులకు మార్గదర్శకం అవుతుంది. అంటే ఈ పరిశోధనను మరింత అభివృద్ధి పరచడానికి దోహదం చెయ్యడమేకాకుండా, ఈ పరిశోధనను ముందుకు కొనసాగించడానికి సహకరిస్తుంది. 4. పరిశోధన ఫలితాలు యథార్థంగానూ, దాపరికం లేకుండానూ నిర్భయంగానూ చెప్పబడాలి.

**పరిశోధకుడు గమనించాల్సిన అంశాలు / తీసుకోవాల్సి జాగరూకతలు / మెలకువలు :**

1. పరిశోధనను ప్రారంభించడానికి ముందు తన పరిశోధనాంశం ఎంతవరకు ఉపకరిస్తుంది? దీనివల్ల సమాజానికి కలిగే ఉపకారం ఏమిటి? అన్న ప్రశ్నను వేసుకొని పరిశోధనాంశాన్ని ఎంపిక చేసుకోవాలి. ఇంటర్వ్యూలకు వెళ్తే విషయ నిపుణులు అడిగే ప్రశ్నలలో ఇది తప్పకుండా ఉంటుంది.

2. పర్యవేక్షకుడితో సంప్రదించిన తర్వాతే పరిశోధనాంశాన్ని నిర్ధారించుకోవాలి. ఒకవేళ అదే పరిశోధన అంశానికి సంబంధించి ఇంతకుముందే ఎవరైనా పరిశోధన చేసి వుంటే లేదా చేస్తుంటే పరిశోధకుడు తీసుకొన్న పరిశోధనాంశం ఏవిధంగా విభిన్నంగా ఉందో లేదా ఉంటుందో తెలియజేయాలి.

3. పరిశోధనాంశాన్ని ఎంపిక చేసుకొనే సమయంలో ఎవరి ఒత్తిడులకూ లోను కాకూడదు. పరిశోధన చేయాల్సింది పరిశోధకుడే కాబట్టి బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

4. కవిని కానీ, రచయితను కానీ వాళ్ళ కావ్యాలను కానీ, రచనలను కానీ విమర్శించే ముందు లేదా విశ్లేషించే ముందు అంతకు ముందు ఆ పరిశోధనాంశంమీద పరిశోధనలు చేసిన వాళ్ళు ఏమి చేప్పారో కోట్ చేస్తూ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పాలి.

5. రచయిత శైలి అబ్జెక్టివ్‌గా అంటే పరాశ్రయంగా లేక వస్త్వాశ్రయంగా ఉండాలి కాని సబ్జెక్టివ్‌గా అంటే ఆత్మాశ్రయంగా ఉండకూడదు. సాధ్యమైనంత వరకు 'నేను' అనే మాటను ఎక్కువగా ఉపయోగించ కూడదు.

6. **'ఒక గ్రంథంలోని విషయాలను గ్రహిస్తే చౌర్యం. పది గ్రంథాలోని సమాచారన్ని సంగ్రహిస్తే పరిశోధన'** అనే ఆభాణకం లోకంలో వ్యాపించింది. అందువల్లనే తీసితీసి వ్రాస్తే థీసిస్ అనికూడా రూఢి అయింది. అవసరమనిపించి తీసితీసి వ్రాసినా కోట్ చేయాలి. రిఫరెన్స్ ఇవ్వాలి. అలా రిఫెరెన్స్ ఇచ్చినపుడు, ఈ వాక్యాలు నావికావు అనీ, ఫలానా పుస్తకంలోంచి తీసి వ్రాశానని మీ నిజాయితీని నిరూపించుకోవడానికి ఆస్కారం ఉంటుంది.

7. మూల రచయితకంటే బాగా చెప్పలేను అనుకున్నపుడు ఆ మూల రచయిత మాటల్నే కొటేషన్‌లో పెట్టాలి. లేదా ఆ రచయిత మాటల్నే మీ మాటల్లో వివరించి, ఫలానావాళ్ళు ఇలా అభిప్రాయ పడ్డారని వాళ్ల పేర్లను పేర్కొనాలి.

8. ముగింపులో ఎలాంటి అసందిగ్ధతతో కూడిన మాటల్ని కాని, అసందర్భమైన మాటల్ని కానీ ప్రయోగించకడదు.

9. సాధారణంగా ప్రాచీన కావ్యాలమీద కాని ఆధునిక కావ్యాలమీద కాని పరిశోధన చేసేవాళ్ళు పద్యాలను గుప్పిస్తారు. అలాకాకుండా ఆ పద్యాలలో ఉన్న సారాంశాన్ని వివరించి ఆ పద్యాలను అనుబంధాలలో తోసెయ్యాలి. అలాగే జానపద గేయాల మీద పరిశోధన చేసే వాళ్ళు కూడ పుటలకొద్దీ గేయాలను ఉదాహరిస్తారు. అలాకాకుండా గేయాల సారాంశాన్ని తెలిపి, ఉటంకించాల్సిన గేయాలను అనుబంధంలో చేర్చాలి.

10. కవుల మీద, రచయితల మీద, జానపద సాహిత్య లేదా జానపద విజ్ఞానం మీద పరిశోధనలు చేసేవాళ్ళు విధిగా ఆయా వ్యక్తుల్ని ముఖాముఖిచేసి వారి అభిప్రాయాల్ని తీసుకోవాలి. అవి భావి పరిశోధకులకు ఉపకరిస్తుంది.

పరిశోధకుడికి శ్రమ – పరిశ్రమ; ఓర్పు – నేర్పు; శ్రద్ధ, పట్టుదల, ఆసక్తి, ఉత్సాహం, ఆత్మ విశ్వాసం, అంకితభావం, దృఢ సంకల్పం అవసరం. అన్నింటికంటే ఎక్కువగా పరిశోధకుడు పరిశోధనను ఇష్టపడిచేయాలి.

11. పరిశోధనాక్షేత్రంలో వ్యక్తులు నిమిత్తమాత్రులు. సత్యప్రకటనే ముఖ్యం. పరిశోధన అనేది సత్యాన్వేషణాపరుడైన ఒకవ్యక్తి చేసే ప్రామాణిక ప్రయత్నం. ఇలాంటి ప్రయత్నాలు చేసేవారే నిజమైన పరిశోధకులు. సమాజ పురోగమనానికి పరిశోధనలే ప్రాణం.

12. గ్రంథాలయాలకు వెళ్తే నోట్స్ రాసుకోవాలి. సాధారణంగా చిన్న చీటీలు లేదా రీసర్చ్ కార్డులను ఉపయోగించాలి.

+ ప్రతికార్డులోను అది ఏ విషయానికి సంబంధించిందన్న అంశాన్ని సూచించడానికి ఒక శీర్షికను పెట్టుకోవాలి. సంక్షిప్తంగా, సూచ్యంగా ఉండాలి. అందులో స్పష్టత ఉండాలి.

+ కార్డు పై భాగం చివర్లో రచయిత లేదా సంపాదకుని పేరు, అచ్చయిన సంవత్సరం పుట సంఖ్య ఉండాలి.

+ అలాగే కార్డులో మరో చివర ఎప్పుడు ఎక్కడ ఏరోజు ఆ విషయాన్ని సేకరించామో తేదీ, సమయం వ్రాసి పెట్టుకోవాలి.

సాధారణంగా మనం గ్రంథాలయాలకు వెళ్తే పేపర్లలో మనకు కావలసిన విషయాలను వ్రాసుకొని వస్తాము. మళ్ళీ మనకు అవసరం వచ్చినపుడు ఎక్కడ వాటిని సేకరించామో మనకు గుర్తు రావడం కష్టం. అందువల్ల ఇలా కార్డులలో వ్రాసుకోవడం వల్ల సిద్ధాంత వ్యాసరచనసమయంలో ఫుట్‌నోట్స్ వ్రాయడంలోను, ఆకర గ్రంథాలను సూచించడంలోను సహకరిస్తాయి.

13. పరిశోధన సమయంలో వీలైనంతవరకు పరిశోధనకు సంబంధించిన వ్యాసాలను వ్రాసి ప్రచురించాలి. ఇవి సిద్ధాంత వ్యాసరచన సమయంలో బాగా ఉపయుక్తమవుతాయి. అంతేకాదు భాషా విషయంలో పరిశోధకుడు ఎలాంటి తప్పులు చేస్తున్నాడో, ఎలా వ్రాయాలో, శైలి ఎలా ఉండాలో తెలుసుకొని లోపాల్ని సవరించుకొని సిద్ధాంత వ్యాసాన్ని తప్పులు లేకుండా వ్రాయడానికి దోహదం చేస్తుంది.

14. అలాగే ముద్రితాముద్రిత సిద్ధాంత వ్యాసాలను చదువుతూ ఉండడం వల్ల సిద్ధాంతవ్యాసాన్ని ఎలా వ్రాయాలో స్పష్టత కలుగుతుంది.

15. వాక్యాల్లో అక్షరదోషాలు లేకుండా అన్వయ దోషాలు ఎక్కువ ఉంటాయి. వాటిని సరిదిద్దుకోవాలి.

16. 'ముగింపు' ను అధ్యాయంగా పేర్కొనాల్సిన అవసరం ఉండదు. అలాగే 'సింహావలోకనం' అన్న అంశాన్ని కూడా.

17. ఉపయుక్త గ్రంథాలను అనుబంధంగా పేర్కొనకూడదు.

18. రచయిత లేదా కవి ముద్రిత, అముద్రిత, అలభ్యగ్రంథాలను అనుబంధంలో పేర్కొంటే మంచిది.

19. గ్రాంథిక, వ్యావహారిక భాషల్ని కలగలిపి సిద్ధాంత వ్యాసరచన చేయకూడదు.

20. విషయసూచికలో పుటల సంఖ్యలను ఇవ్వాలి.

21. అవగాహనలోపం చాలా సిద్ధాంత వ్యాసాలలో కన్పిస్తుంది. బుర్రకథలో తబలా, హార్మోనియం వంటి వాద్యాల్ని ఉపయోగిస్తారనడం సరికాదు.

22. జరిగిన పరిశోధనలమీదే అంటే అవే అంశాలమీద పరిశోధనలు జరిగాయి. అలా పరిశోధనలు పునరుక్తాలయ్యాయి.

23. జానపద సాహిత్యానికి సంబంధించి కథకుల వివరాలతో పాటు కథకులు కథ చెప్పేతీరు ఉన్న ఫోటోలను, శ్రోతలు కూర్చొని వినే ఫోటోలను జతచేస్తే బాగుంటుంది.

24. పరిశోధకుడు ఎవరిమీద పరిశోధన చేస్తున్నాడో అంటే కవులు, రచయితలు, నవలాకారులు, కథకులు, విమర్శకులు, పరిశోధకులు మొదలైన వారు వారిని సందర్శించి, ఇంటర్వ్యూచేసి సిద్ధాంత వ్యాసం అనుబంధంలో పొందుపర్చాలి.

25. ఏదైనా నవాలాకారుని నవలలను గురించి సిద్ధాంత వ్యాసాన్ని రాసేటపుడు మళ్ళీమళ్ళీ నవలల పుట్టుపూర్వోత్తరాలను చెప్పాల్సిన అవసరం ఉండదు. దానికోసం మొత్తం అధ్యాయాన్ని కేటాయించాల్సిన అవసరం లేదు.

26. కవర్ పేజీ మీద 'సిద్ధాంతగ్రంథం' అనీ లోపలి పేజీల్లో సిద్ధాంత వ్యాసం' అని రాస్తుంటారు. ఏదో ఒకటి వ్రాయాలి.

27. కృతజ్ఞతలు పరిమితంగా ఉండాలి. పరిశోధనలో తోడ్పడిన వాళ్ళ పేర్లు మాత్రమే రాస్తేచాలు. ఉదాహరణకి తన పరిశోధనకు సంబంధించిన వివరాలను, పుస్తకాలను ఇచ్చి ప్రోత్సహించి వాళ్ళను, గ్రంథాలయాధికారులను, జానపద వ్యవహర్తలను విధిగా పేర్కొనాలి. అంతేకాని ఇంట్లో వాళ్ళను, బంధుమిత్రులను, మనుమళ్ళను, మనుమరాళ్ళను గురించి చెప్పాల్సిన అవసరం ఉండదు.

28. జానపద సాహిత్యానికి సంబంధించిన సిద్ధాంతవ్యాసాల్లో సాహిత్యానికి సంబంధించిన వివరాలే ఉండాలికాని, ప్రదర్శన కళారూపాలకు లేదా ఇతర ప్రక్రియలకు సంబంధించిన అంశాలను చేర్చాల్సిన అవసరం లేదు.

29. అనుబంధంలో ముఖ్యపదకోశం చేర్చాలి. (జానపద, గిరిజన విజ్ఞానాలు, భాషా మాండలికాలు, తులనాత్మక అధ్యయనాంశాలు ఇత్యాది)

30. సిద్ధాంత వ్యాసంలో పునరుక్తులను పరిహరించాలి.

31. అనువాదాలకు సంబంధించి మూలాన్ని కూడా ఇవ్వాలి.

32. కావ్యాలలోని కేవలం ఘట్టాలను మాత్రమే పరిచయం చేస్తే ప్రయోజనం లేదు. వ్యాఖ్యానించాలి. విశ్లేషించాలి.

**తెలుగులో పరిశోధన**

తెలుగులో పరిశోధన భాషమీద **డా. చిలుకూరి నారాయణరావు గారితో** ప్రారంభమైంది. తెలుగులో మొట్ట మొదటి పిహెచ్.డి. పట్టాన్ని పొంది 'పరిశోధక పితామహులు'గా వాసికెక్కారు డా. చిలుకూరివారు. **'పదునొకండవ శతాబ్దమునాటి తెనుగుభాష'** అనే అంశం మీద ఆంగ్ల భాషలో సిద్ధాంతవ్యాసం వ్రాసి 1928 లో మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఆ తర్వాత చాలాకాలానికి, అంటే 1958లో తెలుగులో సాహిత్యశాఖలో మొదటి పిహెచ్.డి. పట్టాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి పొందినవారు డా. జి.వి. కృష్ణారావు గారు. వీరి సిద్ధాంతవ్యాసం కళాపూర్ణోదయానికి సంబంధించింది. తెలుగు జానపద సాహిత్యంలో మొదటి పిహెచ్.డి. పట్టం 1956లో డా. బిరుదురాజు రామరాజుగారికి దక్కింది. వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారి పర్యవేక్షణలో 'తెలుగు జానపద సాహిత్యం' మీద పరిశోధన చేశారు. తెలుగువాళ్ళకి భారత రామాయణాల మీద ఉన్న మమకారం మరి అనేక సిద్ధాంత దేనిమీద లేదనిపిస్తుంది. కవిత్రయానికి సంబంధించి అనేక సిద్ధాంత

వ్యాసాలు వచ్చాయి. మహాభారతంలోని వివిధ అంశాలమీద, రామాయణం తర్వాత లోని వివిధ విషయాలమీద పరిశోధనలు జరిగాయి. కవిత్రయం శ్రీనాధుడి మీద పరిశోధకులు ఎక్కువ మక్కువ చూపారు.

కవులమీదా, వాళ్ళ కావ్యాల మీదా ప్రత్యేకంగా పరిశోధనలు జరిగాయి. మరీ లోతుగా పెళ్ళి ఆ కావ్యాలలోని రస, అంకారాలు, ఛందస్సు, ధ్వని, సామాజిక జీవనం, కవితారీతుల్ని వెలికి తీశారు.

తెలుగు వాఙ్మయంలో ఒక్కొక్కశాఖ ఉత్పత్తి వికాసాలకు సంబంధించి పిహెచ్.డి.లు వచ్చాయి. ఆంధ్రప్రబంధాల గురించీ, ద్విపద వాఙ్మయానికి సందింధించీ, వచనం, శతకం, నాటకం, నవల, కథానిక, వ్యాసం, ఏకాంకిక మొదలైన సాహిత్య ప్రక్రియలమీదా పరిశోధనలు ముమ్మరంగా జరిగాయి; జరుగుతున్నాయి. అలాగే రచయితల మీదా, వాళ్ళ రచనలమీదా లెక్కకు మిక్కుటంగా పిహెచ్.డి., ఎం.ఫిల్., డిగ్రీలు వచ్చాయి.

తెలుగుసాహిత్యం మీద ఇతర భాషా సాహిత్యాల ప్రభావం, ఉద్యమాల ప్రభావాన్ని నిరూపించే సిద్ధాంత వ్యాసాలు వచ్చాయి. ఉదాహరణకి తెలుగు సాహిత్యం మీద ఇంగ్లీషు ప్రభావం, తెలుగుమీద కన్నడ భాషా ప్రభావం, తెలుగు సాహిత్యము – నవ్య సూనవతావాదం ఇత్యాది.

ఆధునిక గేయసాహిత్యం మీద అనేక సిద్ధాంత వ్యాసాలు వచ్చాయి. ఆధునిక కవులమీద, వాళ్ళ గేయ కావ్యాలమీద, ఆ కావ్యాలలోని ప్రతీకల మీద, సాంఘిక విషయాలమీద పరిశోధనలు జరిగాయి; జరుగుతున్నాయి.

నేడు జానపద విజ్ఞాన ప్రక్రియలమీద, తులనాత్మక పరిశీలనల మీద విశేషంగా పరిశోధనలు జరుగుతూ ఉండడం గమనించదగ్గది. 'యక్షగానం, వీరగాథలు, జానపదగేయాలు, స్త్రీల పాటలు, కళలు, సామెతలు, పొడుపు కథలు మొదలైన ప్రక్రియలమీద సిద్ధాంత వ్యాసాలు వచ్చాయి. ఆయా ప్రాంతాలకు చెందిన జానపద విజ్ఞాన ప్రక్రియలకు సంబంధించి ఒక్కొక్క విషయంమీదా పరిశోధనలు జరుగుతుండడం హర్షించదగ్గ విషయం.

తులనాత్మక పరిశీలనకు సంబంధించి మొదట్నుంచీ సంస్కృత కావ్య పురాణాలతో తెలుగు గ్రంథాల తులనాత్మక పరిశీలన జరుగుతూనే వుంది. అలాగే ఇతర భాషా కావ్యాలతో ఆంధ్ర కావ్యాల తులనాత్మకాధ్యయనం జరిగింది. ఉదాహరణకి పారిజాతాపహరణ, జగన్నాథ విజయ కావ్యాలు, వేమన సర్వజ్ఞులు, కంది రంగనాథ రామాయణాలు విశ్వనాథ, కు.వెం.పుల రామాయణాలు మొదలైనవి. అలాగే జానపద సాహిత్యానికి సంబంధించి తెలుగు కన్నడ గేయాలు, తెలుగు కన్నడ సామెతలు, తెలగు కన్నడ పొడుపుకథలు, తెలుగు మలయాళ సామెతలు మొదలైన అంశాల మీద పరిశోధనలు జరిగాయి.

ఆంధ్రదేశంలోని భాషా సాహిత్యాలమీదే కాక కర్నాటక, తమిళనాడులలోని భాషా సాహిత్యాలమీద కూడ పరిశోధనలు జరిగాయి; జరుగుతున్నాయి. పరిశోధన తొలిదశలో వచ్చిన సిద్ధాంత వ్యాసాల్లో పరిశోధన రీతులకు (Research Methodology) ప్రాధాన్యం అంతగా కన్పించదు . కేవలం పాండిత్య ప్రకర్ష కన్పిస్తుంది. అయితే నేడు పరిశోధన రీతులకు ప్రాధాన్యం అధికంగా ఇవ్వబడుతోంది. పరిశోధనకు శాస్త్రీయావగాహన నేడు కల్పించబడింది. ఆంధ్ర, ఆంధేతర ప్రాంతాలలోని అనేక విశ్వవిద్యాలయాల్లోని తెలుగు విభాగాల్లో పరిశోధనావకాశాలు ఉన్నాయి. బెంగుళూరు, మద్రాసు, మధురై, బెనారసు, ఆలిఘర్, ఢిల్లీ మొదలైన తెలుగు విభాగాల్లో సైతం పిహెచ్.డి., ఎం.ఫిల్. డిగ్రీలు రావడం హర్షించదగ్గ విషయం.

విషయవైవిధ్యంతో కూడుకున్న అనేక సిద్ధాంతవ్యాసాలు తెలుగులో వచ్చాయి, వస్తున్నాయి. ఛందస్సు మీద, శాసనాలమీద, వ్యాకరణాలమీద సిద్ధాంత వ్యాసాలు వచ్చాయి. మొదట్లో సిద్ధాంత వ్యాసాలు ఇంగ్లీషులోనే వ్రాయబడుతుండేవి. ఆ తర్వాత గ్రాంధికమైన తెలుగు భాషలో రచింపపబడ్డాయి. నేరు చాలావరకు అన్ని విశ్వవిద్యాలయాల్లో వ్యావహారిక భాషలోనే రచింపబడుతున్నాయి.

తెలుగులో పరిశోధన అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి దోహదం చేసిన ప్రఖ్యాత పండితులు ఉన్నారు; ప్రసిద్ధ పరిశోధన సంస్థలు, గ్రంథాలయాలు ఉన్నాయి. మెకంజీ, బ్రౌన్, కాల్డ్వెల్, బోయల్, వీరేశలింగం పంతులు, కట్టమంచి రామలింగా రెడ్డి, మానవల్లి రామకృష్ణకవి, కొమర్రాజు లక్ష్మణరావుపంతులు, వేటూరి ప్రభాకరశాస్త్రి, సురవరం ప్రతాపరెడ్డి, వేదం వేంకటరాయశాస్త్రి, ఖండవల్లి లక్ష్మీరంజనం మొదలైన మహనీయులు కృషి చేశారు; పరిశోధకుల్ని ప్రోత్సహించారు.

సరస్వతీ మహల్ గ్రంథాలయం, ఆంధ్రేతిహాస పరిశోధకమండలి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం, ఆంధ్ర రచయితల సంఘం, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం, వేటపాలెం గ్రంథాలయం, గౌతమీ గ్రంథాలయం మొదలైనవన్నీ పరిశోధకులకు ఎనలేని సామగ్రిని చేకూర్చి ఇచ్చాయి; ఇస్తున్నాయి. ఇలా తెలుగులో పరిశోధన వికాసాన్ని పొందుతూనేవుంది. ఇలా తెలుగులో పరిశోధన వికాసాన్ని పొందుతూనే ఉంది.

**పరిశోధనకు సంబంధించిన ఇంగ్లీషులోను, తెలుగులోను వచ్చిన పుస్తకాలు పరిశోధకులు తప్పక పరామర్శించాల్సిన గ్రంథాలు**

1. పరిశోధన పద్ధతులు – ఆచార్య గంధం అప్పారావు, ఆచార్య కాళిదాసు సూర్యనారాయణ.

2. పరిశోధన – హరిహరప్రియ (డా. చిదానందమూర్తి కన్నడ గ్రంథం సంశోధనె కు అనువాదం)

3. పరిశోధన విధానం – డా. ఎస్.జయప్రకాశ్

4. పరిశోధన పద్ధతులు – డా. ఆర్వీయస్ సుందరం

5. ప్రామాణిక పరిశోధన విధివిధానం – ఆచార్య రఘుమన్న

6. పరిశోధనోత్సవం – ఆచార్య ఎస్వీ రామారావు

7. తెలుగు సాహిత్యము – పరిశోధన – డా. ఎం. కులశేఖరరావు

8. తెలుగు పరిశోధన రజతోత్సవ సంచిక – ఆం.ప్ర.సాహిత్య అకాడెమి

9. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన– డా.వెలుదండ నిత్యానందరావు

10. పరిశోధన సామగ్రి సేకరణ – డా.జి.ఎస్.మోహన్

11. విశ్వవిద్యాలయాలు – పరిశోధన – డా. ననుమాస స్వామి

12. తెలుగు పరిశోధన సంచికలు – సం. వాసిలి వసంతకుమార్ (1987 నుంచి 1989 వరకు వచ్చిన సంచికలు)

13. జానపద విజ్ఞానంలో పరిశోధనలు – సంక్షిప్త వివరణ – ఫాసిల్స్ – దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ

14. సాహిత్య పరిశోధన సూత్రాలు – రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, హెచ్.ఎస్.బ్రహ్మానంద.

**ఆంగ్ల గ్రంథాలు :**

1. Thesis and Assignment Writing - Janathan Anderson, Berry H. Dhrston, Millicent poole.

2. Research methodology - Methods & Techniques - C.R. Kothari

3. Research Methodology in Social Scinces - Dr. N. Thanulingam

4. Social Survey & Investigation - Dr. K. Kumar

5. MLA Hand Book For Writers of Research papers - Joseph Gibaloli, Walter S.Achtert

6. A Guide to field Study - Sankarsen Guptha

7. Methods in Social Research - Goode & Hatte

ఈ పుస్తకాలను పరిశోధక విద్యార్థి మిత్రులు తప్పక చదవాల్సిన అవసరం ఉంది.

---

# జయ జగన్మాతా..

**ఆచార్య శ్రీవత్స**

**తిరుపతి, ఫోన్ : 9000 324 024**

**శ్రీ లలితా త్రిపుర సుందరి**

సీ. అవ్యాజ ప్రేమమే ఆనందరూపిణీ !
అఖిల ధాత్రికి పంచు అంబ వీవు;
చందురు వర్ణుని అందచందమ్మును
పోలు జగన్మాత ! ప్రోది చేయి;
ధర్మ ప్రవర్తన – ధాత్రిలో కలిగింప
జాగృతి సల్పవే ! శ్యామలాంబ !
మానవత్వమ్ము నే – మానవాళికి నేర్పు
తత్త్వ ప్రదాయిని – తనరు నట్లు;
కల్మష నాశిని ! కరుణార్ద్రభావమ్ము
లోకాన కరువాయె– రుచులు నింపు ;
మురియు 'శ్రీలలితా త్రిపురసుంద
రీ' మమ్ము రక్షించు – లేడికంటి !
సగుణ సాకార రూపమ్ము సంజ్ఞకాగ !
నిఖిల చిన్మయ రూపిణీ ! నేర్పు మీర
మూర్ఖ తతులను బ్రోవవే ! మోదమలర;
విశ్వ ప్రేమల నందించు – వినుతి జేతు !
(ప్రోది చేయి = పోషించు; సంజ్ఞ = జ్ఞానము; చైతన్యము)

**శ్రీమహాలక్ష్మీ దేవి**

చైతన్యదీపమై – 'చారుమతి'ని గన్న
దుఃఖ నివారిణి ! తులకరించు
జ్యోతి స్వరూపిణి! – శోభిల్లు కాంతితో
ధ్వాంతమ్ము జగతిలో వమ్ము జేయి;
దారిద్ర్య బాధలున్ దనరంగ పోకార్చి
జనతకు బలమిచ్చి సవదరించు;
సౌజన్య లక్ష్మివి – సౌభాగ్యసంపదల్
కలిగింప రాగదే ! కమ్రఫణితి;
వరలు ప్రాపంచిక వాంఛలున్ దీర్పగ
'శ్రీ మహాలక్ష్మి' వై సిరులనిమ్ము !
తే.గీ. ప్రకృతి తత్త్వమై విలసిల్లి పరిమళించి;
పాడిపంటల సౌఖ్యమ్ము పరగ జేయి;
భారతావని భయపడి బాధలొంద
తీవ్రమైన 'కరోనాను' తేర్చుమింక;
'కలిమి గుబ్బెత'! నిరతమ్ము కనికరించు;
(ధ్వాంతము = చీకటి, అజ్ఞానము; తేర్చుము = పోగొట్టుము; పోకార్చు = పోగొట్టు; కలిమిగుబ్బెత = లక్ష్మి)

# జయ జగన్మాతా..

ఆచార్య శ్రీవత్స
తిరుపతి, ఫోన్ : 9000 324 024

శ్రీ సరస్వతీ దేవి

సర్వశుభంకరి ! సౌభాగ్యదాయిని !
అసుర సంహారిణి ! ఆదుకొమ్మ !
ధనురాశిలో నున్న తనరు మూలా నభ
స్పదమందు జన్మించి - పాదవినావు !
సత్య స్వరూపిణీ ! సాధకులనుగని
జ్ఞానామృతమ్ముతో - సవదరించు;
విద్యావ్యవస్థయే - వికలమై పోవంగ
గురువుల బ్రతుకులు - కోలుపడియె;
విద్యార్థి తతులకు- విజయమ్ము చేకూర్చు
చదువుల తల్లివి, శారదాంబ!
అజ్ఞాన తిమిరమ్ము సంతరింపగ జేయి
శాంతి ప్రదాయిని - సంస్మరింతు
తే.గీ. సుగుణకారిణి ! వాగ్దేవి ! శుక్ల దేవి !
శుంరతతులకు నిరతము స్ఫూర్తి నొసగు;
ఈ శరద్వేళ లలితమైయింపులొదవ
అంజలింతును తవణించు మంజువాణి !

(నభస్పదము = నక్షత్రము; పొదలినావు = నివసించినావు; సంతోషించు; పుష్పించు; కోలుపడియె = నశించిపోవు; తవణించు = కలిగించు)

శ్రీ దుర్గామాత

సీ. జ్ఞాన ప్రతీకయై శరదృతువున విల
సిల్లిన శక్తులు - చకిలించ;
శమదమాది గుణ శ్రీ సంపదల నొసంగి
సకల జీవతతికిన్ - శాంతికూర్చు;
మూల పుటమ్మవు - ముగురమ్మలకు నీవు
భారత స్త్రీలకు - ప్రాభవమ్ము
కల్గింప రాగదే ! కరుణాంతరంగవు ;
దాక్షాయణీ ! విరుదయను జూపు;
తే.గీ. స్వర్ణ కవచమ్ము ధరియించి వన్నెమీఱ
ఆశ్వయుజ వాజమందున అలరి రావు;
విజయవాటిక యందున వినుతిగొనుచు
అవతరించితివే ! దుర్గ ! అవఘళింప
సర్వమానవ సౌభ్రాతృ సౌఖ్యములను
అమరు నవ్యాంధ్ర ప్రగతికి యందజేయి;

(చకిలించ = ప్రకాశించగా; వాజము = మాసము)

శ్రీ ఆదిపరాశక్తి

మధుర వచస్వినీ ! మంజుల భాషిణీ !
మమతానురాగాలు - మంపు జేయి;
అసుర సంహారిణీ ! ఆదిపరాశక్తి
వి, మహిషమర్దనీ ! వినుతిజేతు;
సర్వభూతములకు - సాక్షివైన శివాని
లోక కంటకులను - రూపుమాపు ;
'రంభుని' హింసించి లయమును జేసిన
జగదంబవు జనని - సంస్తుతింతు;
ఆ.వె. 'రక్తబీజుని' గని - శక్తి స్వరూపిణి
వై నశింప జేసి - వరలినావు;
ఆశ్రితులను గాచు - ఆనందభైరవి
నిన్ను నమ్మినాను - నీరజాక్షి!

శ్రీ రాజరాజేశ్వరీదేవి

"యత్రనార్యస్తు పూజ్యంతే తత్రరమంతి
దేవతాః" సూక్తికి తేజమివ్వు;
తల్లిగా లాలించి తండ్రిగా పోషించు
'సింహాసనేశ్వరీ' - చేరి కొలుతు;
గురువుగా జ్ఞానమ్ము కోర్కె మీర నొసగు
'శ్రీపురాధీశ్వరీ!' చిత్తగింతు;
నవ్యాంధ్ర ప్రగతికి - నడకలు నేర్పుచు
వైషమ్యభావాలు వమ్ము జేయి;
నవ్యాంధ్ర జగతికి ననువైన మణిపూస
అమరావతిని గాంచి యరయుమమ్మ!
ఆంధ్ర భూమిలో నెలకొన్న ఆపదలను
నాశనమ్ము జేయగరావె నందయంతి !
ఆది మధ్యాంతములు లేక యదరు తల్లి !
మాదు కష్టాలు తొలగించి యాదు కొమ్మ !
తివురు 'రాజరాజేశ్వరీదేవి' యౌచు
విజయ దశ్మికి దీప్తియై విస్ఫురించు
అఖిల భువన సాక్షి ! నిరతమంజలింతు!

(ననువైన = అందమైన; అరయుము = రక్షించు; విస్ఫురించు = ప్రకాశింపజేయుట)

మూసీ సాహిత్యధార
ప్రధాన ప్రసంగం

# పరిశోధనాంశాలు – అధ్యాయ విభజన

**డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి**, తెలుగు అధ్యాపకులు, బి.జె.ఆర్. ప్రభుత్వ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 9866 54 2365

సామాజిక అభివృద్ధిని కోరడం సాహిత్య లక్షణం. సాహిత్యాన్ని సృజించేవారు సమాజంతోపాటు జీవిస్తూ, అందులోని లక్షణాలను పరిశీలిస్తూ, సామాజిక, రాజకీయ, ఆర్థిక, చారిత్రక, సాంస్కృతిక విషయాలతో, తమకుగల సంబంధాలతో పలుమార్లు ఘర్షణలకు గురి అవుతూ కొన్నిసార్లు విభేదిస్తూ, మరికొన్నిసార్లు ఆయా మార్పులను అనుసరిస్తూ కొత్త సాహిత్యాన్ని సృష్టిస్తారు. సాహిత్యాన్ని సృష్టించిన వారిని కర్తగా భావిస్తే, ఆ కర్త సమాజంతో తన రచనను ఏదో ఒకవిధంగా ముడివేసి ఉంటాడు. ఆ రచన అప్పుడు మూడవ రూపంలో లోకానికి లభించినప్పుడు నాల్గవస్థానంలో ఉన్న పాఠకుడు ఆ సాహత్య సృజనలోని అంశాలను అనుశీలనం చేసుకొని తమ జీవితాల్ని మరింత ముందుకు తీసుకువెళ్తాడు. సాహిత్య రస పిపాసిగా ఆనందాన్ని అనుభవిస్తాడు. అప్పుడు ఒకటి కవి లేదా కర్త, రెండు సమాజం, మూడు రచన, నాలుగు పాఠకుడుగా మనం సాహిత్యలోకాన్ని విభజించుకుంటే ఈ నాల్గవది అయిన పాఠకలోకం నుంచే పరిశోధకులు నేడు కనిపిస్తున్నారు.

డా. లక్ష్మీనారాయణగారి మాటలలో **"సాహిత్యం రచయితలో లేదు, గ్రంథంలో లేదు, సమాజంలో లేదు.... పాఠకుడిలో ఉంది"**. అప్పుడు పరిశోధకుడు ముందుగా మంచి పాఠకుడు అయి ఉండాలి. సమాజ దృష్టిని కూడా కలిగి ఉండాలి. సమాజంలోని అనేక అంశాలు చారిత్రక, పురాణవాద, సాంఘిక, విమర్శనాత్మక, వ్యక్తినిష్ఠ పరమైన భిన్నభిన్న విషయాలలో పూర్ణ అవగాహన కలిగి ఉండాలి. ఆ ప్రజ్ఞ కలిగినప్పుడు పరిశోధకుడు ఉత్తమ పాఠకుడిగా రచనలోని అంశాలను; 1. రచయిత దృక్పథంగా గుర్తించగలుగుతాడు 2. సమాజపరంగా విశ్లేషణ చేయగలుగుతాడు 3. అలాగే తనదైన దృక్కోణంనుంచి కూడా పరిశీలన చేసి నిక్కమైన వాస్తవాలను మనముందుంచగలుగుతాడు. అప్పుడు ఈ పరిశోధన ఒక వ్యక్తికోణంలో ముడిపడి ఉండక, సమాజానికి వాస్తవానికి చూపేదిగా వెలుగుతుంది, కలకాలం మనగలుగుతుంది.

పరిశోధన చేయడం కత్తిమీద సాములాంటిది. పరిశోధన అంటే వెల్దండ నిత్యానందరావు ప్రకారం **"సమగ్ర శోధన క్రియ"**. వేదంలో, సత్యం అంటే ఏమిటో చెప్పడానికై ఒక ప్రమాణం ఉంది. **'స్మృతిః ప్రత్యక్షమైతిహ్యం. అనుమానశ్చతుష్టయం....'** – 1. వేదంలో వాచ్య రూపంలో చెప్పబడి ఉండాలి. 2. ప్రత్యక్ష ప్రమాణంగా నిరూపితమై ఉండాలి 3. ఇతిహాసాదులలో శోధింపబడి ఉండాలి. 4. వాదనాపటిమ ద్వారా నిరూపణకు నిలబడి ఉండాలి. అనుమానం అంటే విమర్శన లేక తర్కం ద్వారా నిజాన్ని చెప్పటం. వాచస్పతి మిశ్రుడు తన సాంఖ్య తత్త్వ కౌముది అనే గ్రంథంలో ప్రమాణత్రయాన్ని వివరించే కారికను తెలియజేస్తూ **'దృష్టమనుమానమాప్తవచనం'** (పర్‌సెప్షన్, ఇన్‌ఫరెన్స్ మరియు వెర్బల్ టెస్టిమని) అనేవాటిని సూచించాడు. ఈ మూడింటికి న్యాయశాస్త్రం ఉపమానాన్ని చేర్చింది. వెరసి ఇవి కూడా నాలుగే.

**"విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన"** అనే వెల్దండవారి రచనకు తొలిముద్రణలో పీఠిక (1987)లో ఆచార్య గోపిగారు తన ప్రాతిపదికలో ఇలా అన్నారు.

**"విశ్వవిద్యాలయాల్లోని పరిశోధనల గురించి రెండురకాల అభిప్రాయాలు వినబడుతూ ఉంటాయి. 1. యూనివర్సిటీల నుండి వెలువడే సిద్ధాంత వ్యాసాలు ఒకరకమైన తాటస్థ్యంతో రంగు, రుచీ, వాసనా లేకుండా ఉంటున్నాయి. 2. ప్రమాణాల దృష్ట్యా సంతృప్తికరంగా ఉండటం లేదు."** అయితే ఈ అభిప్రాయానికి వారు ముగింపులో కొసమెరుపుగా – ఈ దోషాలు రెండింటిని తొలగించే బాధ్యత విశ్వవిద్యాలయాల ఆచార్యులపై ఉంది అంటూ నిర్ణయించారు. ఇది సరైనదే అనే విశ్వాసంతో బృహత్తరమైన ఈ బాధ్యతను తన భుజస్కంధాలపైన మూసీ మాసపత్రికవారు వేసుకొని డా. రఘు, డా. కమలాకరశర్మగార్లు **'మూసీ సాహిత్యధార'** అనే పేరిట ప్రతినెలా నిరంతర పరిశోధనా దృక్పథంతో గత 35 నెలలుగా సుప్రసిద్ధ సాహితీవేత్తలచే పరిశోధనా వ్యాసం, కథ, నవల, విమర్శ మొదలైన అనేక అంశాలపైన మార్గదర్శక ప్రసంగాలు చేయిస్తూ రాగా ఇది 36వ మార్గదర్శక ప్రసంగ పాఠానికి అక్షరరూపం. ఈ సాహిత్యధారలో నిజానికి పెద్దపీట పరిశోధక విద్యార్థులదే. వారిలో బెరుకు పోగొట్టడం, వేదికనుంచి మాట్లాడటంలో ఆసక్తిని పెంచడంతో పాటుగా గ్రంథాలను సమీక్షించడం, కవితాగానాలు చేయడం, స్వీయ పరిశోధనాంశాలపై సంక్షిప్త ప్రసంగాలను చేయడం మొదలైనవాటిని ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో మంచి పరిశోధనలు వెలువడేందుకై తనదైన కృషిని గత రెండున్నర దశాబ్దాలుగా కొనసాగిస్తున్న మూసీపత్రికను ముందుగా అభినందించాలి. ఈ బాధ్యతలో గత మూడు సంవత్సరాలుగా డా. రఘు చేయూతతో డా. అట్టెం దత్తయ్య సమన్వయకర్తగా పరిశోధక విద్యార్థులకు ఈ వేదిక అనేక అవకాశాలను అందిస్తున్నది.

భాష, సాహిత్యం, సంస్కృతి, వ్యాకరణం, విమర్శ, నవల, కథానిక, దళితవాదం, స్త్రీవాదం, మైనారిటీ వాదం, జానపద సాహిత్యం, ఆచార వ్యవహారాలు, అనువాదాలు, తులనాత్మక రచనలు, అధ్యయనాలు, ఆధునికోత్తర కవిత్వం, వచన కవిత్వం, ఆధునిక రచనల్లో సంప్రదాయ ధోరణులు, వివిధ ఇతర వాదాలు... ఉదాహరణగా స్వీకరించిన ఈ ఇరవై అంశాలతో పాటుగా తెలంగాణ అస్తిత్వం అనే నూతన అంశం జతపడటంతో విద్యార్థులకు పరిశోధనాంశాలు, పరిశోధనావకాశాలు

ఇబ్బడి ముబ్బడిగా లభిస్తున్నాయి. అయితే పరిశోధన చేసే సమయంలో విద్యార్థి ఎదుర్కునే అంశం ఎలాంటిదైనప్పటికీ అంశాన్ని అధ్యాయాల వారిగా విభజించుకోవడం అనేది క్లిష్టతరంగా ఉంటుంది.

ఉదాహరణకు : **"తెలంగాణ సాహిత్యం చరిత్ర ఒక పరిశీలన"** అనే పరిశోధనాంశం విభజించే క్రమంలో పాలకుల పేరిట కాలాన్ని ఆధారం చేసుకొని అధ్యాయాలను విభజించుకోవడం అంటే 1. శాతవాహన యుగం, 2. కళ్యాణీ చాళుక్యుల యుగం, 3. కాకతీయుల యుగం, 4. పద్మనాయకుల యుగం, 5. కుతుబ్షాహీ, 6. ఆసఫ్జాహీ, 7. విశాలాంధ్ర, 8. స్వతంత్ర తెలంగాణ... ఇలా విభజించవచ్చు. లేదా

ప్రసిద్ధ కవులను ఆధారం చేసుకొని 1. శివకవుల యుగం 2. ప్రబంధకవుల యుగం 3. నాయకరాజుల యుగం 4. స్వాతంత్ర్యోద్యమ యుగం 5. స్వాతంత్ర్యానంతర కాలం 6. ఆధునికకాలం 7. అత్యాధునిక కాలం... ఇలా కూడా అధ్యాయాలను విభజించుకోవచ్చు.

ప్రతిపాదిత అంశంపై సిద్ధం చేసిన ఈ అధ్యాయాలను అంశంలోని విలువల మేరకు ఉప అధ్యాయాల విభజన కూడా చేసుకుంటే ఆ రచన ఏకరూపత పొందుతుంది.

1. ఆధ్యాత్మిక సాహిత్యం, 2. ప్రాచీన సాహిత్యం 3. ఆధునిక సాహిత్యం 4. జానపద సాహిత్యం 5. అనువాద సాహిత్యం అనే ప్రధానమైన అయిదు పార్శ్వాలలో తెలుగు సాహిత్యాన్ని విభజించుకొని ఇందులో తమకు నచ్చిన మార్గాన్ని ప్రధానంగా గుర్తించి, అందులో పరిశోధన చేయడం కోసం పరిశోధక విద్యార్థి ఒక అంశాన్ని స్వీకరించవచ్చు. స్వీకరించిన ఆ అంశాన్ని ప్రాచీనం, 2. చరిత్ర 3. అర్వాచీనం, 4. అస్తిత్వ పోరాటం, 5. ప్రక్రియా పరమైన విభజన అనే ఉప అధ్యాయాలుగా తమ అంశాన్ని చిత్తుప్రతి కోసం నిర్ణయించుకోవాలి.

సాహిత్యం 1. కుటుంబం 2. స్నేహాలు 3. విలువలు 4. విద్యా ధోరణులు 5. స్వయంచాలకత్వం 6. నిర్వహణ 7. ధనం 8. సమాజం 9. ఆకర్షణలు 10. అవకాశాలు అనే ప్రధానమైన 10 అంశాల ప్రభావంతో వ్యక్తి జీవిస్తూ ఉంటాడు. ఆ వ్యక్తి పరిశోధనా రంగాన్ని స్వీకరించినప్పుడు 1. నేను బాగోలేను, నీవు బాగున్నావు 2. నేను బాగున్నాను, నువ్వూ బాగున్నావు 3. నేను బాగున్నాను, నీవు బాగోలేవు. 4. నేను బాగోలేను నీవూ బాగోలేవు వంటి చతుర్ముఖ వ్యక్తిత్వ వికాసపు కోణాలలో పడి ఉన్నస్థితి నుంచి ఉన్నతస్థితివైపు ప్రయాణించే క్రమంలో రెండవదానినే ముందు స్వీకరించాలి. తమపైన తమకు విశ్వాసం పెరిగేకొద్దీ కొంత మూడవస్థితిని కూడా చేరుకోవచ్చు. ఇందులో నాల్గవది అసలు పతనానికి దారి తీసే అంశం అవుతుంది. ఎదుటివారిని జ్ఞానంతో అధిగమించాలంటే తామూ అంతకుమంచి విజ్ఞాన సముపార్జన చేయాలి. అలాకాక నేటికాలంలో వక్రమార్గాలను అనుసరించే కొందరు ఎదుటివారిని వంచి తాము మించినట్లుగా లోకాన్ని నమ్మిస్తున్నారు.

**"ప్రతీయమానం పునరన్యదేన**
**వస్త్వస్తి వాణీషు మహా కవీనాం**
**యత్తత్ ప్రసిద్ధావయవాతిరిక్తం**
**విభాతి లావణ్య మివాంగనాసు"** అని ఆనందవర్ధనుడి ధ్వని.

అధ్యాయాల విభజనలో ఈ సౌందర్యదృష్టిని కూడా పరిశోధక విద్యార్థి దృష్టిలో పెట్టుకోవాలి.

ఆచార్య ఎన్.గోపిగారు ఒక వేదికపైన ఉపన్యసిస్తూ ఇలా అన్నారు. పిదప దానినే ఒక హైకూగా మార్చి మానకందించారు.

ఉపన్యాససభలో ముందు వరుసలో కూర్చున్న వ్యక్తి వేదికపైకి చేరాలని తాపత్రయ పడతాడు. వేదికపైన చివర కుర్చీలో కూర్చున్న పిదప మధ్యవరుసలోకి చేరాలని తహతహలాడతాడు. అదే వ్యక్తి ఉపన్యాసాల పరంపర అలవాటైతే మాట్లాడిన పిదప వెళ్ళిపోవాలని కోరుకుంటాడు. ఇంకెవరు మాట్లాడినా వినే సహనం ఉండదు. సహనశీలత లోపిస్తుంది. లేదా ప్రసంగించిన వ్యక్తి తన ప్రసంగపాఠం పూర్తి అయిన తరువాత 'ఎలా మాట్లాడానా' అనే అంశం మీదే ఆలోచన చేస్తుంటాడు. అలాగే మిగతా ప్రసంగాలు చేసేవారంతా 'తాము ఎలా ప్రసంగాలు చేయాలా?' లాంటి ఆలోచనలు చేస్తుంటారు. ఇదే ప్రకారంగా అధ్యాయాల విభజనలో ఒక అంశం మరో అధ్యాయంలో దూరే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. లేదా అనేక అధ్యాయాలలో అదే అంశం విస్తరించి ఉంటుంది. ఈ రెండూ కూడా దోషాలే. గుణదోషాలు ఎంచే క్రమంలో ఏ సంబంధమూ లేకుండా పైన ఉపన్యాసకులు ఉండే విధానమూ మంచిది కాదు. ఇది ఎలాగో అలాగే అధ్యాయాలలో అంశం యొక్క విస్తృతి, అవసరం మేరకు పరిమితికి లోబడకుండా ఇతర అధ్యాయాలలో కూడా పునరుక్తం చేయవచ్చు. కానీ ఉదాహరణలు, అంశానికి సంబంధించిన మూల పదాలు పునరుక్తం కాకూడదు.

నేడు హైకూల రచనలు విరివిగా వెలువడుతున్న నేపథ్యంలో ఎవరైనా ఒక పరిశోధక విద్యార్థి ఉదాహరణగా **"హైకూ – స్వరూప స్వభావాలు – ఉత్పత్తి వికాసాలు"** ఇలాంటి అంశం పరిశోధనకై స్వీకరించినప్పుడు : 1. హైకూ – ఉపోద్ఘాతం (వివిధ భావ కవితా యుగ, అభ్యుదయ, ఆధునికయుగ కవితా ప్రక్రియలు – క్లుప్తంగా హైకూ విశిష్టత) 2. హైకూ – వివిధ నిర్వచనాలు (తులనాత్మక వివరణ) 3. హైకూ – స్వరూపం (వేమన మొదలగు కవులతో పోలిక, శిల్పనిర్మాణం) 4. హైకూ – ఉత్పత్తి వికాసం (జెన్ కవులు సంక్షిప్త పరిచయం – ప్రక్రియాపర నవ్యత – రూప నవ్యత – వస్తు నవ్యత మొ॥నవి) 5. వివిధ హైకూ సంకలనాలు (ఇక్కడ కాల అవధికి లోబడి కొన్ని సంవత్సరాల లేదా ప్రాంత పరిమితికి లోబడి కొన్ని ప్రాంతాలలో వెలువడిన హైకూ సంకలనాలు) 6. ఉపసంహారం

(శక్తివంతమైన ఆయుధం హైకూ అని నిరూపించడం). - ఇలా అధ్యాయాల విభజన చేసుకోవచ్చు. బ్రాకెట్‌లలో ఉన్న అంశాలు ఉపశీర్షికలుగా గుర్తించవచ్చు.

**"తెలుగు పత్రికలలో భాష"** ఒక పరిశోధనాంశంగా స్వీకరించినప్పుడు దిన,వార,పక్ష,మాస పత్రికలు కాలావధికి లోబడి, ప్రాంత పరిమితికి లోబడి, అంశాలకు (యువత, స్త్రీలు, శాస్త్రాలు-ఆయుర్వేదం, యోగ మొదలైనవి,సాహిత్యం, రాజకీయం) ప్రత్యేకంగా ఆయా పత్రికలలో వెలువడిన శీర్షికలను ఆధారం చేసుకొని కూడా అధ్యాయాలను విభజించుకోవచ్చు. కొన్ని పరిశోధనాంశాలను గుర్తిస్తే 1. తెలుగు టి.వి సీరియళ్ళు 2. ఆధునిక సినిమాలలో తెలుగు భాష (తెలంగాణ ప్రత్యేకం) 3. పాఠశాలలో భాషా బోధన 4. స్నాతక/ స్నాతకోత్తర విద్య స్థాయిలో తెలుగు భాషా బోధన 5. సమాజం – సాహిత్యం పరస్పర ప్రభావాలు 6. తెలంగాణ కథానిక నూతన దశ 7. తెలంగాణ నవల ఉద్యమ అనంతర ధోరణులు 8. తెలుగు మాధ్యమంలో ఉన్నతవిద్యా బోధనలో తెలంగాణ భాష అమలు తీరుతెన్నులు 9. రేడియో ప్రసారాలు – తెలుగు భాష 10. వివిధ సమస్యల పరిష్కారాలలో తెలుగు భాష వినియోగం 11. ఇతర శాస్త్రాల అధ్యయనంలో తెలుగు భాష. 12. సాహిత్యంలో ఛందో వ్యాకరణాంశాల ఆవశ్యకత 13. తెలంగాణ మాండలికంలో ఛందో వ్యాకరణాంశాల శాస్త్రీయత. 14. తెలంగాణ పదప్రయోగ కోశ నిర్మాణాలు 15. ఆధునిక తెలంగాణ కవిత – వస్తురూప వికాసం మొదలైనవి పరిశోధక విద్యార్థులకు నూతనంగా పరిశోధనాంశాలుగా స్వీకరించవచ్చు.

**అధ్యాయాల విభజనలో పాటించవలసిన మెళకువలు :**

1. కనీసం 3–8 అధ్యాయాలు ఉండాలి.

2. మొదటి అధ్యాయం పరిచయం లేక ఉపోద్ఘాతంగా ఉంటే ఎంత సంక్షిప్తంగా ఉంటే అంత మంచిది.

3. అధ్యాయాలను తిరిగి ఉపశీర్షికలుగా విభజించుకోవడం ఆ పరిశోధనకు రాణింపును ఇస్తుంది. ఇవి ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచిది.

4. పరిశోధనాంశ ప్రధాన అధ్యాయం 3–6 అధ్యాయాల మధ్యభాగంలో విస్తరించాలి. ఈ నాలుగు అధ్యాయాల రచన దాదాపుగా సమాన ప్రమాణంలో ఉండేలాగా చూసుకోవాలి.

5. చివరి అధ్యాయం ఉపసంహారం లేదా ప్రయోజనాల శీర్షికలో ఉన్నప్పుడు ఈ అధ్యాయ రచన 1,2,3 అంటూ పాయింట్ల వారీగా ఉండాలి.

6. ప్రతీ అధ్యాయం మొదట సంక్షిప్తంగా అధ్యాయంలో చర్చించబోయే అంశం యొక్క సంక్షిప్తరూపం క్లుప్తంగా ఒక పేరాలో ఉండాలి.

7. అధ్యాయానికి అధ్యాయానికి మధ్య సమన్వయం ఉండాలి.

8. ఎన్నుకున్న పరిశోధనాంశంపైన పూర్వం వెలువడిన పరిశోధనలు, వ్యాసాలు, రచనలు, వార్తాపత్రికలలో కట్టింగులు మొదలైనవాటిని అధ్యాయంలోఉదహరించే సమయంలో ఒకసారి ఉపయోగిస్తే, రెండవసారి పునరుక్తం చేయరాదు.

9. 1,2 వ అధ్యాయాలు ఎంత సంక్షిప్తంగా ఉంటే అంత మంచిది. అయితే ప్రతిపాదిత అంశం అవసరం మేరకు 2వ అధ్యాయంలో వివరించే నిర్వచనాది అంశాలు కొంత విస్తృతంగా ఉన్నా కూడా పర్వాలేదు.

10. పరిశోధితాంశం ఏకవ్యక్తి ఆశ్రయమైనప్పుడు ఆ వ్యక్తి జీవిత చరిత్రకన్నా అతను వెలువరించిన రచనలపై దృష్టి కేంద్రీకరించాలి. అధ్యాయాల విభజనలో రచనలకే అధిక స్థలం కేటాయించాలి.

11. అధ్యాయాల విభజనలో ఏకరూపతను తప్పనిసరిగా పాటించాలి. ఏకరూపత అంటే క్రమానుగతమైన విశ్లేషణ. ఒక వ్యక్తి రాసిన పలు రచనలలో కాల అవధికి లోబడి రచనల క్రమాన్ని వివరించాలి. అంతేకాని ఉన్నత రచన అని ముందు, తక్కువ గుర్తింపు కలది అని తర్వాత అనే విభజన కూడదు.

12. అధ్యాయాల విభజనలో సమకాలీనతను సాధించే క్రమంలో ప్రతీ అధ్యాయం మొదట ఆ అధ్యాయంలోని అంశాలను సంక్షిప్త రూపంగా ఒక పేరాలో వివరించడంలో ఎంత అవసరమో, చివరి పేరాలో ఈ అధ్యాయంలోని విశ్లేషణ ద్వారా సాధించిన ప్రయోజనాన్ని కూడా ఒక ప్రత్యేక పేరాలో రాయడం అంతే అవసరం. ఈ మొదటి చివరి పేరాలు ఆ అధ్యాయానికి బలం.

13. ఏ అధ్యాయానికి ఆ అధ్యాయం చివర ఉపయుక్త గ్రంథసూచిని ఇస్తే మంచిది.

14. స్వీకరించిన పరిశోధనాంశం ప్రాంత, చారిత్రక అంశాలపై ఆధారపడినప్పుడు ఉదాహరణకు గ్రామనామాలు, చారిత్రక ప్రదేశాల విశ్లేషణలు మొదలైనవాటిని స్వీకరిస్తే ప్రస్తుతం ఉన్న విభజనకు లోబడి మండలాల వారీగా ఒక వరుసక్రమానికి కట్టుబడి రచన కొనసాగాలి.

15. అన్ని అధ్యాయాలలోని భాష ఒకే ధోరణిలో ఉండాలి.

16. పరిశోధకుడు అధ్యాయాలను పెంచే, తుంచే క్రమంలో స్వంత అభిప్రాయాలకు తావివ్వరాదు. ప్రతిపాదితాంశం అవసరాలనే దృష్టిలో పెట్టుకోవాలి. 1. తను కోరింది ఉంటేనే ... 2. సమర్థత కోసం... 3. విమర్శించడం కోసం... 4. కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం కోసం... 5. జ్ఞాన సముపార్జన కోసం... అంటూ విషయ విశ్లేషణకే ప్రాధాన్యతను ఇవ్వాలి.

17. అధ్యాయాల రచనలో శైలి కథనాత్మకంగా ఉండరాదు.

18. అలాగే వర్ణనలనకు కూడా అధికంగా తావివ్వరాదు.

19. ఉట్టంకులను పుటలకు పుటలుగా చూపరాదు.

20. పరిశోధకుడి ప్రతిభ రెండు మార్గాలలో ప్రకటితమవ్వాలి.

# మేమూ దేశభక్తులం

మేమూ దేశభక్తులం
మాలోనూ దేశభక్తి ఉప్పొంగుతుంది..
ఆగస్టు15, జనవరి 26 న బీరుపొంగులా బుస్సుమంటుంది..
వాట్సాప్ స్టేటస్ లలో ఓ ఇరవై నాలుగు గంటలు
దేశభక్తి వరదలొస్తాయి...
మేము దేశభక్తులం..

స్వాతంత్ర్య స్ఫూర్తిని నిత్యం సాక్షాత్కరిస్తాం
మా నాయకుల స్వార్థానికొక నినాదాన్ని సాయమడుగుతుంటాం...
మేం దేశభక్తులం...

పోరాటపటిమను ఎప్పటికప్పుడు పోగు చేసుకుంటాం
మా ఆస్తులు కూడబెట్టే ఆరాటానికి ప్రేరణగా చేసుకుంటం
మేం దేశభక్తులం..

వీరుల ఆశయాలను అసలే అడుగంటనీయం
మా అవకాశవాద రాజకీయాలకు ఆసరాగా చేసుకుంటాం..
మేం దేశభక్తులం...

మహనీయుల మాటల్ని రోజూ స్మరిస్తాం
మా ఓటుబ్యాంకు రాజకీయాలకు బాటగా మలుచుకుంటాం...
మేం దేశభక్తులం...

అవసరానికో అమరున్ని కీర్తిస్తూ ఉంటాం
వాదాలతో వీరులను వేరు చేస్తుంటాం
జాతికో నేతను అంటగడుతుంటాం
నీతి నియమాలన్ని మంట గలిపేస్తాం..

వంచించుకుంటాం, ముంచేసుకుంటాం
కొట్లాడుకుంటాం, తిట్లాడుకుంటాం
ఏంటి ఇదంతా అని ఎవరైనా ప్రశ్నిస్తే
మాకు స్వేచ్ఛా స్వతంత్రాలు వచ్చాయనంటాం..
మేం దేశభక్తులం..

**ముద్దాపురం నవీన్**
ఫోన్ : 957 33 94617

అవి 1. భావనాత్మకం 2. ఊహాత్మకం.

21. అధ్యాయాల రచనలో సంవాదాలకు తావు ఉండరాదు. కచ్చితంగా, నిర్దుష్టంగా ప్రతిపాదన ఉండాలి.

22. 'నాతి దీర్ఘం నాతికృశం' అన్నట్టుగా ఏ అధ్యాయం కూడా సాగతీత ధోరణిలో ఉండకూడదు. అలాగని మరీ సంక్షిప్తంగా కూడా ఉండరాదు.

23. ఒక ఉదాహరణగా అధ్యాయాల విభజనలో పుటల పరిమితి ఇలా ఉండవచ్చు.

1. ఉపోద్ఘాతం – 10పేజీలు 2. విషయ విశ్లేషణ, నిర్వచనాలు – 10పేజీలు 3. ప్రతిపాదితాంశ విశ్లేషణ (ఇందులో 3, 8 అధ్యాయాలుండవచ్చు) – ఈ మొత్తం 150 పేజీలు ఉంటే బాగుంటుంది. 4. ఉదాహరణలు, లాభనష్టాలు, ఉపసంహార అధ్యాయాలు – ఈ మూడు కలిసి 30 పేజీలు ఉంటే ఆ పరిశోధన గ్రంథం పాఠకునకు ఆకర్షణీయంగా ఉంటుంది. అయితే ఇదేమీ కచ్చితంగా ఇంతే ఉండాలని కాదు "నాటి మహాకావ్యం 18 పర్వాలైతే, నేటి మహాకావ్యం 18 పేజీలే" అనే సుప్రసిద్ధ నిర్వచనాన్ని గుర్తుపెట్టుకొని పరిశోధనా గ్రంథరచనకు ఉపక్రమిస్తే బాగుంటుంది. ఒకనాటి పరిశోధన గ్రంథాలు వేలపేజీలలో ఉండేవి. నేటికి వందల లోకి వచ్చాయి.

పరిశోధకుడు తన ఊహను ప్రతిపాదనగా సిద్ధం చేసుకొన్న పిదప గ్రంథానికి ఒక చిత్తు ప్రతిగా విషయసూచికను రాసుకోవాలి. అందులో అంతర్భాగమే అధ్యాయాల విభజన. ఈ విభజనలో 1. పూర్వ సమస్యలకై కొత్త సమాధానాలను వెతకడం 2. వ్యవస్థీకరించడం 3. గుర్తించడం 4. నిర్మాణాత్మకంగా అందించడం అనే అంశాలు ప్రాతిపదికగా అధ్యాయాలను జాగ్రత్తగా స్వీకరించడం మంచిది.

ఈ వ్యాసం నాటి ప్రసంగపాఠానికి లిఖితరూపం కాదు. మళ్ళీ ప్రసంగరూపంలో చెబుతుండగా అక్షరరూపాన్ని సంతరించుకున్నది. ప్రసంగరూపమైనప్పుడు కొన్ని పునరుక్తులు ఉండవచ్చు. అయితే నిజమైన పరిశోధకుడు అలాంటి పునరుక్తులను కూడా వెదికి, గుర్తించి, పసికట్టగలిగితే మంచి పాఠకుడవుతాడు. పరిశోధకుడు ముందుగా కొన్ని పూర్వగ్రంథాలను సమీక్షలుగా రాయడం, ఆ గ్రంథాలపైన విమర్శన వ్యాసాలు రాయడం, తప్పనిసరిగా చేయాలి. ఆ గ్రంథాలకు ఉన్న ముందుమాటలను బాగా చదవాలి. సమీక్ష, విమర్శ ఒకటి కావు. అలాగే ఈ రెండింటికి పూర్తిగా భిన్నమైనది పరిశోధన. మంచి పరిశోధన గ్రంథం సాహిత్య చరిత్రలో కలకాలం చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. సరైన అధ్యాయ విభజన లేనిచో పరిశోధకుడు అడవిలో దారితప్పిన వేటగాడిలాగా అనవసర ఆయాసానికి, అలసటకు గురి అవుతాడు.

నివాళి

# మనసున్న మనిషి కీ.శే. మడిపల్లి భద్రయ్య గారు

డా. ఎం.వి. పట్వర్ధన్, తెలుగు అధ్యాపకులు, మంచిర్యాల. ఫోన్ : 9393751540

జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, నిత్య సాహిత్య కృషీవలురు, కవి, మధురగాయకులు, నటులు, మృదుభాషి, ప్రవచన కర్త, సామాజిక సేవకులు, తొలి, మలి తెలంగాణ పోరాట యోధులు, ఇటీవలే 18/09/2021 నాడు దివంగతులైన మడిపల్లి భద్రయ్య గారి జీవితం ఒక నిజమైన కవి, కళాకారుడు ఎలా జీవించాలో నేర్చుకోవడానికి మంచి ఉదాహరణ. కవిత్వం రాయడానికి భాషా శబ్దపాండిత్య భేషజాలకన్నా ఆర్ద్ర హృదయం ఉండాలని, మానవీయ మూల్యాలను మరిచిపోకుండా ఉండాలన్నది వారి జీవితం మనకు ఇచ్చిన స్వచ్ఛమైన సందేశం.



**ఉమ్మడి జిల్లాకు సాహిత్య సాంస్కృతిక కేంద్రం :**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పాత కొత్త తరాలకు వారధి వంటి వారు భద్రయ్య గారు. వారి స్వస్థలం నిర్మల్ అయినప్పటికీ వారు తమ వృత్తిరీత్యా విశాలమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పనిచేసి, ఆయా ప్రాంతాలతో, ఆదిలాబాద్ జిల్లాతో విడదీయలేని అనుబంధాన్ని పెంచుకున్నారు. ఆ జిల్లా ప్రజల సాహితీ సాంస్కృతిక ఆచార వ్యవహారాలతో మమేకం అయ్యారు. అందుకే

"ఆదిలాబాదు జిల్లా జిల్లా ఆడవులతల్లి జిల్లా .. జిల్లా ..

జిల్లంటే జిల్లా కాదూ జిల్లా ఆదిలాబాదు జిల్లా జిల్లా"

జిల్లల్లో జిల్లా కాదూ జిల్లా ఆదిలాబాదు జిల్లా జిల్లా" అంటూ తొలి ఆదిలాబాద్ జిల్లా గీతాన్ని అందించారు. వారు ఆయా సభల్లో ఉత్సాహంగా గొంతెత్తి ఈ గీతాన్ని పాడుతూ, అపర నటరాజులా ఆడుతూంటే భద్రయ్య గారితో పాటు సభమొత్తం గొంతు కలిపి ఆడుతూ ఉర్రూతలూగి పోయేది.

ఆదిలాబాద్ జిల్లా మీద ఉన్న ఈ విశేషమైన ప్రేమానుబంధం వల్లనే వారు ఉపాధ్యాయ వృత్తి నుండి విరమణ పొందాక, అరవయ్యేళ్ళ వయోభారాన్ని, వ్యయప్రయాసలను కూడా లెక్క చేయకుండా ఆదిలాబాదు జిల్లాలోని 52 మండల కేంద్రాలను తమ మోపెడ్ ద్విచక్రవాహనం మీద పర్యటించి, ఆయా ప్రాంతాల భౌగోళిక, రాజకీయ, సాహితీ సాంస్కృతిక విశేషాలన్నింటినీ విపులంగా వివరిస్తూ **మన ఆదిలాబాదు** అనే గ్రంథాన్ని వెలువరించారు. ఇది ఒక విధంగా ఆధునిక యాత్రా చరిత్ర. దీనిలో ఆయా రెవెన్యూ డివిజన్లలో ఉన్న చిన్నాచితకా కవులను అనేకమందిని వారు పేర్కొని, పరిచయం చేయడం ఉద్దేశ పూర్వకంగా ఉపేక్షలు రాజ్యమేలుతున్న ఈ కాలంలో వారి సహృదయతకు నిదర్శనం.

తమ జీవిత సాఫల్య రచనగా భావించి, జిల్లా పర్యటనలో తాము పరిశీలించిన పద ప్రయోగ విశేషాల ఆధారంగా సుమారు పదివేల పదాలతో **"మన భాష –మన యాస"** అనే పేరుతో ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా ప్రజల వ్యావహారిక పదకోశాన్ని నిర్మించారు. దీనిలో ప్రతి పదానికి అర్థంతో పాటు వ్యావహారిక భాషలో సంభాషణాపూర్వకంగా ఉదాహరణలు కూడా ఇవ్వడం వలన ఈ కోశం నిర్జీవమైన నిఘంటువుగా కాక చేతనత్వంతో తొణికిసలాడుతూ ఉంటుంది. "అగో" అనే పదానికి అదిగో అన్న అర్థాన్ని రాస్తూ **"అగో ఎప్పుడు దిగితివోయ్ తనా! అంతా మంచిదేనా / పిల్ల జెల్లంత మంచిగున్నదా? పోయినవైతె మల్ల పత్తనే లేదు. అప్పుడు వొయితిపుడు గానస్తివి"** అన్న ఉదాహరణ ఆత్మీయతా సుగంధాన్ని నిర్మల ప్రాంత యాసలో ఆత్మీయతా సుగంధాన్ని మోసుకువస్తున్నది. ఇంకా ఇందులో సామెతలూ, ప్యాదోన్ని గొట్టెరా పెద్దపులీ, బాలమీకి లింగం గడితే భక్తుడైతడా వంటి సామెతలూ, జాతీయాలూ, కడతాల్, యాపల్, బబ్బెర చెలక, వటోలి, హంగిర్గ వంటి అనేక గ్రామాల పేర్లూ, కచ్రూలాల్, యాకయ్య వంటి వ్యక్తుల పేర్లూ ఎన్నెన్నో కనిపిస్తాయి. ఇది వారి ప్రాయం వాలే సమయంలో పూర్తి చేసిన గొప్ప రచన, ఇది ఈ మార్గంలో ఇంకా పరిశోధించి పదాలను వెలికితేవాలనుకునే వారికి గొప్ప కరదీపిక.

**జీవితం :**

నిర్మల్ నగర నిర్మాత నిమ్మ నాయుడి పిలుపు మేరకు సుమారు 400 సంవత్సరాల కిందట మడిపల్లి భద్రయ్య గారి పూర్వీకులు ఖమ్మం జిల్లా చింతలపూడి గ్రామం నుండి నేటి నిర్మల పట్టణానికి వచ్చి స్థిరపడ్డారు. చెన్న మల్లికార్జున పండితారాధ్యుల శాఖకు చెందిన శ్రోతృ శైవ ఆరాధ్య సంప్రదాయాన్ని అనుసరించేవారు. భద్రయ్య గారి పూర్వీకులు బుచ్చయ్య గారు గిద్దె వారింటి నుండి ఈ వంశానికి దత్తత వచ్చి మడిపల్లి వంశాన్ని విస్తరించి, వంశ స్థాపకులయ్యారు.

మడిపల్లి భద్రయ్య గారు 17.01.1945 వ తేదీన వీరయ్య – గంగమ్మల పెద్ద కుమారుదుగా జన్మించారు. అయితే పాఠశాలలో చేరేటప్పుడు పదవతరగతి వారికి ఉండాల్సిన వయస్సును దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు దానిని 8.5.1943 గా రికార్డు చేశారు. ఈ రకంగా సుమారు పద్దెనిమిది నెలలు వారి వయస్సు ఎక్కువగా పడింది.

పూర్వీకులందరూ సంస్కృతాంధ్ర భాషలలో ప్రావీణ్యత కలవారు. భద్రయ్య గారు కూడా బాల్యం నుండే చదువులో చురుకుగా ఉండే వారు. ప్రత్యేకించి తెలుగుభాష అంటే చాలా ఆసక్తి చూపేవారు. స్పష్టమైన ఉచ్చారణతో పాటలూ, పద్యాలను మృదుమధురంగా ఆలపించేవారు. ఆ విధంగా భద్రయ్య గారికి పాటతో చిన్నప్పటి నుండే కుదిరిన అనుబంధం జీవితాంతం కొనసాగింది. కరీంనగర్ జిల్లాలోని అమ్మమ్మ గారి ఊరు జాగీరు కొండాపూరులో మొదటి సారిగా రంగస్థలాన్ని ఎక్కి ఆనాటి ప్రేమలేఖలు చలనచిత్రంలోని **"ఘల్లు ఘల్లు ఘల్లు గజ్జల సంగీతం మువ్వల చిందు ముషారు పసందు"** అని పాడుతూ నాట్యం చేసిన మధురానుభూతి వారిలో చివరివరకూ పదిలంగా ఉంది. పాఠశాల సాంస్కృతిక కార్యక్రమాల్లో భద్రయ్య గారు ఎన్నో నాటకాలు వేసేవారు. ఇవ్వన్నీ ఆ తరువాత వారి బహుముఖీన సాంస్కృతిక వికాసానికి కారణమయ్యాయి. భద్రయ్య గారు పాటతో ఎంత మమేకం అయ్యారంటే 2000 సం।।లో వారికి పాక్షికంగా పక్షవాతం వచ్చి ఆసుపత్రి పడక మీద గడపాల్సి వచ్చినప్పుడు ఇక మళ్ళీ గొంతు రాదేమో అని భయపడి **"పాడుకుంటా పాడుకుంటా నే పాడుకుంటా – భావ రాగాలనే బావమరదళ్లుగా ఆడుకుంటానని"** పాడుకుంటూ దిగులు చెందారు. కానీ అదృష్టవశాత్తు వారి జీవిత చరమాంకంలో కూడా గొంతులో మార్దవం ఏమాత్రం తగ్గలేదు.

భద్రయ్య గారి విద్యాభ్యాసం సజావుగా ఏమీ సాగలేదు. తండ్రి వీరయ్య గారు శిష్యసంచారం మీద మాత్రమే ఆధారపడి కుటుంబ పోషణ చాలా కష్టమయ్యేది. భద్రయ్య గారు ఆర్థికపరమైన అవరోధాలను ఎదుర్కొంటూనే మొక్కవోని సంకల్పబలంతో పదవతరగతిలో ఉత్తర్ణులై, ఆపైన బేసిక్ ట్రైనింగ్ స్కూల్‌లో ఉపాధ్యాయశిక్షణ పూర్తి చేసుకున్నారు. 30వ ఆగస్టు 1962లో లక్షెట్టిపేటలో ప్రాథమిక ఉపాధ్యాయులుగా చేరాక, భైంసా, దిలావర్ పూర్, జన్నారం, గాజుల నర్సాపూర్ ,ఇచ్చోడ, ఉట్నూరు, ఆసిఫాబాదు లో పనిచేసి, 2001 లో కుంటాలలో ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేసేవరకూ వివిధ హోదాల్లో వారి ఉపాధ్యాయ జీవితం కొనసాగింది.

భద్రయ్య గారికి వారి శ్రీమతి ఇందిరా గారు అన్నివిధాలుగా చేదోడు వాదోడుగా నిలిచారు. భద్రయ్య గారికి నలుగురు కుమారులు. అందరూ జీవితంలో చక్కగా స్థిరపడ్డారు.

**సాహిత్య, సాంస్కృతిక కృషి :**

భద్రయ్య గారు దాదాపు తాము పనిచేసిన చోటల్లా ఒక సంస్థను నెలకొల్పి సాహితీ, సాంస్కృతిక కృషి చేశారు. వీరి వృత్తి మరియు కళా జీవితటం రెండూ పెనవేసుకున్నాయి. జన్నారంలో మిత్ర కళాసమితిని స్థాపించి అనేక సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మిత్రకళా సమితి వార్షికోత్సవానికి –

**"చిరు చిరు తుంపరలె కలిసి – కుంభవృష్టి కురిసినట్టు**
**చిన్న చిన్న సెలయేరులె – మిన్నగు నది పారినట్టు**
**నదీ నదుల సంగమమున – జలధి రూపు దాల్చినట్టు..**
**మిత్రకళాసరసి చేరి రాయంచల సదృశులై రాగ భావ శోభితులై సమితిలో కళాభిమానులు రావాలి"** అని వీరిచ్చిన పిలుపు మేరకు సినిమాహాల్లో జరిపిన సాహిత్య సభ రసజ్ఞులతో కిటకిటలాడి పోయింది. ఆ తరువాత కాలంలో నాగబాల డి.సురేశ్ గారి ఆధ్వర్యంలో పలు టీవీ సీరియళ్ళలోనూ నటించారు

మడిపల్లి భద్రయ్య గారు ఆదిలాబాద్ జిల్లాకు చేసిన సేవలలో వారు ఇచ్చోడాలో పనిచేస్తున్నప్పుడు బొందిడి పురుషోత్తమ గారు, నరసయ్య గారు, అంబయ్య గారి వంటి హితైషుల సహకారంతో "ప్రత్యూష" అనే లిఖిత మాస పత్రికను నడపడం చెప్పుకోదగింది. నాలుగేళ్ల తరువాత ఈ పత్రిక ముద్రిత పత్రికగా కూడా మారింది. ఈనాడు జిల్లాలోని కొందరు ప్రసిద్ధ కవులూ, రచయితలకూ ఆనాడు ప్రత్యూష ఒక ముఖ్య వేదికగా ఉండేది.

**భద్రయ్య గారి రచనలు :**

పద్య, గేయ, వచన కవితా ప్రక్రియలలో భద్రయ్య గారి సాహిత్యం విస్తరించింది. పునర్ముద్రణలు కాక వారు 24 రచనలు ప్రచురించారు. వాటిలో శ్రీయాదగిరి లక్ష్మీ నారసింహ శతకం, శ్రీశ్రీనివాస శతకం, బతుకుబాట శతక ప్రక్రియకు చెందినవి కాగా మనోవేదన సప్తశతి, శ్రీషిర్డీసాయి త్రిశతి, మనోవిలాసం ద్విశతి భద్రయ్య గారి వస్తు విస్తార శక్తికి ఉదాహరణలు శ్రీ జ్ఞాన సరస్వతీ స్తవం, శ్రీ షిర్డీ సాయి భజనావళి, శ్రీ మెహర్ భక్తి గీతావళి, శ్రీ సరస్వతీ స్తుతి, నాలోని నాదాలు వంటివి గేయ ప్రక్రియకు చెందిన రచనలు. శ్రీశివభక్త చరితం, శ్రీహరిలీలలు, శ్రీ శివలీలలు, శ్రీరామ చరితం (బాల కాండం) భద్రయ్య గారి కావ్యాలు. కర్తవ్యంలో గేయాలు,పద్యాలతో పాటు వచనకవిత్వం కూడా చాలా భాగం ఉన్నది. రచనలన్నీ

సులభశైలిలో సహజ సుందరంగా ఉంటాయి.

**భద్రయ్య గారి ఆధ్యాత్మిక దృక్పథం :**

సగుణోపాసన ద్వారా నిర్గుణోపాసన అలవర్చుకోవాలనుకునే వారు. ఏ గురువైనా, ఏ దైవం అయినా భద్రయ్య గారికి పెద్ద తేడా లేదు. శిరిడీ సాయి, సత్య సాయి, మెహర్ బాబాలను సమానమైన భక్తి ప్రపత్తులతో కీర్తిస్తారు. శ్రీనివాసుడు, లక్ష్మీనరసింహుడు, రాముడు, సరస్వతి వంటి బాహ్య రూప భేదాల వద్ద భద్రయ్య గారు ఎన్నడూ ఆగిపోలేదు. ఆయా భక్తి రచనల ద్వారా తాము సాధించాలనుకున్న సామాజిక ప్రయోజనమే ముఖ్యం. అందుకే ఎలాంటి సందేహమూ లేకుండా –

**"ప్రేమ భావము పొంగి పోరలగ –క్షేమకరుడై ఇలకు వచ్చిన**
**దివ్యరూపుడు బాల యేసుని –భావ్యమవు శుభ ఆగమనమున**
**పాడుదము మనసార మనమే –వేడుదము ముదమార మనమే"**

అని నోరార ఏసుక్రీస్తుని కీర్తించ గలిగారు. శ్రీహరిలీలలు, శ్రీ శివలీలలు అని ఇద్దరి లీలలను స్తుతించి శివకేశవ అద్వైతాన్ని సాధించారు. ఇవ్వన్నీ చూడడానికి మామూలుగా కనబడినప్పటికీ ఎంతో ఉన్నతమైన ఆధ్యాత్మిక భావస్థితిలో ఉంటే సాధ్యం కావు.

**భద్రయ్య గారి సామాజిక అభ్యుదయ దృక్పథం :**

భద్రయ్య గారి రచనల్లో ఆధ్యాత్మిక, సామాజికాభ్యుదయాలు రెండూ సమపాళ్లలో మేళవించి ఉంటాయి. అయితే పైపైన చూస్తే మాత్రం భద్రయ్య గారిని కేవలం భక్తిమార్గానికి చెందిన కవి అనుకునే అవకాశం ఉన్నది.

"శ్రీనికేత నేను సిరిసంపదల కోర – పరుల సేవ తప్ప పరమపురుష

వరము నొసగ రావె వరదుడవై వేగ – శరణు శిరిడి సాయి శరణు శరణు" (శ్రీసాయి త్రిశతి) లో కనబడేది పరోపకారాయ దుహంతి గావః అన్న వాక్య సారాంశమే కదా ! అదే విధంగా

**"ధర్మ మార్గము తప్పక ధరణి జనులు**
**మెలగ వలె నంచు పెద్దలు మెలగి తాము –**
**అనుసరించుచు అందరికాద్యు లైరి"** అనడంలో **"యద్య దాచరతి శ్రేష్ఠః .."** అన్న గీతావాక్యం స్ఫూర్తి కనబడుతుంది.

భద్రయ్య గారు శాంతి కాముకులు. కక్షలూ, కార్పణ్యాలు లేని సమాజాన్ని వారు కలగన్నారు.

**"పగయు పెరిగెనేని పాడౌను దేశంబు**
**వగపె మిగులు చూడు వసుధలోన**
**తగదు నగును జగము తథ్యంబు గనుమిది**
**పొగలు చిమ్ము కర్ర పొయ్యి చేటు"** అని ఒక చిన్న సహజమైన పోలిక ద్వారా తమ ఆవేదనను వెలిబుచ్చారు.

"బాణామతి రోగానికి బడితే పూజ సరి యంటూ – ప్రాణాలతో చెలగాటం పనికిరదో ఉనికి చెదగ .. ధ్యేయాలను మరిచి మనం తాయెత్తుల నమ్ముటేల?" అని – మూఢ నమ్మకాలను నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చారు. పర్యావరణ సంరక్షణ, వివిధ పేర్లతో వచ్చిన విద్యాభివృద్ధి పథకాలు, దుర్వ్యసనాలు, రాజకీయ నాయకుల నడతలు, తెలుగు భాష పరిస్థితి... ఈ రకంగా సమాజంలోని ప్రతి అంశంపై భద్రయ్య గారు సమకాలీన కవులతో సమానంగా స్పందించారు. తమను తాము అప్ డేట్ చేసుకున్నారు . "కులమేంది మతం మరెందీ – మనుషులం కామా ! మనం మనను మరి లేదా మనకు ముట్టు దేంది? మరి అంటుడేంది?.. నీ రగతం నా రగతం ఎర్రగున్నది – బర్రె నల్లగున్న పాలు తెల్లగున్నవి" అని చాట గల్గిన గొప్ప మానవీయ మూల్యాలున్న కవి భద్రయ్య గారు. కేవలం రచనలలోనే కాక నిజ జీవితంలోనూ ఆచరించి చూపిన ధీశాలి భద్రయ్య గారు.

"ఒకరి నొకరు ఆదరించుకోవడం – ఆప్యాయంగా పలకరించుకోవడం

గౌరవించుకోవడం ఆత్మీయతను అనుభూతుల్ని పంచుకోవడం

పెంచుకోవడం మానవత" అంటూ మానవత్వానికి అత్యమితంగా ప్రాధాన్యత ఇచ్చే మనీషి భద్రయ్య గారు ఇంకా కొంత కాలం జీవించి ఉంటే మరిన్ని ప్రబోధాత్మక రచనలు తప్పకుండా వచ్చేవి. కానీ కాలం ఆ అవకాశం ఇవ్వలేదు. వినాయక చవితి నాడు తీవ్రమైన గుండెపోటుతో నిమ్స్ ఆసుపత్రిలో చేరి, కొలుకున్నట్టే కనిపించినప్పటికీ వారు 18/09/2021 నాడు తెలుగు సాహితీ లోకాన్ని శోక సముద్రంలో ముంచి వారు అక్షరామరులయ్యారు. వారి విస్తార సాహిత్య కృషికి, సృజనకు శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ వారి శ్రీమాన్ నందూరి రామకృష్ణమాచార్య స్మారక పురస్కారం (2012), శాతవాహన విశ్వ విద్యాలయం వారి శ్రీముదిగంటి వెంకట నరసింహా రెడ్డి సాహితీ పురస్కారం (2014), తెలంగాణ రాష్ట్ర ద్వితీయ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ కవి బృందానికి నాయకత్వం (2016) వంటి ఎన్నో గౌరవ సత్కారాలు పొందారు.

మనోవేదన, మనోవిలాసం వంటి మనస్సుకు సంబంధించిన రచనలు చేసిన మనస్సున్న కవి భద్రయ్యగారు.

ఏ సభలోనైనా ,లేదా ఏ పదిమంది కూడిన సందర్భంలోనైనా

"మనసున్నది మనకు మంచి ఆలోచన కొరకు

తనువున్నది మనకు తగిన పని చేయుట కొరకు" అని వారు మంద మధురంగా గమకాలు తీసి పాడేవారు. మనం అంతా మంచి ఆలోచన కలిగి ఉండాలని వారి ప్రబోధం.

వారు ఈనాడు భౌతికంగా లేకపోయినప్పటికీ వారి మానవతా సందేశం మాత్రం మనుషుల్ని ముందుకు నడిపిస్తూనే ఉంటుంది.

# తెలంగాణ సాంస్కృతిక చైతన్యంలో బతుకమ్మ గేయాలు - వైశిష్ట్యం

**డా. కొప్పు సుభాష్ చంద్రబోస్,** హైదరాబాద్. ఫోన్ : 9966 956 953

**"మానవుడు ఉన్నత జీవితం గడపడానికి భౌతికంగా, మానసికంగా చేసే నిరంతర ప్రయత్నమే సంస్కృతి. వ్యవస్థ, రాజ్యం, మతం, కళలు, వస్తుజాలం, వేషభాషలు. ఆచార వ్యవహారాలు, అనుబంధాలు, ఆహార విహారాలు, పండుగలు, జాతరలు, కట్టుబాట్లు, కష్టసుఖాలు, పెనుగులాటలు, పోరాటాలు అన్నీ సంస్కృతి వ్యక్తీకరణలు. సంస్కృతి స్వరూప స్వభావాలు, వికాసాలు ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులపై, పరిణామాలపై ఆధారపడి ఉంటాయి. తెలంగాణ సంస్కృతి విశిష్టమైంది. ప్రత్యేక అస్తిత్వం కలిగియున్నది. కాలగమనంలో ఆంధ్ర సంస్కృతిలో భాగంగా పేర్కొని నష్టపర్చినప్పటికీ ప్రస్తుత సందర్భంలో తెలంగాణ సంస్కృతి పునరుజ్జీవనం పొందుతున్నది. కొత్త చూపుతో, అన్వేషణతో, తన అస్తిత్వాన్ని తిరిగి నిర్మించుకుంటున్నది. విస్మరణకు, వక్రీకరణకు, అణచివేతకు గురైన స్థానిక సంస్కృతి రూపాల్ని సమీకరించుకుంటూ కొత్తగా వ్యక్తీకరించుకుంటున్నది".** ఏ ఉద్యమమైనా దానికి సాంస్కృతిక భూమిక లేనిదే, మద్దతు లేనిదే సఫలం కాదు. మలిదశ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సంస్కృతి, భాష చాలా కీలకంగా పనిచేశాయి. ఉద్యమం పోటు మీదికి రావడానికి ఒక రకంగా సాంస్కృతిక అస్తిత్వమే కారణమని చెప్పొచ్చు. ప్రజలందరిలో ప్రత్యేక తెలంగాణ భావోద్వేగాన్ని రగిలించడంలో సాంస్కృతిక చైతన్యం పోషించిన పాత్ర అమోఘమైనది. బతుకమ్మ, బోనాలు, పీరీలు, అలావ్ దుంకడం, ఆహారపు అలవాట్లు, కోలాటం, పేరిణీ నృత్యం. చిత్రకళ, శిల్పకళ, శివసత్తులు, పోతురాజు, ఒగ్గుకథ, తెలంగాణ తేజోమూర్తులు, చారిత్ర స్థలాలు... స్థానిక సాంస్కృతిక అస్తిత్వ కేతనాలుగానే కాక ఉద్యమ రూపాలుగా కూడా రూపాంతరం చెంది తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి తోడ్పడ్డాయి. రసమయి బాలకిషన్, అంతడుపుల నాగరాజు, కె. చంద్రశేఖరరావుల ఆలోచనల నుండి పురుడుపోసుకున్న ధూం ధాం సమైక్య పాలనలో మనకబారిన తెలంగాణ కళారూపాలను మళ్లీ తెర మీదికి తెచ్చి తెలంగాణ ప్రజలను ఉద్యమం వైపు అడుగులు వేయించడంలో విజయం సాధించింది. తెలుగు నేల మీదున్న నాలుగు ప్రాంతాల్లోనూ తెలంగాణది విభిన్న సంస్కృతి. ఇక్కడి నేల స్వభావం, వనరులు, వేష భాషలు, పండుగలు, పంటలు, మనుషుల వ్యక్తిత్వం అన్నీ ఇతర (ప్రాంతాల కంటే భిన్నమైనవే. తెలంగాణ సంస్కృతి గురించి మాట్లాడేటపుడు ముందుగా గుర్తుకు వచ్చేది ఇక్కడి ఆడవడుచుల పూల పండుగ బతుకమ్మ పండుగ. అందుకే ఇక్కడ కలం పట్టిన ప్రతీ కవీ ఐతుకమ్మ గురించి ఒక్క వాక్యమైనా రాసి ఉంటాడు. 1920లోనే సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డిపల్లెకు చెందిన సిద్దప్ప వరకవి బతుకమ్మ పండుగలోని తాత్విక కోణాన్ని ఆవిష్కరిస్తూ అందమైన సీస పద్యమొకటీ రాశారు.

**బ్రతుకుఅమ్మ-బ్రతుకమ్మ,** బ్రతికించే అమ్మ కాబట్టి బ్రతుకమ్మ అయ్యిందని లేదా బ్రతికిన అమ్మ, బ్రతుకమ్మ అయ్యిందని భావింపవచ్చు. 'బ్రతుకమ్మ' వ్యవహారంలో బతుకమ్మగా మారింది, బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాలను తెలిపే అంశాలు బతుకమ్మను లక్ష్మీదేవి, పార్వతీదేవి అంశంగానూ, పేరంటాలుగానూ, సాహసవనిత గాను, ప్రకృతికి ప్రతిరూపంగాను, శ్రీచక్ర శోభితగానూ తెలియ జేస్తాయి. బతుకమ్మ పండుగ పుట్టుపూర్వోత్తరాలను తెలియజేసే ఒక కథ పురాణాలకు సంబంధించింది. గౌరిదేవి మహిషాసురుణ్ణి వధించి, అలసి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు స్పృహ కోల్పోతుంది. అమె స్పృహనుండి తేరుకోవడానికి స్త్రీలందరూ దేవిని బతుకమ్మ అని ప్రార్థిస్తూ పాటల రూపంలో వేడుకుంటారు. దశమిరోజున దేవి స్పృహ నుండి తేరుకుంటుంది. దేవి పునర్జీవించిందని, నాటి నుండి ఆమెను బతికిన అమ్మ బతుకమ్మగా కొలుస్తున్నారు. ఆమె స్పృహ కోల్పోయిన తొమ్మిది రోజులు ఆమెను స్మరిస్తూ పండుగ చేసుకోవడం ఆచారంగా మారింది.

తెలంగాణలోని ప్రతి జిల్లాలోను ప్రచారంలో ఉన్న **'ధర్మాంగదుని పాట'** బతుకమ్మ పుట్టు పూర్వోత్తరాలను తెలియజేస్తుంది.

శ్రీ లక్ష్మిదేవియు ఉయ్యాలో
సృష్టి బతుకమ్మాయె ఉయ్యాలో
పుట్టినారీతిజెప్పె ఉయ్యాలో
భట్టు నరసింహకవి ఉయ్యాలో
ధరచోళదేశమున ఉయ్యాలో
ధర్మాంగుడనురాజు ఉయ్యాలో
ఆ రాజు భార్యయు ఉయ్యాలో
అతిసత్యవతియంద్రు ఉయ్యాలో
నూరునోములు నోమి ఉయ్యాలో
నూరు మందినిగాంచె ఉయ్యాలో

ఈ చోళదేశాన్ని పాలించిన రాజు ధర్మాంగుడు. అతని భార్య సత్యవతి. వారికి వందమంది కుమారులు జన్మించినా పుత్రశోకం తప్పలేదు. అందుకే వారు తపస్సు చేసి శ్రీలక్ష్మినే తమ కూతురుగా జన్మించాలని కోరారు. వారి కోరికను మన్నించి లక్ష్మీదేవియే కుమార్తెగా ఆ ఇంట జన్మించింది. ఆ శిశువును చూచి దేవతలు, మునిపుంగవులు చల్లంగ బతుకమని బ్రతుకమ్మగా దీవించినారు.

అందుకే ఆమె బతుకమ్మ అయ్యింది. శ్రీ మహావిష్ణువు చక్రాంకుడనే పేరుతో రాజువేషంలో వచ్చి బ్రతుకమ్మను పెండ్లి చేసుకున్నాడు. వారిద్దరు సిరిసంపదలతో, సంతానంతో వెలుగొందారు.

శ్రీ లక్ష్మిదేవియే బతుకమ్మగా జన్మించి, శాశ్వతమైన కీర్తిని పొంది నందున ఆమెను దేవతాకన్యలు, ప్రజలు పూజించారు. కట్లపూవులతో గద్దెవేసి గోరింట, దానిమ్మ, కానుగ, తుమ్మి, వావిలి, యింద, పయిడి, పొన్న, బీరపూవులతో చుట్టుగోడలు, అరుగులు, దరువాజలు, తోరణాలు కట్టి పద్మాసనం వేసి పసుపు ముద్దలను నిలిపి పూజించారు. ఆనాటి నుండి నేటి వరకు ఆశ్వీజ శుద్ధపాడ్యమి మొదలు తొమ్మిది దినాలు పూలగోపురంగా బతుకమ్మను పేర్చి పండుగ జరుపుకోవడం ఆచారంగా ఉంది. నేటికీ లేకలేక పుట్టిన సంతానానికి గానీ, ఎక్కువ మంది పుట్టి చనిపోయిన తరువాత పూట్టే బిడ్డకుగానీ చల్లంగా బతుకాలని 'బతుకమ్మ అనే పేరు పెట్టుకుంటారు సిరిసంపదల నిచ్చే లక్ష్మీ దేవితో పాటు పడతులకు ప్రత్యేక పండుగ పూలపండుగ,

**"ఆశ్వీయుజ శుద్ధమనగా స్త్రీలంత**
**తిరిగి పువ్వులు తెచ్చి తేగమలర**
**బతకమ్మయని పేర్చి భ్రమనొందగా**
**నాడి నదిలో వేతురు శుద్ధనవమి వరకు**
**నా సందు నీ సందు నానాడె పాసెనని**
**కుంటి రంగని పుందు గూసెననుచు**
**వైనమను సిబ్బులన్ నదులు ఐదులందుకొని**
**యెవ్వరెవ్వరి చద్దివారు గుడిచి**
**యేగుదురు నపుడు యిండ్లకున్ ఎలిమితోడ**
**ప్రేమదీరెను బతుకమ్మ పేరు మాసె**
**వినుడి మాయప్ప సిద్దప్ప విహితుడప్ప**
**కనుడి కరమొప్ప కవికుప్ప కనకమప్ప"**

ఆశ్వీజ మాసంలో దొరికే ఒక్కొక్క పూవునూ కోసుకొచ్చి తాంబాలంలో గౌరి ముత్తయిదువలంతా బతుకమ్మల చుట్టూ తిరుగుతూ తొమ్మిది రోజులు ఆడిపాడి గౌరీమాతకు ఆరగింపు చేసిన చద్దిని (ప్రసాదం) నీమధ్య నామధ్య నెలకొన్న విరోధాలు పోవాలని వాయనాలుగా ఇచ్చి పుచ్చుకొని చివరికి బతుకమ్మను గంగలో వేసి ఉత్తచేతులో ఇంటికి పోతారు. జీవితం కూడా ఇంతేనని కవి బతుకమ్మ చుట్టూగల జీవిత తాత్త్వికతను ఎంతో సొంపుగా చెప్పి తత్త్వం బోధపరుస్తారు. తెలంగాణ సంస్కృతీ చిహ్నమైన బతుకమ్మ పండుగను మనిషి జీవితానికి ముడి పెట్టి చెప్పడం కవి పరిణతికి, తెలంగాణ పండుగల వెనకగల ఉన్నతికి నిదర్శనం.

**"ఏంత వన్నెల విరులు చేరిచి / పేరిచిన బతుకమ్మలంగొని**
**చంచలాంగులు నడువ తీగలు / సాగి నడిచినయట్లు కన్నడె"**

**– డా. సి. నారాయణ రెడ్డి**




బతుకమ్మ పండుగ అంటేనే పూల పండుగ. పూబంతుల పండుగ. ఎన్నో వన్నెల పూవులను ఏరుకొచ్చి వాటిని కోణాకారంలో పేర్చి, శుభాలు కలగాలని గౌరీ మాతను పూజించి తోటి ఇంతులతో కలిసి ఆడుటకు దేవాలయం ముందరికో, చెరువు కట్ట మీదికో చేరుకుంటారు. బతుకమ్మను పట్టుకొని అట్లా నడిచిపోతున్న తీగ వంటి కోమలులను చూస్తుంటే తీగలే సాగి నడిచిపోతున్నట్టుగా తోచింది కవికి. పండుగకు బతుకమ్మను, ఇంటినీ, ఒంటినీ ముస్తాబు చేసుకోవడం కూడా సంస్కృతిలో భాగమే కదా!

**'ఏ రోజూ వంచని తలైనా**
**ఆ రోజు పెద్దల ముందు వంచక తప్పదు**
**జమ్మి బంగారంతో మురిసిపోకా తప్పదు**
**జమ్మి ఆకులతో ఆ సాయంత్రం వంగిపోతుంది**
**జమ్మి ఒక చేయి నుంచి / మరో చేయికి మారిందంటే**
**హృదయాలు హత్తుకుపోయ్యి చేతులు వీపుల్ని నిమురుతాయి**
**పాత శత్రుత్వాల్ని తెగ నరికే ఆయుధం జమ్మి" –జింబో**

బతుకమ్మ పూల పరిమళం ఇగిరిపోక ముందే దసరా పండుగ వచ్చేస్తుంది. దసరా అంటే సరదా ఒక వైపేతే మరో వైపు ఆయుధ పూజ, మేక పిల్లను "గావు" పట్టడం, జమ్మి చెట్టు పూజ, పాలపిట్ట దర్శనం, జమ్మి ఆకునే 'బంగారం'గా చేతిలో పెట్టి పెద్దల దీవెనలు తీసుకోవడం, దోస్తులతో అలాయి బలాయి తీసుకోవడం.. ఇవన్నీ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే అంశాలు. బతుకమ్మ, దసరా పండుగలకు ప్రతీ ఇల్లు సంతోషపు కెరటాలతో అనంద సాగరమవుతుంది. 'పాత శత్రుత్వాల్ని తెగ నరికే ఆయుధం జమ్మి' అని అనడంలోనే తెలంగాణ జీవితం, అనుబంధాలు దాగి ఉన్నాయి.

**"పండుగ రోజులల్ల / లైట్లు లేకపోయినా**
**పల్లె పల్లంతా గొప్ప వెలుగే**
**గాలినిండా / గునుగులూ, తంగేళ్ల గుసగుసలే**
**జీవితం వన్నె దిద్దుకొని / ఉయ్యాల పాటల అలల మీద తేలే**
**సద్దుల బతుకమ్మైపోతది / సుద్దుల్నీ సద్దుల్నీ**
**వాయినాలుగా ఇచ్చిపుచ్చుకున్న తృప్తి**
**చెవికమ్మల మెరుపుల / తళుక్కుమంటది" ! – దేశపతి శ్రీనివాస్**

తెలంగాణ పల్లె తనను తానే దేవులాడుకుంటున్న దృశ్యాన్నంతా చిత్రిక పట్టి చూపిన కవిత ఇది. ముఖ్యంగా పండుగ రోజుల్లో పల్లెలు ఎంత శోభాయమానంగా వెలిగిపోతాయో కవి చాలా సమర్థవంతంగా వివరిస్తాడు. ఏ ఇంటికి పోయినా తంగెడు పువ్వులు, గునుగుపూల గుసగుసలే వినిపిస్తాయంటాడు. జీవితం బతుకమ్మలా మురిసిపోతది. కాని పండుగ అయిపోయిన తర్వాత ఆడపడుచులు మళ్లీ తను పెరిగిన ఊరును, తల్లిగారింటిని, దోస్తులను వదిలి పోవాలంటే మనసంతా కలత పడ్డ ఆవులాగా అయిపోతుందంటాడు. **'గౌరమ్మను సాగనంపినట్లు గావురంగ సాదిన బిడ్డను పంపలేక చిట్టిచేతుల టాటాలకు జవాబీవ్వలేక'** కన్న తల్లిదండ్రుల ఆవేదనకు మన కళ్లూ చెమర్చుతాయి. పండుగ, ఆడబిడ్డా వెళ్లిపోయిన తదుపరి ఇల్లు బతుకమ్మను చెరువులో వేసిన అనంతరం ఖాళీగా మిగిలిపోయిన తాంబాలమవుతుందనడంతో మనస్సు చివుక్కు మంటుంది. **'మల్లొచ్చే ఏటిదాకా ఒంటరి పాటొకటి పల్లెగుండెలో ఊపిరి ఉయ్యాల ఊపుతది'** అనడంలో తెలంగాణ సంస్కృతిలోని ఎదురుచూపంతా కనబడుతుంది. ఇంతే ఆర్ద్రతను, అందాన్ని, ఆనందాన్ని పంచే మరో మంచి కవిత ఏనుగునరసింహారెడ్డి రాసిన 'బతుకమ్మకల'

**"ఎంగిలి పువ్వుకూ చద్దుల బతుకమ్మకూ**
**పూల గుత్తుల వంతెన కట్టీ**
**పాటల రహదార్లను పరిచాకనే**
**కొత్త పెండ్లి పిల్లలు**
**పిందారబోసిన వెన్నెల్లో అటల ఆరిందలయ్యింది**

-----------------

**పోయే పోయే గౌరమ్మా / పొన్నగంటి గౌరమ్మా**
**తాడులోతు నీళ్లల్లో / తరలిపోయే గౌరమ్మా**
**మల్లొచ్చే పండుగాకు / మళ్ళీ మళ్ళీ రావమ్మా!"**

బంగారు కాంతులీనే తంగెడు పువ్వు చుట్టూ గునుగు పూలు అమరినట్టు, చెరువు కట్టమీద నడుమ బతుకమ్మను పెట్టి చుట్టూ చప్పట్ల తాళాలు కొడుతూ సీతమ్మ శోకాన్ని రాగయుక్తంగామగువల పండుగే అయినా బతుకమ్మకు కావాల్సిన పూలను సేకరించడంలో పిల్లలు, పురుషులే ముందుంటారు. అక్కలకు బదులు తమ్ముళ్లకే రెండు వారాల ముందు బతుకమ్మ పండుగ మొదలయ్యేది. వేకువ జామునే మంచు బిందువుల కిరీటాలను ధరించిన తంగెడు పూలను తల నిమిరి జాగ్రత్తగా గంపల్లోనో, చేసంచుల్లోనో వేసుకునేది. అట్లా ప్రకృతిలో దొరికే తీరొక్క పూవును ఇంటికి తీసుకొచ్చి బతుకమ్మలో కొలువుదీరేలా చేసేది. సాయంత్రం చీకటి ముసురుకునే దాకా ఆడి మెల్లగా చెరువు అలల మీద వదిలి వీడ్కోలు పలుకుతారు. అది తల అటూ ఇటూ ఊపుతూ అందంగా ముందుకు కదిలిపోతుంది. వాయనాలు ఇచ్చి పుచ్చుకొని ఇంటిదారి పట్టినా బాట వెంట 'ఆట చిలుకలారా.. పాట చిలుకలారా..' అంటూ మళ్లీ పాటలే మారుమోగుతాయి. తెలంగాణలో ఈ పండుగ ఒక్కటే అతివలు ఇంటి బయట సామూహికంగా జరుపుకునేది.

పూల పండుగ / బతుకమ్మ / జీవితమే ఒక
రంగుల పండుగ / తెలంగాణకు / ప్రతీక
బతుకమ్మ పండుగ / ప్రతి పల్లె సంబురం / తంగేడు పువ్వుల
తళతళలు వీధివీధిన పూలవనాలు / బతుకమ్మ
ఆటపాటలతో/ పల్లెలన్నీ / పూల సంబరాలతో
రోజంతా/ పూల సంబరాలే / బతుకమ్మ /ఒక జీవనగీతం
ప్రకృతి పండుగ / బతుకమ్మ /పుడమికి శోభనిచ్చే / పూలకొమ్మ
తెలంగాణ / సాంస్కృతిక ప్రతీక / బతుకమ్మ/ రోజు పర్వదినం
ఆడబిడ్డల / సంబురం / ప్రకృతిని కొలిచే / ఒక సంప్రదాయం
తెలంగాణ మట్టిబిడ్డ / బతుకమ్మ / ప్రతి పల్లె / ఒక పూలవనం
బతుకమ్మ పాట / బతుకునిచ్చేది / ప్రతి నోట / జీవనపరిమళం
పూల తోట / మురిసింది / బతుకమ్మ / సిగలో ఆడింది
తొమ్మిదిరోజుల / వైభవం/ బతుకమ్మకు /రోజు పండగ
బతుకమ్మ / ప్రకృతికి మారుపేరు / ప్రతి పువ్వు / ఒక ఆదిశక్తి
పూలనే పూజించే / పూల పండుగ / అదే తెలంగాణ ప్రత్యేకత
ప్రకృతికి ప్రతీక / బతుకమ్మ /బతుకు చిత్రానికి / ముఖచిత్రం
తెలంగాణకే / ప్రత్యేకం / బతుకమ్మ / ఆడపడుచుల పండగ
ఒక్కేసి పువ్వేసి / చందమామ / మురిసిపోయిన / బతుకమ్మ
వీనుల విందులు / మహిళల పాటలు / వీధివీధిన / బతుకమ్మలు
కన్నులపండుగగా / వేడుకలు / సంబరాలు / బతుకమ్మలు
విశిష్టత పండగ / బతుకమ్మ / వినోదం పంచే / పూల పరిమళం
బతుకమ్మ / కులమతాలకు అతీతం / సామాజిక కు / దర్పణం

బతుకమ్మ పండుగ తెలంగాణకు ప్రత్యేకం. మహాలయ అమావాస్య రోజు మొదలై దుర్గాష్టమి రోజు ముగుస్తుంది. ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక చిహ్నం. తెలంగాణ మలిదశ ఉద్యమం తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలని తొమ్మిది రోజులూ ఆరాధిస్తూ బొడ్డెమ్మలు వేస్తారు. కోలాటం వేస్తారు. ఆడబిడ్డలు కష్టసుఖాలు, ప్రేమలు, భక్తి, అనురాగాలు అన్ని పాటల ద్వారా గౌరమ్మను ఆరాధించి తొమ్మిదిరోజుల తర్వాత గంగమ్మ ఒడిలో ఉంచి సాగనంపుతారు. కన్నుల పండుగగా సాగే ఈ పండుగ ప్రస్తుతం తెలంగాణలో ఒక ఉద్యమ స్ఫూర్తి గా నిలిచింది. మలిదశ ఉద్యమంలో ఈ పండుగ సబ్బండ వర్గాలను ఏకం చేసి రాష్ట్ర సాధనలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. జాగృతి లాంటి సంస్థలు ఈ పూల పండుగకి బ్రహ్మరథం పట్టి జనాకర్షణగా మలిచారు. ఈ పండుగ పేర బోలెడంత సాహిత్యం వస్తున్నది. భీంపల్లి బతుకమ్మను వస్తువుగా తీసుకొని అది తెలంగాణ పల్లె జీవితానికి ఎన్ని రంగులద్దుతున్నదో మనకు ఈ నానీల్లో ఆవిష్కరిస్తున్నాడు.

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం - 16

# సీతామాలక్ష్మి

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

"కె.విశ్వనాథ్ చలనచిత్రాలు –సామాజిక అవలోకనం" నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం **"సీతామాలక్ష్మి".** ఈ చిత్రం 1978 లో 2గం.17ని ల నిడివితో రూపొందించబడింది. ఈ చిత్రంలో ప్రధాన తారాగణంగా చంద్రమోహన్, రామేశ్వరిలు నటించారు. చిత్ర కథాంశం చలనచిత్ర పరిశ్రమ నేపథ్యంలో సాగుతుంది. వాస్తవానికి ప్రతి మనిషికి కొన్ని కలలు వుంటాయి. అందులో కొన్ని కలలు వారి జీవన విధాన స్థాయికి తగ్గ రీతిలో వుంటే, మరికొన్ని కల్పనకు బాగుంటాయి కాబట్టి ఏదో అలా ఊహించుకునేలా వుంటాయి అంతే. **'కళ్ళు చిన్నవైనంత మాత్రాన చిన్న కలలు కంటామా'** అన్నట్లు ఈ మధ్యకాలంలో వచ్చిన ఒక చిత్రంలోని పాటలోని వాక్యాల మాదిరిగానే ప్రతి మనిషికి కలలు సహజం. కాని ఆ కలలు నిజం కావాలంటే చెయ్యాల్సిన పరిశ్రమ చాలా పెద్దది. కాని చాలా తక్కువ సందర్భాల్లో పెద్ద కలలు కూడా మనం ఊహించనంత వేగంగా విజయవంతంగా కార్యరూపంలోకి మారే కొన్ని సందర్భాల్లో చాలా తక్కువమంది జీవితాల్లో వుంటాయి. దాన్నే అదృష్టం అంటాం. అలా సరదాగా కలలు కన్న ఒక అమ్మాయి జీవితంలో ఆ కల నిజమైతే అది సంతోషించాల్సిన విషయమే కాని ఆ తర్వాత దాని పర్యవసానాలు ఎలా వుంటాయి అనే దానికి దృశ్యరూపం ఇచ్చిన చిత్రమే "సీతామాలక్ష్మి"

**చిత్ర కథ :**

సీతాలు (రామేశ్వరి), కొండయ్య (చంద్రమోహన్) వరసకు బావ–మరదళ్ళు. ఇద్దరూ వాళ్ళు వుండే ఊర్లో చిన్న థియేటర్లో కలిసి పనిచేస్తూ వుంటారు. థియేటర్‌లో కథానాయికల హావభావాలు, డాన్స్‌లు చూసి సీతాలు అప్పుడప్పుడు తను కూడా అలా చేస్తూ వుంటుంది. బావా, మరదలు ఇద్దరికీ ఒకరంటే ఒకరికి అమితమైన ప్రేమ. కొండయ్య తల్లిదండ్రులు లేని వాడు. సీతాలు తండ్రి సింహాద్రికి తన కూతురంటే చాలా ప్రేమ. సింహాద్రి కొడుకు రోశయ్య, కోడలు చిట్టి. చిట్టి తన సూటి పోటి మాటలతో సీతాలు మరియు మామగారైన సింహాద్రిని ఇబ్బంది పెడ్తూ వుంటుంది. ఆమె భర్త రోశయ్య ఎలాంటి కష్టమూ చెయ్యకుండా చెల్లి, తండ్రి సంపాదనపై ఆధారపడి జీవిస్తూ వుంటాడు.

అదే ఊర్లో రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మాష్టర్‌గా పనిచేసే మాష్టరుకు బాగా దగ్గరి వ్యక్తిగా నమ్మినబంటుగా వుంటాడు కొండయ్య. స్టేషన్ మాష్టారుకు ఒక కూతురు వుంటుంది. ఆమె పేరు సుభద్ర. సుభద్రను వరుసకు మేనల్లుడైన వ్యక్తికి ఇచ్చి వివాహం చేస్తాడు స్టేషన్ మాష్టర్. కాని సుభద్ర భర్త ఆమెను తరచుగా కట్నం కోసం అంటే సుభద్ర తండ్రితో డబ్బులు తీసుకురమ్మంటూ వేధిస్తూ వుంటాడు. వివాహం



తర్వాత కూడా మామగారి డబ్బులకు ఆశపడి సుభద్రను హింసిస్తూ వుంటాడు. ఇదంతా తెలిసి కూడా సుభద్ర తండ్రి అతడిని పల్లెత్తు మాటకూడా అనలేకపోతుంటాడు. కూతురిని ఇచ్చి వివాహం చేశాననే కారణంతో అల్లుడిని గట్టిగా ఏ విషయమూ అడగలేని నిస్సహాయ స్థితి ఆ స్టేషన్ మాష్టారుది.

అదే ఊర్లో పెద్దమనిషిగా చలామణి అవుతూ థియేటర్ యజమానిగా మంచి పేరున్న వ్యక్తి చిన్నయ్య (అల్లు రామలింగయ్య). చిన్నయ్య పాత్ర చిత్రంలో హాస్యం ఎపిసోడ్స్ అన్నింటికీ ప్రతినిధిగా పనిచేస్తుంది. ఒకరోజు చిన్నయ్య ఇంటికి ఒక చిత్ర నిర్మాత వస్తాడు. కారణం అతడు నిర్మించబోయే తదుపరి చిత్రానికి లొకేషన్స్ వెతికేందుకై. ఆ నిర్మాత చిన్నయ్యతో మాట్లాడుతూ ఊర్లో షూటింగ్‌కు పర్మిషన్ అడిగి బయలుదేరతాడు. ఆ సమయంలో ఊరి బయట ఆ నిర్మాతకు ఒక అమ్మాయి తారసపడుతుంది. ఆమె తన తదుపరి చిత్రానికి హీరోయిన్‌గా పనికి వస్తుందని నిర్ణయించుకొని తనతో ప్రస్తావిస్తాడు. ఆ అమ్మాయే సీతాలు. సీతాలు, తన బావ కొండయ్య ఆ నిర్మాత మాటలు విని ఊర్లో వారందరికీ సంబరంగా చెప్తారు. మరోవైపు అప్పటిదాకా ఇష్టం వచ్చినట్టు సూటిపోటి మాటలతో హింసించే సీతాలు అన్నయ్య, వదినలు సీతాలు, తండ్రి సింహాద్రిలను ముందెన్నడూ చూడలేనంత ప్రేమతో చూసుకోవడం మొదలు పెడతారు. కాని కొన్ని రోజులు గడిచినా పట్నంలోని ప్రొడ్యూసర్ నుండి ఎలాంటి పిలుపు రాకపోవడంతో సీతాలు, కొండయ్య నిరాశకు లోనవుతారు. కాని ఊర్లో వాళ్ళందరూ మరియు సీతాలు కుటుంబం కూడా ఆమెను, కొండయ్యను హేళన చేస్తూ అవమానిస్తూ వుంటారు. అది భరించలేని కొండయ్య తన మామకు చెప్పకుండా

సీతాలును తీసుకొని పట్నం వెళ్తాడు. కాని అక్కడికి వెళ్ళాక పల్లెటూరు నుండి పట్నం వెళ్ళిన ప్రతి ఒక్కరూ మొదట్లో ఎలాంటి కష్టాలు పడతారో అలాంటి కష్టాలే పడుతూ వుంటారు. చాలా కష్టానికి ఓర్చి మూర్తి అడ్రస్ కనుక్కుంటాడు కొండయ్య. కాని మూర్తి తను ఇచ్చిన మాట మర్చిపోయి సీతాలు, కొండయ్యను అక్కడినుంచి పంపించేస్తాడు. ఊరొదిలి ఆశతో పౌరుషంగా పట్నం వచ్చిన కొండయ్య, సీతాలును మళ్ళీ ఇంటికి తీసుకెళ్ళడం ఇష్టంలేక చిన్నాచితక పనులు చేస్తూ ఆమెను ప్రేమగా చూసుకుంటూ వుంటాడు కొండయ్య.

కొండయ్యకు ఒకరోజు ఒక వ్యక్తి పరిచయం అవుతాడు. అతడి పేరు రవి. అతడు సినిమాలకు పోస్టర్ డిజైన్స్ చేయడానికై పెయింటింగ్ వేస్తూ వుంటాడు. కొండయ్యతో పాటు వచ్చిన సీతాలు పెయింటింగ్‌ను వాళ్ళతో మాట్లాడుతూనే చిత్రిస్తాడు. అంతేకాక రవికి సీతాలు మోములో ఏదో ప్రత్యేకత కన్పిస్తుంది. రవి ఆమెను, ఆమె యొక్క చిత్రపటాన్ని ఒక ప్రొడ్యూసర్‌కు చూయించి ఆమెకు హీరోయిన్ అవకాశం కల్పిస్తాడు. కొంతకాలం లోనే సీతాలు హీరోయిన్‌గా నిలదొక్కుకుంటుంది. ఒకరోజు కొండయ్య సీతాలు హీరోయిన్ అయ్యింది అనే విషయం చెప్పడానికి గ్రామానికి వెళ్తాడు. సీతాలు తండ్రి కొండయ్యను పట్టుకుని తన కూతురిని ఏం చేశావ్ రా అంటూ, ఊర్లో పదిమందిలో తన పరువు పోయేలా చేశావు కదరా అంటూ చితకబాదుతాడు. కాని అతడి కోపాన్ని సానుకూలంగా అర్థం చేసుకున్న కొండయ్య సహనంతో వుంటాడు. పట్నం నుండి సీతాలు పంపిన డబ్బులు, తన తల్లికి పంపిన చీర, తండ్రికి పంపిన బట్టలు ఇస్తూ ఆమె హీరోయిన్ అయింది అని తెలిపే ఫోటో చూపిస్తాడు. కొండయ్యను తప్పుగా అర్థం చేసుకుని చేయి చేసుకున్నందుకు సీతాలు తండ్రి సింహాద్రి పశ్చాత్తాపం చెందుతాడు. ఇక అంతకుముందు సీతాలును పదేపదే తిట్టిపోసే వదిన తన భర్తను వెంటేసుకుని మామగారైన సింహాద్రికి గౌరవ మర్యాదలిస్తూ దగ్గరవుతుంది. ఇక అన్న, వదిన, నాన్న ఇలా అందరూ బాగా పేరు, డబ్బు సంపాదించిన సీతాలు ఇంట్లోకి మారుతారు. సీతాలు పెద్ద హీరోయిన్ గా గుర్తింపు పొందాక 'సరితా దేవి'గా పేరు మార్చుకుని తాను ఊహించిన దానికంటే గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తుంది. ఒకరోజు షూటింగ్ సమయంలో ఒక హీరో సరిత(సీతాలు)తో తప్పుగా ప్రవర్తిస్తుండడం చూసి కొండయ్య ఆ హీరో పై చెయ్యి చేసుకుంటాడు, అంతేకాక ఆ చిత్రంలో సరితాదేవి నటించడం కుదరదు అని ప్రొడ్యూసర్‌తో చెప్తాడు. కాని చిత్రాన్ని నిర్మించడం డబ్బుతో కూడిన వ్యవహారం అవడం చేత అప్పటికే నిర్మాతలు ఎక్కువ మొత్తంలో ఖర్చుపెట్టి వుండడం చేత సరితాదేవి తప్పనిసరి పరిస్థితుల్లో ఆ చిత్రంలో నటించక తప్పదు అని కొండయ్యకు తెగేసి చెప్తుంది.

కొండయ్య సరితను ఆ చిత్రంలో నటించవద్దని చెప్పినా తన మాట వినిపించుకోలేదని బాధపడతాడు. అంతేకాక ఆ కోపంలో ఆమెకు దూరంగా వుంటాడు. సరిగ్గా ఆ సమయాన్ని అవకాశంగా తీసుకున్న సరితా దేవి (సీతాలు) అన్న– వదినలు కొండయ్య పై లేనిపోని అభాండాలు మోపి అక్కన్నుండి వెళ్ళగొడతారు. మరో వైపు స్టేషన్ మాష్టర్ కూతురు సుభద్రతో అల్లుడు గొడవ పెట్టుకుని ఇంట్లో నుండి వెళ్ళిపోతాడు. కూతురు జీవితం దీనంగా మారిపోయిందనే బెంగతో స్టేషన్ మాష్టర్ చనిపోతాడు. పట్నం నుండి వచ్చిన కొండయ్య సుభద్ర పరిస్థితిని అర్థం చేసుకుని ఆమెకు అండగా వుంటాడు. కాని కొండయ్య మనసెప్పుడూ తన మరదలు సీతాలు (సరితా దేవి) చుట్టూనే తిరుగుతూ వుంటుంది. ఆమెకు ఉత్తరాలు కూడా రాస్తూ వుంటాడు కాని ఆమె నుండి బదులు రాదు. కారణం సరితాదేవి అన్న, వదినలు ఆ ఉత్తరాలు ఆమెకు చేరకుండా చేయడం. సుభద్రను వదిలేసి వచ్చిన ఆమె భర్త యాదృచ్ఛికంగా హీరోయిన్ సరితాదేవి ఇంట్లో ఉద్యోగం చేస్తూ పనికి కుదురుతాడు. కాని సరితా దేవి అన్న – వదినలు అతడిని పనిలో చేర్చుకోవడానికి ముందు నువ్వొక అబద్ధం చెప్పాలని అతడికి ఒక షరతు పెడతారు. దానికి అతడు అంగీకరిస్తాడు. అదేమిటంటే తన భార్య సుభద్రను కొండయ్య వివాహం చేసుకున్నాడని సరితాదేవితో అబద్ధం చెప్పడం. అదే విషయాన్ని సరితాదేవి ముందు చెప్తాడు సుభద్ర భర్త. అది తెలిసి కోపంగా కొండయ్యను కలవడానికి బయలుదేరుతుంది సరితా దేవి (సీతాలు). ఆమె ఊర్లో రైలు దిగే సమయంలో సరిగ్గా కొంత దూరంలో కొండయ్య గర్భవతిగా వున్న సుభద్రను ఒక గుర్రపు బండిలో ఎక్కించుకుని వెళ్తూ వుంటాడు. అది చూసి కొండయ్యను సరితాదేవి తప్పుగా అర్థం చేసుకుని బాధగా అక్కడి నుండి బయలు దేరుతుంది.

కొన్ని సంవత్సరాలు గడుస్తాయి. సుభద్రకు పుట్టిన బాబు పెరిగి పెద్దవాడవుతాడు. సరితాదేవిని ఒక సంస్థ వారు వేదికపై సత్కారానికి పిలుస్తారు. అక్కడ వేదికపై పాట పాడడానికి సుభద్ర బాబు వెళ్తాడు. చాలారోజుల తర్వాత ఆ వేదికలో సరితాదేవి సుభద్రతో పాటు తన బావ కొండయ్యను చూస్తుంది. ఆ కార్యక్రమం తర్వాత సరితాదేవి ఆ బాబుకు పాటలు పాడడానికి మరిన్ని అవకాశాలు కల్పిస్తాను అని మాట ఇచ్చి వీలు కుదిరినప్పుడు వచ్చి కలవమంటుంది. కాని అదే సమయంలో సుభద్రకు, సరితా దేవికి మధ్య చిన్న వాగ్వాదం అవుతుంది. ఆ విషయం గమనించిన సుభద్ర కుమారుడు తన తల్లికి చెప్పకుండా పట్నం వెళ్ళి సరితా దేవిని కలిసే ప్రయత్నం చేస్తాడు. సరితాదేవి అన్న ఆ బాబును కొట్టి పంపే ప్రయత్నం చేస్తుండగా అక్కడే పనిచేసే సుభద్ర భర్తకు కొన్ని నాటకీయ పరిణామాల మధ్య అతడు తన కుమారుడే అని తెలుస్తుంది. చాన్నాళ్ల నుండి తాను చేసింది తప్పు అని అర్థం చేసుకున్న సుభద్ర భర్త తన కళ్ళ ముందు తన కుమారుడిని వేరొకరు కొట్టడం, తిట్టడం లాంటివి చూసి సహనం కోల్పోతాడు. తన భార్య సుభద్రను కొండయ్య వివాహం చేసుకోలేదు అతడు ఏ తప్పూ ఎరగడు అనే విషయాన్ని

సరితాదేవికి చెప్తాడు సుభద్ర భర్త. అది తెలిసి సరితాదేవి తన బావ కొండయ్యను తాను ఎలాగైనా కలవాలి అని రవితో తన నిర్ణయాన్ని చెప్తుంది. రవి బాగా నువ్వున్న సెలెబ్రిటీ స్థాయికి అది సాధ్యం కాదు అని చెప్పి తనకు ఒక నాటకం ఆడమని చెప్తాడు. అదేమిటంటే సరితా దేవి కారు దురదృష్టం కొద్దీ ఒక లోయలో పడినట్టు అందువల్ల ఆమె మరణించినట్లు సమాజానికి ఒక భ్రమ కల్పించాలని చెప్తాడు. పథకం ప్రకారం రవి చెప్పినట్లే చేస్తుంది సరితాదేవి. ఆ తర్వాత సరితాదేవి మరణించిందని సమాజం మొత్తం భావిస్తుంది. తదుపరి సరితాదేవి మళ్ళీ పాత సీతాలుగా మారి మునుపటి జీవనశైలికి సంబంధించిన వేషధారణలో తన బావ కొండయ్య వద్దకు వెళ్ళడంతో కథ సుఖాంతం అవుతుంది.

**చిత్ర విశేషాలు :**

ప్రతి మనిషి జీవితంలోనూ కలలు ఉంటాయి. వాటిని సాధించుకోడానికి ఎన్నో కష్టాలు అనుభవించాల్సి వుంటుంది. కాని వాటిని సాధించిన తర్వాత ఆ స్థాయిని కాపాడుకోవడానికి ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుంది. నచ్చిన విషయాలను, వ్యాపకాలను వదిలేయాల్సి వస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో వ్యక్తిగతంగా ఆ నిర్ణయం తీసుకుంటే పర్లేదు. కాని కొందరు వ్యక్తులు వారి స్వలాభం కోసం మనకు నచ్చిన విషయాలను మన నుంచి విడదీస్తే ఎలా వుంటుంది అనడానికి ఈ చిత్రం ఉదాహరణ. సీతాలు హీరోయిన్‌గా మారిన తర్వాత సరితాదేవిగా పేరు ప్రతిష్టలు సంపాదిస్తుంది. ఆమె అన్నావదినలు సీతాలు బావ కొండయ్యను ఆమె దూరం చెయ్యాలని భావించి అతడిపై నిందలు మోపి ఆమె నుండి దూరం చేస్తారు. కొండయ్య గురించి పూర్తిగా తెలిసి కూడా తన వృత్తిలోని సంక్లిష్ట పరిస్థితుల వల్ల అనగా ప్రొడ్యూసర్‌లతో అడ్వాన్స్ తీసుకొని వుండడం, కాల్షీట్లు ఇచ్చి వుండడం వల్ల తప్పని పరిస్థితిలో కొండయ్యను దూరం చేసుకోవడానికి సిద్ధపడుతుంది సరితాదేవి.

మనం నిత్యం ఒక మాట వింటూ ఉంటాం. **'కళ్ళతో చూసే ప్రతీది, చెవులతో వినే ప్రతీది నిజం కాదు'** అని. ఏ విషయంపై అయినా పూర్తి నిర్ణయానికి రాకూడదు అనే విషయాన్ని ఈ చిత్రం మరోసారి తెలుపుతుంది. అదెలాగంటే చిత్రంలో సరితా దేవి (సీతాలు) కొండయ్యను రెండు సందర్భాల్లో తప్పుగా అర్థం చేసుకుంటుంది. మొదటిసారి సరితాదేవి హీరోయిన్‌గా మారాక కొండయ్య ఆమెతో గొడవపడి వెళ్ళిపోయిన తర్వాత తన వద్ద సుభద్ర భర్త ఉద్యోగంలో చేరాక కొన్నాళ్ళకు సుభద్రను కొండయ్య వివాహం చేసుకున్నాడని సరితదేవికి తన అన్నావదినలు చెప్తారు. అప్పుడు సుభద్ర భర్త అంత దారుణమైన అబద్ధాన్ని, అదీ తన దాంపత్య జీవితానికి సంబంధించి నది అనే ఆలోచన ఏ మాత్రం లేకుండా సిగ్గులేనితనంతో సాధించిన ఆ అబద్ధాన్ని సమర్థించినప్పుడు సరిత నమ్మడం. రెండవసారి సరితా దేవి ఊరికి వెళ్ళినప్పుడు స్టేషన్ వద్ద కొంతదూరంలో కొండయ్య




గర్భవతిగా వున్న సుభద్రను గుర్రపుబగ్గీలో తీసుకెళ్తుండడం చూసి నిజంగానే కొండయ్య సుభద్రను వివాహం చేసుకున్నాడని భావిస్తుంది. కొండయ్యను తప్పుగా అర్థం చేసుకుంటుంది.

ఇక స్టేషన్ మాస్టర్ తన ఆర్థికస్థితికి తగ్గట్టు తన కూతురును తన స్వంత మేనల్లుడికి ఇచ్చి వివాహం చేస్తాడు. కాని అతడు స్వంత మామ కూతురు అనే ఆలోచన కూడా లేకుండా ఆమెను తరచూ డబ్బుల కోసం చిత్రహింసలు పెడుతూ వుంటాడు. కూతురు వున్న ప్రతీ తండ్రికి మన సమాజంలో తరచూ ఎదురయ్యే పరిస్థితి ఇది. ఆడపిల్లకు పెళ్ళి చెయ్యడానికి ముందు వరకట్నం అనేది ఒక పెద్ద గుదిబండ అయితే, పెళ్ళి తర్వాత దురదృష్టం కొద్దీభార్య డబ్బుకు ఆశపడే వ్యక్తి ఏ అమ్మాయికి భర్తగా వచ్చినా ఆమె జీవితం నరకమే. నిజానికి ఈ సమస్య మన సమాజంలో అన్ని కాలాలకు, అందరికీ ఎక్కడో ఒకచోట అనుభవంలోకి వచ్చే విషయమే. కొండయ్య, సీతాలు పాత్రల్లో చంద్రమోహన్, రామేశ్వరిలు మంచి నటనను కనబర్చారు.

ఎక్కువ హాస్య పాత్రలు లేకుండా చిత్రంలో కేవలం ఒకే ఒక్క హాస్య పాత్రతో ప్రేక్షకుడిని నవ్వుల్లో ముంచెత్తేలా హాస్యానుభూతి కలిగింప చేయవచ్చని ఈ చిత్రంలో అల్లు రామలింగయ్య పాత్ర ద్వారా ఋజువు చేశారు దర్శకుడు. చిన్నయ్య పాత్ర ద్వారా అల్లు రామలింగయ్య ఒకవైపు ఊర్లో పెద్దరికం ప్రదర్శిస్తూనే మరోవైపు తనకున్న వ్యక్తిగత ఆరోగ్య లోపం సృష్టించే ఇబ్బంది వల్ల అతడు పడే వింత యాతన ప్రేక్షకుడిని కడుపుబ్బా నవ్విస్తుంది.

సీతాలు అన్నావదిన పాత్రలు మన సమాజంలో సగటు మనిషిలోని చెడు వ్యక్తిత్వం ఎలా వుంటుందో తెలియపర్చేలా వుంటాయి. తరచూ సీతాలు, ఆమె తండ్రి సింహాద్రిని మాటలతో గాయపరిచే ఆమె అన్నావదినలు సీతాలుకు సినిమాల్లో నటించే అవకాశం వచ్చిందని తెలియగానే వారి వైఖరిని మార్చుకుని ప్రేమను ప్రదర్శిస్తారు. కాని సీతాలుకు నటించడానికి రమ్మనే పిలుపు రావాల్సిన సమయానికి రాకపోవడంతో మళ్ళీ హింసించడం మొదలెడతారు. సీతాలును ఎవరికీ తెలియకుండా కొండయ్య పట్నం తీసుకెళ్లి హీరోయిన్ చేశాడని తెలిశాక మళ్ళీ ఆమెకు దగ్గరవడం మొదలెడతారు. అంతేకాక ఆమెకు తోడుగా వుండే కొండయ్యపై అభాండాలు మోపి ఆమె నుండి, ఆమె మనసులో నుండి పూర్తిగా దూరమయ్యేలా చేసి ఆమె సంపాదించే




ఆస్తులతో భోగాలు అనుభవిస్తూ వుంటారు. వీరి పాత్రలు డబ్బులు వున్నప్పుడు, లేనప్పుడు మనుషుల మనస్తత్వాలు ఎలా వుంటాయో తెలియజేసేలా వుంటాయి.

ఈ చిత్రానికి సంగీతం కె.వి.మహదేవన్ అందించగా సాహిత్యం వేటూరి, దేవులపల్లి కృష్ణశాస్త్రి లు అందించారు. కె.విశ్వనాథ్ చిత్రాల్లో సంగీతం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. చిత్రంలో ప్రధాన పాట చిత్ర కథకు ఊపిరి పోసే పాట **'సీతాలు సింగారం/ మాలక్ష్మి బంగారం'** ఈ పాటకు సాహిత్యాన్ని వేటూరి అందించారు. ఈ పాట చిత్రంలోని ప్రధాన పాత్రలైన సీతాలు, కొండయ్యల వ్యక్తిత్వాన్ని తెలిపేదిగా వుంటుంది. మరొక పాట **'పదే పదే పాడుతున్న పాడిన పాటే'** ఈ పాట సీతాలు హీరోయిన్‌గా మారి సరితాదేవిగా గుర్తింపు పొందాక కొండయ్య తో విభేదాలు వచ్చి దూరమైన చాన్నాళ్ల తర్వాత ఒకరోజు వేదికపై ఆమెకు జరిగే సత్కార కార్యక్రమంలో సుభద్ర కుమారుడు, కొండయ్య పర్యవేక్షణలో పెరిగినటువంటి చిన్న బాబు పాడే పాట. ఈ పాట కొండయ్య సీతాలు పట్ల ఎంత ప్రేమను దాచుకుని జీవిస్తున్నాడో తెలిపేదిగా వుంటుంది. చిత్రంలో మొత్తం ఏడు పాటలుంటాయి. ఈ చిత్రంలో కథానాయిక రామేశ్వరి నటనకు ఫిలింఫేర్ అవార్డు కూడా లభించింది. ఈ చిత్రం హిందీలో 'సితార' పేరుతో రీమేక్ చేయబడగా, తమిళంలో 'ఎనిప్పడిగల్' పేరుతో నిర్మించబడింది.

మొత్తంగా ఈ చిత్రం ద్వారా దర్శకుడు కె.విశ్వనాథ్ మనకు కనిపించే సినీ ప్రముఖుల జీవితాలలో ఎలాంటి కుదుపులు, మలుపులు వుంటాయనే విషయాన్ని ఆవిష్కరించారు.

**చిత్రం: సీతామాలక్ష్మి**

**తారాగణం : చంద్రమోహన్, రామేశ్వరి, అల్లు రామలింగయ్య, పి.ఎల్.నారాయణ, వంకాయల సత్యనారాయణ, డబ్బింగ్ జానకి**

**సంగీతం : కె.వి.మహదేవన్**

**సాహిత్యం : దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేటూరి**

**నిర్మాత : మురారి– నాయుడు**

**కథ, దర్శకత్వం : కె. విశ్వనాథ్**

# వృద్ధ యవ్వన

యౌవనాన్ని మర్చిపోయిన అందాన్ని ...
అమ్మ అనే పిలుపుకై ఎదురు చూసే ఆరాటాన్ని
ఆకలిని ఆవళింపు చేసుకున్న అవిటిదాన్ని
ఆశ్రయం కోల్పోయిన అబలని
అనునిత్యం ఈ సడింపుల నడుమ నలిగే మౌనాగ్నిని
చినిగిన వస్త్రాలు చింపిరి జుట్టు నా అందానికి రహస్యాలు..
ఇంతకీ నేనెవరో తెలుసా ?

పండు వారిన గుండెని గుండెలోతుల్లో బల్లై పోయిన బండని...
బంధాల బారినుండి బదిలీ చేయబడ్డ మర మనిషిని
ఈ సమాజం వేసే శిక్షని భరించే జీవిత ఖైదీని
ఇంతకీ నేనెవరో తెలుసా?

రాలే ఆకుని రాలుగారే కన్నీటిని
రాబందుల చెరలో చిక్కని ప్రాణాన్ని
నా ఒళ్ళంతా కంపూ పూలాంగ్ వాగులా కానీ....
మనస్సు మాత్రం ఇంపే తెల్లని మల్లె పువ్వులా

నాకంటు ఏమీలేదు
అతుకుల సంచి చిల్లుల గిన్నె తప్ప
అవే నా ఆస్తి ఎవ్వరు దోచుకొని స్థిరాస్తి
నేను కోరుకునేది కోట్లు కాదు
పిడికెడు మెతుకులు చీదరింపు లేని ప్రేమలు
ఇప్పుడైనా గుర్తొచ్చానా నేనెవరినో
పండు ముసలి ప్రాణాన్ని
ఏ పాపం ఎరుగని పేదదాన్ని



**సాయి లక్ష్మి**
ఫోన్ : 9701509056

కీ.శే. బి.ఎన్.శాస్త్రి

# శాసనములలో తెలుగు భాషా పరిణామము

అముద్రిత సిద్ధాంత గ్రంథం

'స్కందో' అను లాటిను పదమునకు 'ఛందస్' అను సంస్కృత పదమునకు సంబంధము కలదు.

'స్కందో' అనుపదమునకు ఛేదించుట, విభజించుట అని యర్థములు. కవులు లయాన్వితములుగా శ్రుతికి అనుమూలముగా రచించిన పద్యములను లాక్షణికులు పరీక్షించి కొన్ని సూత్రములను రచించినారు. అట్టి సూత్రసముదాయునకు ఛందశ్శాస్త్రమని పేరిడినారు.

భారతావనియందీ స్వరసాంప్రదాయము ఒక్క విధముగా లేదు. వైదిక ఛందస్సులోనున్న స్వరములు పరంపరగా నోటిమూలమున వచ్చుటవలన ఉచ్చ, నీచ, సమానత్వములను స్వరజ్ఞానము సరిగానున్నట్లు భావింపరాదు.

సంస్కృత భాషయందీ స్వరపద్ధతి మాత్రాఛందస్సునను కొలదిగను విషయమ వృత్తములకు ఎక్కువగాను నిలచినది. ప్రాకృతమున మాత్రాఛందస్సుకే అధిక ప్రాధాన్యమొసంగబడినది. మాత్రాగణ సంప్రదాయము ద్రావిడ భాషాకుటుంబములకు విస్తరించినది.

లాక్షణికులు పాటలకు లక్షణములంతగా విధించలేదు. షట్పదులు, అష్టపదులు. ఆంధ్రభాషయందు, జనసామాన్యమున వాడుకలో నున్నవి. కన్నడము కావ్యాములందీ షట్పదాదులను వాడినారు.

లాక్షణికుల దృష్టినాకర్షించిన ఛందస్సులలో వృత్తములు, మాత్రా ఛందస్సులు ద్రావిడ భాషలోనున్నవి.

వైదికచ్ఛందస్సు అక్షరగణాత్మకమనియు, ఒక అక్షరము నుండి ఏకోత్తర వృద్ధిఇగాగల అక్షర సంఖ్యగల ఇరువదియారు ఛందస్సులను క్రమముగా, ఉక్త, అత్యుక్త మధ్య ప్రతిష్ఠ, సుప్రతిష్ఠ, గాయిత్రి, ఉష్ణిక్కు, అనుష్టుప్పు, బృహతి, పంక్తి, త్రిష్టుప్పు, జగతి, అతిజగతి, శర్వరి, అతిశర్వరి, అష్టి, అత్యష్టి, ధృతి, అతిధృతి, కృతి, ప్రకృతి, ఆకృతి, వికృతి, సంకృతి, అభివృతి, ఉత్కృతి అనునవి వేళ్ళనియు ఆయా ఛందస్సులను ప్రస్తరింపగా 13,14,27,17,726 సమవృత్తములు కలుగుననియు, వేర్వేరువృత్త పాదములను ఒక పద్యములో చేర్చినవిషమ వృత్తములేర్పడునని అక్షరచ్ఛందస్సులో కాక మాత్రా ఛందస్సులు కూడా ఉన్నట్లు లాక్షిణుకులు చెప్పినారు.

సంస్కృత ఛందస్సులో అక్షర గణచ్ఛందములు, మాత్రాగణ చ్ఛందములని రెండు విధములున్నవి. ఆర్య అను మాత్రాగణ చ్ఛందములో నాల్గు పాదములుండును. రెండేసి పాదములొక అర్థము. పాదములు నాల్గు సమమైనవైనను లేక 1,3,2,4 సమ పాదములు గను ఉండును. కాని పాదములందలి గణములందు నాలుగు మాత్రలుండును. నల,గగ,ఛ,జ,స గణములుండును. బేసి గణములు జగణములుగా నుండరాదు. 6వ గణము నలముగాని, జగణము గానియై యుండవలెను.

**పద్యార్య :** ఆర్యలో మొదటి మూడు పాదములకు పదము సంపూరణమైననది పద్యార్యయనబడును.

**విపులార్య :** మూడు పాదములకు కాక నాలుగవ పాదమునకు పదము విస్తరించిన నది విపులార్య యనబడును.

**చపలార్య :** ఆర్యార్థమున రెండు, నాలుగు గణములు జగణములు, మొదటిది సగణముగా, మూడవది గగముగా, ఐదవది భగణముగా తక్కినవి ఉన్నవి ఉన్నట్లుగా నున్న నది చపలార్యయనబడును.

**ముఖ చపల :** చపలార్య మొదటి సగములో నున్న ముఖ చపలయనబడును.

**జఘనచపల :** చపలార్య రెండవ సగములో నున్న దానిని జఘన చపల యందురు. చపలార్య రెండు సగములలోను ఉన్న యెడల మహా చలయనబడును.

**గీతి :** ఆర్యలో మొదటి యర్థము వలె రెండవ యర్థమున్న దానిని గీతి యందురు. రెండవ సగమువలె మొదటి సగమున్న నది ఉప గీతి. మొదటి సగము రెండవ సగము వలె, రెండవ సగము మొదటి సగమువలెను ఉన్న యెడల నది ఉద్గీతి. సగణము ఎనిమిది చతుర్మాత్రా గణములున్న దానిని ఆర్యాగీతి యందురు.

వైతాళీయములో నాలుగు పాదములుండును.

1-3 పాదములలో 14 మాత్రలు

2-4 పాదములలో 16 మాత్రలుండును.

వైతాళీయములోని తుది గణము గగమైన దానిని అపాతలిక యందురు. వైతాళీయములోని ప్రతిపాదాంతమున గురువును చేర్చిన ఔపచ్ఛందసకమగును.

వైతాళీయములోని 1,3 పాదములలో చివరి 6 మాత్రలను ప్రత్యేక పదముతో నారంభింపవలెను. ఇట్లే ఈ ఛందమున మాత్రాసమకము, వానవాసికవి శ్లోకము, చిత్ర, ఉపచిత్ర, పాదాకులకము, గీతార్యశిఖజ్యోతి, సౌమ్య చూలికాది భేదములున్నవి.

ప్రాకృత చ్ఛందస్సులో ఎక్కువ మాత్రాచ్ఛందస్సులు కనిపించుచున్నవి. ఇందు 1. గాథా 2. దోహా 3. రసికాలేక ఉక్కచ్ఛా 4. రోలా 5. గంధానా 6. చౌపదిఆ 7. ఘత్తా 8. ఘత్తానంద 9. ఛప్పఉ - కబ్బఉల్లాల 10. పఝ్ఝటికా 11. అడిల్లా 12. చఉబోలా 13. రడ్డా 14. సోమావత్తి 15. కుండలిఆ 16. గంగనాంగ

17. చోఆఇ – ఝుల్లణ – ఖంజు – సఖా – మాలా – చులిఆలా 18. సోరట్ఠా 19. హాకవి 20. మహుభార 21. అహర 22. గండఅల 23. దీపక్క 24. సింహఅలోఅణ 25. పఅంగమ 26. లీలావఇ 27. హరిగీఅ 28. దుమ్మిలఓ 29. హీర 30. జలహరణా 31. మహణహరా 32. మరహ.. ముఖ్య భేదములును మరియు ఇందు అవాంతర భేదములును గలవు.

సంస్కృత భాషలో వాడుకలో నున్న ఛందస్సు ననుసరించి ఆంధ్ర భాషలోని మార్గకవితా రూపకల్పన గావింపబడినది. మార్గకవితకు పూర్వమాంధ్రదేశమున దేశి రచనలు వ్యాపించి యుండెను. దేశి రచనలలో జాతులు, ఉపజాతులు పేర్కొనదగినవి. ఈ జాత్యుపజాతులు ప్రాఙ్నన్నయ శాసనములందు కనిపించుచున్నవి. దేశి రచనా విధానము క్రీ.శ. ఆరవ శతాబ్ది నుండియే ఆరంభమైనను అప్పటికి పరిపక్వస్థితి నందలేదు. ఆరవ శతాబ్ది నుండి ఆంధ్రదేశము లోని కొన్ని మండలములను పాలించిన రేనాటి చోళులు శాసనములు వెలసిన కాలమునుండి తెలుగు కవిత వర్ధిల్లినది చెప్పవచ్చును. క్రీ.శ. 575లో వేయింపబడిన ధనంజయుని కలమళ్ళ శాసనము రేనాటి చోలుల శాసనములలో మొదటి శాసనమే కాక ఇప్పటివరకు లభించిన శాసనములలో నిదియే మొట్టమొదటి తెలుగు శాసనమని భావింపబడినది.

రేనాటిచోళుల శాసనములలో ధనంజయుని కలమళ్ళ శాసనము, పుణ్యకుమారుని తిప్పలూరి శాసనము, రామేశ్వర స్తంభ శాసనము, పొట్లదుర్తి, మాలెపాడు శాసనము, బూడిదగడ్డపల్లి శాసనములు ముఖ్యమైనవి. ఈ శాసనములు తెలుగుభాష, ప్రాకృత ప్రభావము కల్గియుండుటే గాక, మాత్రాగణములతో కూడి, తెల్గుభాష ప్రారంభ దశను తెలుగు ఛందస్సు యొక్క ప్రథమ దశను చూపుచున్నది.

రేనాటి చోళుల శాసనములందున్న వృత్తగంధి పద్యపాదములలో ముఖ్యమైనవి ఈ క్రింద నీయబడుచున్నవి.

1. పుణ్యకుమారుండు, గణ్యమానుండు – తిప్పలూరి శాసనము.

ఇది ద్విపద పాదము – పుణ్యకుమారుడు, గణ్యమా ఉండు పాదములలో ప్రాసయతి వాడబడనది.

2. విరిపట్టి కమ్మరి వినియన వ్రాసె – రామేశ్వర స్తంభ శాసనము.

ద్విపద పాదము – యతి సరిగా నున్నది.

3. శ్రీ మహేన్ద్రన్ మాన రవి మాఋ రాపిదుగు

ఛందమాత్రకములగు నాలుగు గణములీ పాదమునందున్నవి. ఈ పాదము ద్విరదగతి రగడకు సంబంధించినది. యతి మాత్రము లేదు.

4. మగడు పుదల మేలు వాడు కాడి చోళ ముత్త రాజు

నాలుగేసి సూర్యగణములతో కూడిన రెండు పాదములు. తురగ వల్గన రగడకు సంబంధించినవి. యతి మాత్రము లేదు.

5. అచ్చెర్వాంను నరివరజముందన్వాడు

దన్తియనుంగుతో (అన్) పాడుచిపడియెన్ – బూడిదగడ్డపల్లి శాసనము

కొలది మార్పులతో సీసపద్యము వలెనున్నది. కాని యతులు లేవు.

6. అణపోతులు రేవణకాలు పుద్దణకాలు

ఇచ్చిన పన్నస పెన్వార ఇశెరేనికిన్ – పొట్లదుర్తి మాలెపాడు శాసనము

మొదటి పాదమున ప్రాసయతి యున్నది. అణపోతులు రేవణ్ణకాలు పుద్దణకాలులో ప్రాస యతి యున్నది.


**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**

**ఫోన్ : 934 7971177**




# స్వచ్ఛతా సారథిపైన విరిసిన "గాంధీ మొగ్గలు"

**డా. వీపూరి వెంకటేశ్వర్లు,** కర్నూలు, ఫోన్ : 98855 85770

భారతదేశం గాంధీజీని 150 సంవత్సరాలుగా జాతిపితగా ఆరాధిస్తున్నదంటే, గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నదంటే గాంధీజీ గొప్పదనమేమిటో చెప్పనక్కర్లేదు. గాంధీజీ "శాంతి, అహింస, సత్యం" అనే ఆయుధాలను ధరించి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టిన జాతిపిత. ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశానికి విముక్తి కలిగించిన స్వాతంత్ర సమరయోధుడు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి ఉద్యమాలతో ఆంగ్లేయులను గడగడలాడించిన సింహస్వప్నం. "సత్యంతో ప్రయోగాలు" చేసిన అహింసయోధుడు. ఆ మహనీయుని జీవితం గురించి తెలుగు సాహిత్యంలో ఎందరెందరో కవులు, రచయితలు కథలుగా, కవితలుగా, గేయాలుగా, పద్యాలుగా, నాటకాలుగా, నవలలుగా ఆవిష్కరించారు. ఆ మార్గంలో నేటికీ కూడా కవులు, రచయితలు తమదైన శైలిలో ప్రతి గాంధీజీ జయంతి సందర్భంగా రచనలు చేస్తూనే ఉన్నారు. ఈ కోణంలోనే గాంధీజీ 150 వ జయంతిని పురస్కరించుకుని 150 మంది ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కవులు చంద్రునికో నూలుపోగులా అక్షరాభిషేకం చేసి ఆవిష్కరించిన మొగ్గల కవితాసంకలనం "గాంధీజీ మొగ్గలు".

తెలుగు సాహిత్యంలో నూతనంగా ఆవిర్భవించిన కవితా ప్రక్రియ "మొగ్గలు". దీని సృష్టికర్త డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ గారు. కవిగా, రచయితగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా రాణిస్తూనే పాలమూరు సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్విరామంగా సాహిత్య కార్యక్రమాలు చేస్తున్న సాహిత్య సేవకులు. ఒకవైపు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే మరోవైపు తెలుగు సాహిత్యంలో నిరంతరం సాహిత్యాభివృద్ధికి ఇతోధికంగా సేవలందిస్తున్నారు. ఆ దిశగానే గాంధీజీ చేసిన సేవలను స్మరిస్తూ, కీర్తిస్తూ 150 మంది కవులు రాసిన మొగ్గలను సేకరించి, వాటిని ఒక దగ్గరికి చేర్చి, మాలగా తయారుచేసి, వాటి పరిమళాలను మనకందరికీ అందజేయాలనే తలంపుతో **"గాంధీ మొగ్గలు"** గా తీసుకురావడం అభినందనీయం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎన్నో సాహిత్యప్రక్రియలు ఆవిర్భవిస్తున్నాయి. **"మొగ్గలు"** కవితాప్రక్రియ ఆవిర్భవించిన అనతికాలంలోనే ఎంతోమంది కవులు ఆదరించి అక్కున చేర్చుకుని మొగ్గలను పరిమళింపజేస్తున్నారు. ఈ మొగ్గలు మూడు పాదాల కవితాప్రక్రియ. ఇందులోని మొదటి రెండు పాదాలు ఒకే వాక్యంలో వస్తూ మూడవపాదం పై రెండు పాదాలను సమర్థిస్తూ ఒక సూక్తిగానో, ఒక నినాదంగానో, ఒక సామెతగానో, ఒక జాతీయం గానో ఉండడం మొగ్గలు కవితాప్రక్రియ లక్షణం. ఈ మొగ్గలు ఛందోబద్ధ నియమం లేకుండా, మనసులోని భావాలను అందరికీ అర్థమయ్యేవిధంగా వ్యక్తపరిచేటట్లు రాసే ప్రక్రియ. అక్షరజ్ఞానంలేని వారు సైతం అర్థం చేసుకునే ప్రక్రియనే కాకుండా పదోతరగతి స్థాయి విద్యార్థులు కూడా రాసే సులువైన ప్రక్రియ. ఈ మొగ్గలు కవితాప్రక్రియలో ఇంతవరకు అనేక కవితాసంపుటాలు, కవితా సంకలనాలు వెలువడ్డాయి. గాంధీజీ 150 వ జయంతిని పురస్కరించుకుని 150 మంది కవులు ఆంగ్లేయులతో అలుపెరుగని పోరాటాన్ని సాగించిన గాంధీజీ జీవితాన్ని చక్కగా ఆవిష్కరించారు. ఆయన అకుంఠిత దీక్షాదక్షతకు నివాళులర్పించారు. జీవితాంతం సత్యంతో జీవించిన ఆచారణవాదిని అక్షరాల్లో నిండుగా నీరాజనం పలికారు.

**నైతిక విలువలతో కూడిన వ్యక్తిత్వమే**
**శాంతియుత సహజీవనానికి మార్గమన్నాడు**
**ప్రపంచ దేశాలన్నింటికీ దిక్సూచి గాంధీజీ**

కవయిత్రి కె.సువర్ణాదేవి రచించిన ఈ మొగ్గలో ప్రపంచదేశాలకు ఆదర్శనీయమైన గాంధీజీ వ్యక్తిత్వం కొనియాడబడింది.

**మగువ మద్యం మాంసం వీడాలంటూ**
**హితవు పలికిన మహోన్నతుడు గాంధీజీ**
**మూడు ప్రమాణాలుగా తల్లికిచ్చె గాంధీ మాట**

ప్రముఖ కవయిత్రి చివుకుల శ్రీలక్ష్మి రాసిన ఈ మొగ్గలో తల్లికిచ్చిన మాటను జీవితాంతం జవదాటని మహోన్నత వ్యక్తి గాంధీజీ అని ప్రశంసించారు.

**బక్కపలచని రూపు బోసినవ్వుల చూపు**
**ముతకగుడ్డలతోనే ఉతికి ఆరేసినవాడు**
**కొల్లాయిగట్టిన కొదమసింహం గాంధీజీ**

ప్రముఖ కవి పెసరు లింగారెడ్డి రాసిన ఈ మొగ్గలో గాంధీజీ రూపంతో పాటు గాంధీజీ మనోధైర్యం పేర్కొనబడింది.

**మనసులో స్వచ్ఛత లేకుంటే**
**నడిచే మార్గంలో కూడా ఉండదన్నాడు**
**నిజాయితీ మంత్రమని చాటాడు గాంధీజీ**

ప్రముఖ యువకవి పుట్టి గిరిధర్ రాసిన ఈ మొగ్గలో గాంధీజీ ఆచరించిన సిద్ధాంతాన్ని ఆవిష్కరించబడింది.

**స్వయంగా మురికివాడలు శుభ్రంచేసి**
**అన్ని కులాలు మతాలు ఒక్కటేనన్నాడు**
**అందుకే మహాత్ముడు అయ్యాడు గాంధీజీ**

యువకవి సుంకరి బస్వరాజప్ప రచించిన ఈ మొగ్గలో గాంధీజీ స్వయంకృషి వివరించబడింది.

**ఓర్పునేర్పుల ఒడిలోన పల్లవించిన మానవతకు**
**పరిమళాలనద్దే శాంతికపోత సంకేత జయకేతనం**
**బాపూజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం అభ్యుదయం**

యువకవి రాజశేఖర సిద్ధాంతి రచించిన ఈ మొగ్గలో గాంధీజీ గ్రామస్వరాజ్యం కల విశదీకరించబడింది.

**విదేశీ వస్తువులను బహిష్కరించాలని పిలుపునిచ్చి**
**ఖద్దరు ధరించాలని కోరిన నిజమైన భారతీయుడు**
**భారతదేశపు గొప్ప ఆర్థికవేత్త మహాత్మాగాంధీజీ**

యువకవయిత్రి సునీత బండారు రాసిన ఈ మొగ్గలో ఖద్దరు ప్రాధాన్యత కీర్తించబడింది.

**ఎన్ని పుస్తకాలను శోధించి పరిశోధించినా**
**తన జీవిత మలుపు భగవద్గీతనేనన్నాడు**
**భగవద్గీత గొప్పతనాన్ని చాటినవాడు గాంధీజీ**

యువకవి కపిలవాయి వెంకటేశ్వర్లు రాసిన ఈ మొగ్గలో గాంధీజీకి అనుబంధమున్న గ్రంథం భగవద్గీత కొనయాడబడింది.

ఇలా "గాంధీ మొగ్గలు" కవితాసంకలన గ్రంథంలో గాంధీజీ గురించి వివిధ రకాలుగా ఆవిష్కరించినప్పటికీ గాంధీజీ సేవల్ని సమగ్రంగా, సంపూర్ణంగా ఆవిష్కరించడమనేది ఎప్పటికీ పూర్తవదు. ఆది అంతంలేని విశ్వం వలనే విశ్వమానవులైన గాంధీజీ పరిపూర్ణ జీవితాన్ని దర్శించడానికి ఇంకా కొన్ని పార్శ్వాలు మిగిలే ఉంటాయి. ఆ దిశగా వెలువడిన ''గాంధీ మొగ్గలు'' తెలుగు సాహిత్య ప్రపంచానికి, తెలుగుజాతి పునరుజ్జీవనానికి ఓ కరదీపికగా, మార్గదర్శిగా ఉపయుక్తం అవుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**గాంధీ మొగ్గలు, సంపాదకులు : డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్,**

పేజీలు: 160, వెల. 100/-, ప్రతులకు: డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్ నగర్ - 509001, సెల్ : 9034844017)

# వ్యాస భారతి

**డా. శ్రీరంగాచార్య,** ప్రముఖ సాహితీవేత్త, హైదరాబాద్. ఫోన్ : **9299451266**

డా. మందపూడి వేంకటేశ్వర్లుగారు రచించిన 'వ్యాసభారతి' అనే గ్రంథం వివిధ వ్యాసాల సంపుటి. ఇందులో సంస్కృత కవియైన కాళిదాసుతో ప్రారంభించి అనేక విషయాలతో కూడిన ఇరవై మూడు వ్యాసాలు వ్రాశారు. ఇవి వివిధ సందర్భాలలో రచించినవి.

వేంకటేశ్వర్లుగారు తెలుగు పండితులుగా ముప్పైసంవత్సరాలు హైస్కూలులో పనిచేయడమే కాక ప్రబంధాలమీద పరిశోధన చేసి డాక్టరేటు డిగ్రీని పొందియున్నారు. అందువల్ల ప్రతివ్యాసంలోను అనేకవిషాయాలు తెలుపబడ్డాయి.

ఇందులో - మహాకవి కాళిదాసు, సీతారామకల్యాణ వైశిష్ట్యం, మహాశివరాత్రి - శివతత్త్వం, భగవద్గీతా ప్రాశస్త్యం, ప్రబంధాల్లోని ఉపాఖ్యానాల ప్రయోజనం, ఆముక్త మాల్యద, వసుచరిత్రలలోని కవితావైభవం, మాలదాసరి కథ, తిన్ననికథ, నిగమశర్మోపాఖ్యానం వీటిలోని ప్రత్యేకత; రాజశేఖర చరిత్రలోని వర్ణనానైపుణ్యం; తెలుగుసాహిత్యంలో అక్కడక్కడా ఉన్న సూక్తులు - ధర్మాల వివరణ; హిందూధర్మ విశిష్టత; వివేకానందుని విశిష్టత; సత్యసాయి బాబావారిని గురించి రచించిన గ్రంథ సమీక్ష, కాళోజీ నారాయణరావుగారి సంగ్రహపరిచయం ఇలా ఆయా వ్యాసాల్లో ఎన్నో విషయాలు చెప్పబడ్డాయి.

అంతేకాదు; ఉగాది పండుగయొక్క ప్రత్యేకత, సీతారామ కల్యాణంలో ఆయాకవులు చెప్పిన విశేషాలు, శివరాత్రి విశిష్టత-శివతత్త్వం యొక్క మహిమ; దాసరిదైవభక్తి; వసుచరిత్రలోని శ్లేష విశ్లేషణ, తిన్నని మూఢభక్తి; నిగమశర్మ నీచప్రవర్తన, రాజశేఖర చరిత్రలోని వర్ణనావైశారద్యం, సత్యవాక్యంయొక్క మహిమ, అహింసా స్వరూపం, కర్మసిద్ధాంతం, కాలమహిమ, కీర్తియొక్క గొప్పదనం, గృహస్థాశ్రమ ప్రాశస్త్యం, ధర్మం యొక్క విశిష్టత, మాతాపితరులసేవ ఫలం, సదాచారం వల్లగలిగే ఫలం, హిందూ ధర్మ విశిష్టత, వివేకానందుని ప్రతిభ, కాళోజీగారి వ్యక్తిత్వం.... ఇలా ఎన్నో విశేషాలు తెలియజేయబడ్డాయి.

ఇందలి శైలి సులభంగా ఉండి పాఠకులను చదవాలనే ఆసక్తిని రేకెత్తించే విధంగా ప్రకాశిస్తున్నది.

**వ్యాసభారతి (వ్యాససంపుటి)**
**పేజీలు : 230, వెల : 150/-**
**రచయిత - డా. మందపూడి వేంకటేశ్వర్లు**
**ఫోన్ : 9908425354**
**ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు**

# జీవన హిందోళం - వినూత్న మందారం

ఘనపురం సుదర్శన్, తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9000 470 542

జీవితచరిత్ర అంటే ఎదుటివాళ్ళ జీవితం గురించి, ఆ జీవితం లోని విశిష్టత గురించి సమాజానికి తెలియచెప్పేందుకు వేరొకరు రాసే రచన. ఆత్మకథ అంటే తన జీవితం గురించి తాను సాగించిన జీవితం తాలూకు లోతుపాతుల గురించి నిజాయితీగా వేరొకరికి తెలియజెప్పేలా తానే రాయడం. తెలుగు సాహిత్యంలో ఇవి రెండూ వేరువేరుగా ఉన్న ప్రక్రియలు. కానీ ఈ రెండింటి కోవలోనే రెండింటిని మేళవిస్తూ వచ్చిన ఒక రకమైన సరికొత్త ప్రక్రియగా భావించబడేది ఆత్మకథాత్మక జీవిత చరిత్ర. ఇటువంటి కోవలో వచ్చిన రచనలలో 'నాయన' (గుంటూరు లక్ష్మీకాంతం) రచన ఈ పుస్తకం కన్నా కాస్త ప్రాచీనమైతే, నవీన రచనా సొబగులతో ఇటీవల తాజాగా వచ్చిన మరో రచన 'జీవన హిందోళం'. రచయిత డాక్టర్ గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి.

శ్రీనివాసమూర్తి గారు ఎప్పుడూ పరిశోధనకు తాజా చిరునామాగా నిలుస్తారు. వారు ఏ రచనను రాసినా దాని రూపకల్పనలో ఏదో ఒక నూతన సమీకరణాన్ని చేర్చుతారు. అది వారి రచనా శైలి. రచనకు అందించే నూతనదృక్పథం కూడా అతి నవీనంగా ఉంటుంది. ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ, మా ప్రసిద్ధిపేట, తెలంగాణం తెలుగు మాగాణం వంటి రచనలలో తనదైన ఆ ముద్రను వేసుకున్నారు. ఇటువంటి వినూత్నమైన రచనా శైలిలో పుస్తక జాబితాలోకి చేరిన మరో రచనయే జీవన హిందోళం.

ప్రసిద్ధ అవధానియైన గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహశర్మ గారు రచయిత గారి తండ్రి. ఈ పుస్తకంలో లక్ష్మీ నరసింహశర్మ గారి జీవితాన్ని, ప్రధానంగా వారి అవధాన పాండిత్య ప్రకర్ష గురించి తెలుపుతూ తండ్రితో తనకున్న జ్ఞాపకాలను, ప్రసిద్ధ వ్యక్తులతో తండ్రికున్న పరిచయాలను తెలుపుతూ రచించారు.

'అవధానం' ఇది నాలుగు అక్షరాల సమూహమే ఐనా సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందిన ప్రక్రియ. మేధోతనాన్ని, ధారణ శక్తిని, ఆశు పాండిత్యాన్ని, ఛందోబద్ధమైన స్ఫృహను పునాదులుగా మలుచుకొని వినిర్మితమైన ప్రక్రియ అవధానం. ఇతర ఏ భారతీయ భాషల్లోనూ లేనటువంటి అరుదైన సప్రమాణ గుణాత్మకమైన ఈ అవధాన ప్రక్రియ తెలుగు, సంస్కృత భాషల్లోనే ఉన్నదని ప్రతీతి. అటువంటి ఉన్నతమైన ప్రక్రియలో ప్రవేశం ఉండటమే గొప్ప ఖ్యాతి. అలాంటిది ప్రవేశాన్ని మించిన పాండిత్య ప్రకర్షను సాధికారికంగా సాధించడం అంతకు మించిన ఖ్యాతిని పొందటమే. ఆధునిక సాహిత్య కాలానికి కొంచెం ఇటు పక్కగా, జంట కవులైన తిరుపతి వెంకట కవులు, కొప్పరపు సోదరులు అవధానంలో తమ ప్రతిభా పాటవాలను చూపించి ఎవరెస్టు శిఖర స్థాయికి ఎదిగి ఎందరో కవులకు, అవధాన అభిరుచి గల ఔత్సాహికులకు ఆదర్శప్రాయులయ్యారు. ఇటువంటి మేధో పరమైన పాండిత్య ప్రక్రియ తెలంగాణ ప్రాంతంలోనూ ఫరిడవిల్లింది. ఇంతటి ఘనమైన అవధాన ప్రక్రియను గురువుల ప్రోద్భలంతో తనలో లీనం చేసుకున్న ప్రసిద్ధ కవే అవధాన శశాంక–ఆశుకవితా కేసరి బిరుదాంకితులైన శ్రీ గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహశర్మ.

**జీవన హిందోళం**

**రచన :**


డాక్టర్ గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి.

ప్రసన్న శివానంద ప్రచురణలు

పేజీలు : 144, వెల : 58

ప్లాట్ నెం. 20, ఇం.నెం. 6-242/6, ఎం.ఎన్. రెడ్డి నగర్, సుచిత్ర సర్కిల్ దగ్గర, సికింద్రాబాద్

సెల్ : 98669 17227




1934, ఫిబ్రవరి19 న జన్మించిన లక్ష్మీ నరసింహశర్మ గారు చిన్ననాటినుండి చదువుకోవడానికి అమితాసక్తితో ఉండడం మూలాన కొన్ని కుటుంబ కారణాల వలన తను పదవ తరగతిలో చేరేనాటికి ఇరవై ఏళ్ళ వయస్సుకు వచ్చారు. అయినా విద్యను పూర్తి చేసి, విద్వత్తును పొందే క్రమంలో, ఉద్యోగ బాటలో పలు ప్రాంతాల్లో ఉండడంతో అవధానం చేయాలన్న తృష్ణ కలిగింది. దాంతో ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ అవధానం చేయడానికి ప్రాంతాలకు పరిమితి పెట్టుకోకుండా సొంత జిల్లా మెతుకు సీమ నుండి ఒకనాటి ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ, కోస్తాంధ్ర వరకు దాదాపుగా అన్ని జిల్లాలకు వెళ్లి గొప్పగా అవధానం చేసి తన ప్రతిభను చాటుకున్నారు. లక్ష్మీనరసింహశర్మ గారికి అవధానంపై ఎంత ఆసక్తి ఉండేదంటే ఇంటివైపు మరలకుండా ఒక్కోసారి వరుసగా నాలుగైదు రోజులు అవధానం చేసేవారు.

వీరి అవధానాలకు దాశరథి, కాళోజీ వంటి ప్రసిద్ధ కవులు శ్రోతల గణంలో ఉన్నారంటే వీరు ఎంతటి అవధాన కీర్తిమంతులో చెప్పవచ్చు.

తన యావజ్జీవిత కాలంలో అవధానం కోసం పరితపించారు. అవధానాన్ని ఆరాధించారు. అవధానం కోసమే ఆయువుతో ఉన్నారేమోనని అనిపించేలా చెరగని ముద్ర వేసుకున్నారు. అంత్య కాలంలోనూ అవధానం చేయాలని ఉన్నా అనారోగ్యం మూలాన ఆసుపత్రిలో ఉండి పడక మీద నుంచే ఆశుపద్యాలు చెప్పేవారంటే వారికి అవధానంపై ఉన్న యిష్టతను ప్రశంసించక తప్పదు. అలవోకగా పద్యాలు చెప్పడం, స్వయంకృషితో హిందోళ, కళ్యాణి, మోహన రాగాలు ఆలపించడం వీరి మరో అరుదైన విద్వద్విశేషం. ఇలా తన జీవనయానంలో లక్ష్మీ నరసింహాశర్మ గారు ఏ ఆందోళన లేకుండా హిందోళం రాగాన్ని అలవర్చుకున్న ప్రతిభామూర్తి. అశేష కీర్తిని పొందిన సౌజన్యశీలి.

తన జీవితకాలంలో కవితా కళ్యాణి, అవధాన సరస్వతి, వాగీశ్వర స్తుతి, ఆద్యమాతృక, పద్యోద్యానం వంటి మేలిమి రచనలు సృజించిన అవధాన ప్రాతః స్మరణీయులు శర్మ గారు.

ఇక ఈ పుస్తక రచనా శైలి విషయానికి వస్తే, ఆసాంతం పఠనమార్గంలో రచయిత అవసరం లేకుండా పాఠకుడు తనంతట తాను సాఫీగా వెళ్లేందుకు వీలయ్యేలా అతి సునాయాసంగా ఉంది ఈ రచనా శైలి. అలతి అలతి పదాలతో చమత్కారంగా, అతి సరళమైన వాక్యాలతో అక్కడక్కడ హాస్యస్ఫోరకంగా ఉండడం ఈ రచనా యొక్క మరో ప్రత్యేకత. ఇలా తెలంగాణలో అవధానాన్ని గురించి, అవధానం ప్రత్యేకత గురించి, గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహశర్మ గారి జీవితం గురించి తెలుసుకునేందుకు అరచేతిలో ఒదిగే ఈ చిన్న పుస్తకం ఎంతగానో ఉపకరిస్తుంది.

# వెన్నెల

వెన్నెల జారుదు బండపై ఒక్కసారైనా జారలే
వెన్నెల బిగికౌగిట్లో ఒక్క రాత్రైనా నలిగిపోలే
డాబాపై పడకేసినా పురుగో బుషో భయంతో వెలిగే లైటు
వెన్నెలసంగమంలో ఒడ్డును తాకే
సముద్రపు మదపుటేనుగు ఎలా అవుతా


పల్లెలు, పట్నాలు పాలలైట్ల మధ్య జనజీవనం
అమాస పున్నమిల బతుకులకు లేదిక్కడ దిక్కు దివాణం
తేదీలకున్న విలువ తిథులకు ఎక్కడుంది

వెన్నెల కాస్తే అడవి జీవులకు ఆనందం
పక్షులు, జంతువులు, మనుషులు వేటలేని సహజీవనం
వెన్నెల చెలి చేయి పట్టుకుంటే తీరుతుంది ఉప్పస

ముద్ద తినిపించడానికి అమ్మ చేయించింది దోస్తీ చందమామతో
వంక నుంచి గుండ్రం వరకు పెరిగే పాల ధార
నెలకోసారి నేత్రపర్వం వెన్నెల జోల పాటలు
వెన్నెల తల్లి ఒడిలో పసిపాపై ఆడుకోవాలనుంది


ఆకలి కడుపు అరుపులతో గొంతు కలిపి నడిచినా
వెన్నెల సాహిత్యం తిన్నప్పుడు అతుక్కున్న మెతుకులు
వాసన ఊరికే పోతుందా కారుతుంది కొంతైనా

**కొమురవెల్లి అంజయ్య**
**సిద్ధిపేట, ఫోన్ : 9848005676**





**తెలంగాణలో నృత్యం** (వ్యాస సంకలనం)
**ప్రచురణ :** తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలంగాణ ప్రభుత్వం, కళాభవన్, హైదరాబాద్.
వెల : 300 /-
**ప్రతులకు :** తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలంగాణ ప్రభుత్వం, కళాభవన్, హైదరాబాద్.
ఫోన్ : 7675 955 208, వాట్సాప్ : 8309281780


## స్వ'కృతి'



**సామల సదాశివ**
ఆచార్య జి. చెన్నకేశవ రెడ్డి
వెల : 50/-
**ప్రతులకు :** సాహిత్య అకాడమీ, స్వాతి మందిర్ మార్గ్, న్యూఢిల్లీ - 110001. మరియు కోల్‌కత్తా, చెన్నై, ముంబై, బెంగుళూరు.




**కరోనా కాలంలో మా కాపురం - మరికొన్ని కవితలు**
ఆచార్య జి. చెన్నకేశవ రెడ్డి
వెల - 150 /-
**ప్రతులకు :** జి. సుమిత్ర, విల్లా -5, సైబర్ మీడోస్, నియర్ జడ్.పి.హైస్కూల్, కొండాపూర్, హైదరాబాద్ - 500 084.
ఫోన్ : 9492047027



**స్వాతంత్ర్య సమర వీరులు**
సంకలనం : భారతీ కమలాకర్
**ప్రతులకు :** 3-10-6, శ్రీలక్ష్మీ రెసిడెన్సీ, గోఖలే నగర్, రామంతాపూర్, హైదరాబాద్ - 500 013. ఫోన్ : 7675 955 208, వాట్సాప్ : 8309281780





**వేముల వాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్ర చరిత్ర**
వెల : 800/-
**వేముల వాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్ర ఆనువంశిక బ్రాహ్మణ్య చరిత్ర**
వెల : 600/-
సంకేపల్లి నాగేంద్ర శర్మ
ప్రతులకు: 6-6-1031/1, శివాజీ నగర్, 24వ డివిజన్, కరీంనగర్ - 505 001.
ఫోన్ : 94417 97650, 8074 826 371

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షష్ఠిపూర్తి శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

# సాధువర్తనంబు సరి యైన బతుకురా!





కాలమేమి ఇచ్చు కాఠిన్యమును ఇచ్చు
అవని హద్దు యనుచు ఆజ్ఞ నిచ్చు
హద్దులన్ని చెరిపి అందుకో విజయమ్ము !
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

నేతనేయు వాడు నేతన్న బతుకట్లు
కాంచియుండు బతుకు కవిది కూడ
పడుగు పేక బతుకు పట్టెడన్నము ఏది
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

మనసులోన ఉన్న మాలిన్యములనెల్ల
గుండెగూటి లోన కూడ తుడిచి
పుటము పెట్టు బతుకు పూర్ణ శుద్ధముగాను
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

గుండె గాయమైన గురుతులు చూడుదు
కంటి నీరు వెతలు కలిపి కూర్చి
ఆర్తితోడ వ్రాయ అరయ పద్యమువచ్చు
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

రాజు ఒకడె వాడు రారాజు సూర్యుడు
కోటి నక్షత్రములు కొరను గావు
మినుకు మినుకు మనెడు మిణుగురు లేపాటి?
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

మంచి గంధమొకటి అంచితంబైయుండ
చేరి ఒకడు చెరుపు చేయదలచు
దుష్ట బుద్ధి వాని దుర్మార్గమును చూడు
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

మనసు మంచిదైన మమతలు కొలువుండు
కుంచితత్వమదియె కూడి రాదు
నటన అదియె నిన్ను నట్టేట ముంచును
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

నిండు మనసుతోన నిర్మలంబైనట్టి
సుకవి మాట తీరు శోభ గూర్చు !
మంచి మనసు వారి మాట తీరే వేరు !
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

మనసు శుద్ధి చేయు మహిమతో పద్యం
మేధ పదును పెట్టు మేటిగాను
పద్య మనగ నదియె పసిడి పంటల రాశి !
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

మనసునందు ఉన్న మాలిన్యములు పోవ
పద్య విద్య నెరిగి పాడి చూడు
నిన్ను శుద్ధి చేయు నిజముగా పద్యము
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

గుండె గూటి లోన గూడు కట్టిన యట్టి
పదము పదము తెలిసి పాటి గాను
నిజం సుమ్మి అదియె నీతి పద్యమగును
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

అడ్డ దిడ్డమైన అవకాశవాదిగా
ఉండబోకు నీవు ఉర్వి మీద
సాధువర్తనంబు సరి యైన బతుకురా!
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

కంటి నిండ నిద్ర కడుపు నిండయు తిండి
ఉన్నవాడె ఘనుడు ఉర్వీమీద
చీకు చింత లేని చిరు సంపదలె మేలు
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

ఎవడు నిన్ను గాని ఎగతాళి చేసినన్
చిన్న చూపు చూడ చిత్రముగను
ప్రతిభ తోడ సాగు ప్రగతి సోపానాల
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

తప్పు చేయబోకు తలబట్టుకోకురా!
స్వార్థ బుద్ధి వీడి సాగి పొమ్ము
నిక్కమైన పనికి నిట్టూర్పులుండవు
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

జాషువాను ఎరుగు జాను తెలుగెరుగు
పద్య సౌరభమ్ము పసిడి విద్య
కూర్పు నేర్పు తెలిసి కూర్చరా పద్యమ్ము !
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

పద్య విద్య నెరిగి పదుగురు మెచ్చగా
తేనెలూరు నట్టి తెలుగు లోన
తేజముట్టి పడగ తెలుగు పద్యము రాయ
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

పూర్వ కవుల నెరిగి పుణ్యమూర్తులనెర్గి
మాతృ భాష లోని మర్మ మెరిగి
పలికింతు నేను పద్యమును తెలిసి
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

పద్యమనగ నదియె పసిడి సిరుల పంట
పద్యమన్న అదియె పాడి ఆవు
కామధేనువదియె కామితాలిచ్చును
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

మనసు కదియె హాయి మరి పద్యమన్నను
కలము హలము పట్టి కవిత పేర్చి
తోడు వచన పద్య జోడు గుఱ్ఱాలపై
సాగి పోతు నెపుడు సత్యముగను !

గుండె లోని గోడు కూడ యెట్టుల తీరు
పద్యమదియె నాకు పాటి చేయ
మందు మనసు కదియె మరిపింపు భాధను
సబ్బని కవి పల్కు సత్యమెపుడు

**డా. సబ్బని లక్ష్మీనారాయణ**
కరీంనగర్, ఫోన్ : 8985 251271